# భారత శక్తి ®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 190 | హైదరాబాద్ | ఆదివారం 18-01-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

భారత్, పాకిస్థాన్‌లతో సంబంధాలపై
అమెరికా రిపబ్లికన్ పార్టీ నేత కీలక వ్యాఖ్యలు

## బీహార్‌లో గెలిచాం..
## బెంగాల్‌కు సమయం ఆసన్నమైంది



11లో

- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మమత ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్న నరేంద్ర మోదీ
- కేంద్రం ఇస్తున్న నిధులను మమతా బెనర్జీ కొల్లగొడుతోందని విమర్శ

## కాకినాడలో ఏఎమ్ గ్రీన్ ప్రాజెక్టుకు
## శంకుస్థాపన చేసిన సీఎం, డిప్యూటీ సీఎం

- కాకినాడలో రూ.18 వేల కోట్ల ఏఎమ్ గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు శంకుస్థాపన
- రాష్ట్రానికి ఈ ప్రాజెక్టు గేమ్ ఛేంజర్ అవుతుందన్న సీఎం చంద్రబాబు
- ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా పరిశ్రమగా రూపకల్పన
- 2027 జూన్ నాటికి ప్రాజెక్టు తొలి దశ ఉత్పత్తి ప్రారంభం
- రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ప్రకటన




11లో

## ఎన్‌కౌంటర్‌లో కోటి రూపాయల రివార్డ్ ఉన్న
## మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు మృతి




11లో

- బీజాపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్
- ఇద్దరు మావోయిస్టుల హతం
- మృతుల్లో మావో నేత పాపారావు అలియాస్ మొంగు

## చైనా స్కూలులో
## నోరో వైరస్ కలకలం..
### వంద మందికి పైగా సోకిన వైరస్


- గ్వాంగ్ డాంగ్ ప్రావిన్స్‌లోని స్కూలులో 103 మంది విద్యార్థులకు నోరో వైరస్
- అప్రమత్తమైన అధికారులు.. స్కూలు చుట్టుపక్కల వైద్య పరీక్షలు చేస్తున్నట్లు వెల్లడి
- స్కూలు మొత్తం వైరస్‌ను నాశనం చేసే మందులు స్ప్రే చేసిన అధికారులు




11లో

## యాడ్స్ విషయంలో కీలక నిర్ణయం తీసుకున్న చాట్‌జీపీటీ

- ప్రకటనల బాట పట్టబోతున్న చాట్‌జీపీటీ
- నిర్వహణ ఖర్చులను ఎదుర్కొనేందుకు యాడ్స్‌ను పరీక్షించనున్నట్లు ప్రకటన
- ఫ్రీ, తక్కువ స్థాయి సబ్‌స్క్రిప్షన్ వినియోగదారులకు మాత్రమే కనిపించనున్న యాడ్స్




11లో



11లో

## 25 ఏళ్లు కష్టపడి చదివితే 75 ఏళ్ల వరకు
## గౌరవంగా జీవించవచ్చు

- తొలి ప్రధాని నెహ్రూ సాగునీటి ప్రాజెక్టులు, విద్యకు ప్రాధాన్యత ఇచ్చారని వెల్లడి
- తమ ప్రభుత్వం కూడా వాటికే ప్రాధాన్యత ఇస్తోందన్న ముఖ్యమంత్రి
- విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందన్న ముఖ్యమంత్రి

## రేపు దావోస్‌కు సీఎం చంద్రబాబు
## నాలుగు రోజుల పాటు ఫుల్ బిజీ!




11లో

- ప్రపంచ ఆర్థిక సదస్సులో పారిశ్రామిక దిగ్గజాలతో చర్చలు
- ఐబీఎం, గూగుల్, మేర్క్స్ సీఈఓలతో కీలక సమావేశాలు
- 4 రోజుల పర్యటనలో 36 కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం
- తొలిరోజు 20 దేశాల ఎన్నార్టీలతో డయాస్పోరా సమావేశం

# ముందుకు సాగని వాణిజ్య చర్చలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ నేరుగా మాట్లాడకపోవడం వల్లనే ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదరలేదంటూ ఆ దేశ వాణిజ్య శాఖ మంత్రి హ్వావార్డ్ లుట్నిక్ పేర్కొనడం ఆసక్తి కలిగించింది. . రెండు దేశాలు సిద్ధమైన వెంటనే ఒప్పందాన్ని ప్రకటిస్తామని చెప్పారు. చర్చలకు గడువు అనేది చెప్పలేమని స్పష్టం చేశారు. ఇరు దేశాల చర్చా బృందాలు పెండింగ్‌లో ఉన్న దాదాపు అన్ని అంశాలపై వర్చువల్‌గా చర్చలు కొనసాగిస్తున్నాయని అగర్వాల్ చెప్పారు. ఒప్పందం చాలా దగ్గరలోనే ఉందని, అయితే ఇరు పక్షాలు సిద్ధమైనప్పుడే, సరైన సమయమని భావించినప్పుడే సరైన ప్రకటన వస్తుందని ఆయన మీడియాతో చెప్పారు.గతేడాది ఫిబ్రవరి 13 నుంచి ఇరుదేశాల మధ్య పలుమార్లు వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిగాయి. కొన్ని విషయాల్లో అంగీకారం కుదరకపోవడంతో ఒప్పందం సాధ్యపడలేదు.చివరిసారిగా డిసెంబర్ 11న భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ చర్చలు తుది దశకు వచ్చాయని, త్వరలోనే ఒప్పందం జరుగుతుందని కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్ ఆనాడు ప్రకటించారు. అయితే ట్రంప్‌తో మోదీ ఫోన్‌లో మాట్లాడనందునే ట్రేడ్ డీల్ జరగడం లేదని లుట్నిక్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితం. ఇదే విషయాన్ని భారత విదేశాంగశాఖ కార్యదర్శి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు.గతేడాది నుంచి వివిధ అంశాలకు సంబంధించి మోదీ, ట్రంప్ ఇప్పటివరకు 8 సార్లు ఫోన్‌లో సంభాషించుకున్నారన్నారు. ట్రంప్ మాట్లాడిన ప్రతీసారి మోదీ తనకు మంచి మిత్రుడనీ, భారత్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం చేసుకోబోతున్నట్లు చెప్పినట్లు తెలిపారు. బ్రిటన్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరిన వెంటనే, తదుపరి ఒప్పందం భారత్‌తోనే అని ట్రంప్ స్వయంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు.అయితే వాణిజ్యం విషయంలో భారత్‌కు స్పష్టమైన విధానాలు ఉన్నాయని, ఏ దేశంతోనైనా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు తన సర్వాధికారాన్నీ, స్వతంత్రతను కాపాడుకునే విధంగానే సంప్రదింపులు జరుపుతుందని జైస్వాల్ స్పష్టం చేశారు. ఇక ప్రతీ ఏడాది అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ఒప్పందాలు జరుగుతూనే ఉంటాయి. భారత్?అమెరికా మధ్య చర్చలు ఎప్పుడూ నిలిచిపోలేదని అగర్వాల్ అభిప్రాయపడ్డారు. ఇరు పక్షాలు నిరంతరం సంప్రదింపుల్లోనే ఉన్నాయని చెప్పారు. గత ఏడాది డిసెంబర్ చివరి వారంలో వాణిజ్య?పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్, అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్‌తో వర్చువల్ సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 10, 11 తేదీల్లో ఉప యూఎస్టీఆర్ రిక్ స్విట్జర్ నేతృత్వంలోని బృందం భారత్ పర్యటన తర్వాత ఈ సమావేశం జరిగింది. జనవరి 12న తన బాధ్యతల స్వీకరణ సందర్భంగా భారత్‌లోని అమెరికా రాయబారి సెర్జియో గోర్, వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ఇరు దేశాలు చురుకుగా పనిచేస్తున్నాయని చెప్పారు.భారత్, అమెరికా మధ్య సంబంధాలు ఉమ్మడి ప్రయోజనాలకే పరిమితం కావని, అత్యున్నత స్థాయిలో బలమైన అనుబంధం ఉందన్నారు.నిజమైన మిత్రులు విభేదించినా, చివరకు పరిష్కారం కనుగొంటారని గోర్ వ్యాఖ్యానించారు.ట్రంప్ ప్రభుత్వం విధించిన 50 శాతం వరకు ఉన్న భారీ సుంకాలు ద్వైపాక్షిక సంబంధాలపై ఒత్తిడి తెచ్చాయని అధికారులు పేర్కొన్నారు. అదనపు దిగుమతి సుంకాల అంశంతో పాటు, గత ఏడాది మేలో భారత్?పాకిస్తాన్ ఘర్షణ ముగిసిందని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు, వాషింగ్టన్ కొత్త వలస విధానం వంటి అంశాలపై కూడా ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం సానుకూల వృద్ధి నమోదు చేస్తోందని చెప్పారు.ఈ ఏడాది మాత్రం ఒప్పందంపై సంతకాలు చేసే విషయంలో జాప్యానికి అమెరికా అనుసరిస్తున్న విధానాలే ప్రధాన కారణమని చెప్పొచ్చు.ముఖ్యంగా చమురు కొనుగోలు విషయంలో భారత్ మొదటి నుంచి ఒక స్పష్టమైన వైఖరిని అవలంబిస్తున్నది. ఎన్నో ఏళ్లుగా మనం రష్యా నుంచే చమురు కొనుగోలు చేస్తూ వస్తున్నాం. కానీ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయవద్దంటూ ట్రంప్ పదేపదే ఆంక్షలతో భారత్‌ను బెదిరింపులకు గురి చేస్తున్నారు.రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు ఇప్పటికే 50 శాతం సుంకాలు విధించిన ట్రంప్ తాజాగా వారితో వ్యాపారం ఆపకపోతే టారిఫ్‌ను 500 శాతానికి పెంచడానికి సిద్ధమవుతున్నట్లు ప్రత్యక్ష హెచ్చరికలకు దిగడం కూడా భారత్, అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం జాప్యానికి కారణంగా నిలిచింది. ఇటీవలే వెనిజులాను తమ కబంధ హస్తాల్లోకి తీసుకున్న అమెరికా.. తమ నుంచి మాత్రమే చమురును కొనాలంటూ భారత్ సహా ఇతర దేశాలపై ఒత్తిడి తీసుకురావడం సమంజసం కాదు.పైగా ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని రష్యా ఆపాలనే ఉద్దేశంతోనే ఆ దేశం నుంచి చము రు కొనుగోలు చేస్తున్న దేశాలపై భారీ సుంకాలు విధించేందుకు సిద్ధమవుతున్నట్లు ట్రంప్ తనను తాను సమర్థించుకున్నారు. అంతేకాదు కేవలం సుంకాల విషయంలోనే వారం వ్యవధిలో తాను సంతోషంగా లేనన్న విషయం మోదీకి తెలుసని ఒకసారి, మోదీ నా పట్ల సంతోషంగా లేరంటూ మరోసారి భారత్ పట్ల మాటలు మార్చడం ట్రంప్‌కే చెల్లింది. ఈ నేపథ్యంలో భారత్‌తో ట్రేడ్ డీల్ జరగకపోవడానికి కారణమేంటనే దానిపై అమెరికా ఆత్మవిమర్శ చేసుకోవాలి.

# కూటమి ఉన్నట్లా.. లేనట్లా..

## మనల్ని కాదన్నట్లు దులిపేసుకుంటున్నారా?

విజయవాడ జనవరి 17,(భారతశక్తి)

తెలుగుదేశం పార్టీకి సీనియర్ల అవసరం ఖచ్చితంగా కనిపిస్తుంది. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నా, లేకున్నా కేవలం చంద్రబాబు నాయుడు మీదనే ఆధారపడి ఉండేలా పార్టీ నడిచేది కాదు. కానీ చంద్రబాబు నాయుడు ఇప్పుడు విదేశాలకు వెళ్లినా, మరొకచోటకు అధికార పర్యటనకు వెళ్లినా విపక్షం చేసే విమర్శలకు మాత్రం సూటిగా సమాధానమిచ్చే సీనియర్ నేతలు కొరవయ్యారనే చెప్పాలి. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఒకరిద్దరు నేతలు తప్ప ఎవరూ పెద్దగా పెదవి విప్పడం లేదు. ఇక కొత్తగా వచ్చిన నేతలు ప్రతిపక్ష పార్టీ చేసే విమర్శలకు ఘాటుగా కౌంటర్ ఇవ్వలేకపోతున్నారు. వారి కౌంటర్లు ప్రజల్లోకి బలంగా వెళ్లలేకపోవడం పార్టీకి మైనస్‌గా మారిందన్నది అందరూ అంగీకరిస్తున్నదే.మరొకవైపు కూటమిలో ఉన్న మిత్రపక్షాలు తమను కాదన్నట్లు వ్యవహరించడం చర్చనీయాంశమైంది.కూటమి ప్రభుత్వం ఏర్పాటయి పద్దెనిమిది నెలలు కావస్తుంది. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వస్తుంది. అలాగే అభివృద్ధి పనులను కూడా అంతేస్థాయిలో ముందుకు తీసుకెళుతుంది. రాష్ట్ర భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకుని అనేక నిర్ణయాలు తీసుకుంటుంది. మరొకవైపు కూటమి ఉన్నట్లా లేనట్లా అన్న అనుమానం కూడా కలుగుతుంది. టీడీపీని కానీ, చంద్రబాబును కానీ విపక్షాలు విమర్శిస్తే అందులో మిత్ర పక్షాలు పెద్దగా పట్టించుకోవడం లేదు. జనసేన నేతలు కానీ, బీజేపీ లీడర్లు కానీ విపక్సాలకు కౌంటర్ ఇవ్వడం లేదు. వారు ఎందుకు మౌనంగా ఉంటున్నారో తెలియదు కానీ కూటమి ప్రభుత్వంపై చేసే విమర్శలకు కూడా టీడీపీ నేతలే కౌంటర్ ఇవ్వాల్సిన దయనీయ స్థితిని చూడాల్సి ఉంది. మెడికల్ ప్రయివేటు కళాశాలల ప్రయివేటీకరణపై కూడా మిత్ర పక్షాల నుంచి పెద్దగా స్పందన రాలేదు.నిజానికి చంద్రబాబు విదేశాల్లో ఉన్న సమయంలో భోగాపురం ఎయిర్ పోర్టులో తొలి విమానం ల్యాండ్ అయింది. దీనిపై వైసీపీ తమ ప్రభుత్వ హయాంలో భోగాపురం చాలా వరకూ పూర్తయిందని చెప్పుకుంది. టీడీపీ నేతలు మినహా జనసేన, బీజేపీ నేతలు అసలు స్పందించలేదు. అసలు తమను కాదన్నట్లుగానే వారు వ్యవహరించారు. అలాగే రాయలసీమ ఎత్తిపోతల పథకంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కూడా ఒకరిద్దరూ టీడీపీ నేతలు కౌంటర్ ఇచ్చారు తప్పించి జనసేన, బీజేపీలు తమది కాదన్నట్లు వ్యవహరించడం కూడా రాజకీయంగా చర్చనీయాంశమైంది. అసలు కూటమిలో ఏం జరుగుతుందన్న అనుమానం మాత్రం టీడీపీ నేతల్లో కలుగుతుంది. మరి దీనికి సమాధానం ఎవరు చెబుతారన్నది చూడాలి.

# సచివాలయ ఉద్యోగులకు ఫేషియల్ అటెండన్స్

విజయవాడ జనవరి 17,(భారతశక్తి)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ , వార్డు సచివాలయ వ్యవస్థను మరింత జవాబుదారీగా మార్చేందుకు సరికొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇకపై సచివాలయ సిబ్బంది అందరికీ ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ విధానాన్ని తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల సమయపాలనపై వస్తున్న ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించిన సర్కార్, టెక్నాలజీ సాయంతో పనితీరును మెరుగుపరచాలని భావిస్తోంది. ఈ మేరకు సంబంధిత శాఖాధికారులు ఇప్పటికే ప్రాథమిక ఉత్తర్వులు జారీ చేశారు.

కొత్త నిబంధనల ప్రకారం, సచివాలయ ఉద్యోగులు ఉదయం నిర్ణీత సమయానికే విధులకు హాజరు కావాల్సి ఉంటుంది. ఒకవేళ ఎవరైనా ఆలస్యంగా వస్తే, ఆ సమాచారం నేరుగా సెంట్రల్ సర్వర్‌కు చేరుతుంది. నిర్దేశించిన సమయం కంటే ఎక్కువ సార్లు ఆలస్యంగా వస్తే, ఆ రోజు వేతనంలో కోత విధించేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేస్తున్నారు. బయోమెట్రిక్ విధానంలో ఉన్న లోపాలను అరికట్టేందుకు, ఒకరి బదులు మరొకరు హాజరు వేసే అవకాశం లేకుండా ఈ ఫేషియల్ అటెండెన్స్‌ను ప్రవేశపెడుతున్నారుసచివాలయ వ్యవస్థ ఉద్దేశమే ప్రజల చెంతకు పాలనను చేర్చడం. అయితే, క్షేత్రస్థాయిలో కొందరు ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం గుర్తించింది. ఈ ఫేషియల్ అటెండెన్స్ వల్ల ఉద్యోగులు కచ్చితంగా కార్యాలయాల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. తద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు నిర్ణీత సమయంలో అందుతాయని, వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.ప్రభుత్వ నిర్ణయంపై సచివాలయ ఉద్యోగ సంఘాల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లే సమయంలో ఈ హాజరు విధానం ఇబ్బందికరంగా మారుతుందని కొందరు ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సాంకేతిక సర్దుబాట్లు చేయాలని కోరుతున్నారు. అయితే, ప్రభుత్వం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని, పారదర్శకమైన పాలన కోసం ఇలాంటి కఠిన నిర్ణయాలు తప్పవని స్పష్టం చేస్తోంది. రాబోయే కొద్ది రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో ఈ విధానం పూర్తిస్థాయిలో అమలులోకి రానుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి వద్దకే చేరవేసే లక్ష్యంతో 2019లో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటైంది. ప్రతి 2,000 మంది జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి, అక్కడ వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన సుమారు 10 నుండి 11 మంది ఉద్యోగులను నియమించారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల నుండి సంక్షేమ పథకాల లబ్ధి వరకు దాదాపు 500కు పైగా సేవలను స్థానికంగానే అందించడం ఈ వ్యవస్థ ప్రత్యేకత. సచివాలయ సిబ్బందికి తోడుగా గ్రామాల్లో ఉండే వాలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తారు. పరిపాలనను వికేంద్రీకరించి, అవినీతికి తావులేకుండా పారదర్శకమైన సేవలు అందించడమే ఈ వ్యవస్థ ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వం మారిన తర్వాత వాలంటీర్లను కొనసాగించలేదు. ఎక్కువ సేవలు వాట్సాప్ ద్వారానే అందిస్తున్నారు. దీంతో ఉద్యోగులకు పనిలేకుండా పోయిందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# ముంబై తరహాలో విశాఖ నగరం

విశాఖపట్టణం జనవరి 17

సాగరతీరం విశాఖపట్నం అభివృద్ధి మీద ఏపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. అందులో భాగంగా ముంబై తరహాలో విశాఖ నగరాన్ని అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా ఏపీ నుంచి అధికారుల బృందం ముంబైలో పర్యటించింది. సిటీ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ మహారాష్ట్ర, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ విధానాలను అధ్యయనం చేసింది. ఆ విధానాలను ఇక్కడ అమలు చేసేందుకు ఉన్న అవకాశాలు పరిశీలించనున్నారు.ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధాని విశాఖపట్నం రూపురేఖలు త్వరలోనే మారిపోనున్నాయి. ముంబై తరహాలో విశాఖపట్నాన్ని అభివృద్ధి చేసేందుకు అడుగులు పడుతున్నాయి. ఈ దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. నీతి ఆయోగ్ ప్రతిపాదించిన నేషనల్ గ్రోత్ హబ్‌లో భాగంగా, విశాఖపట్నాన్ని గ్లోబల్ ఎకనామిక్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనికోసం ముంబైలో విజవంతమైన సిటీ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ మహారాష్ట్ర లిమిటెడ్ , ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ తరహా విధానాలను ఏపీ ప్రభుత్వం పరిశీలిస్తోంది.మరోవైపు విశాఖ గ్రోత్ హబ్ కార్యక్రమం కింద.. కైలాసగిరి, భీమిలి మధ్య బే సిటీని అభివృద్ధి చేయాలని నీతి ఆయోగ్ సూచించింది. విశాఖపట్నం 2.0ను భోగాపురం విమానాశ్రయం వరకు విస్తరించాలని, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం చుట్టూ ఏరోసిటీ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించింది. ఈ ప్రణాళికను ముందుకు తీసుకెళ్లడానికి.. ఆంధ్రప్రదేశ్ అధికారుల బృందం జనవరి 12, 13 తేదీలలో పట్టణ అభివృద్ధి నమూనాలను అధ్యయనం చేయడానికి ముంబైని సందర్శించింది. అభివృద్ధి ప్రాజెక్టుల కోసం ప్రభుత్వంపై ఆధారపడకుండా ల్యాండ్ మానిటైజేషన్, ఈూఎ ప్రీమియంల ద్వారా నిధులు ఎలా సమకూర్చుకోవాలో వీరు అధ్యయనం చేశారు.ఈ సందర్శనలో భాగంగా సిటీ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ మహారాష్ట్ర లిమిటెడ్ ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆర్థికంగా స్వయం సమృద్ధిని ఎలా సాధించాయనే దానిపై అధ్యయనం జరిపారు. అలాగే ప్రతిపాదిత భోగాపురం ఏరోసిటీ, వైజాగ్ 2.0 ప్రాజెక్టులకు బెంచ్‌మార్క్‌లుగా అఎఆఅూ నవీ ముంబై, (నవీ ముంబై ఎయిర్‌పోర్ట్ ఇన్‌ఫ్లుయెన్స్ నోటిఫైడ్ ఏరియా) నమూనాలను అధ్యయనం చేశారు. మరోవైపు ప్రస్తుతం దాదాపు రూ. 14,000 కోట్ల వార్షిక బడ్జెట్‌తో పనిచేస్తుంది, ఎక్కువగా భూమి, రియల్ ఎస్టేట్ ఆధారిత ఆదాయాల ద్వారా నిధులు సమకూరుస్తుంది.మరోవైపు నీతి ఆయోగ్ ఇటీవల డెవలపింగ్ విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ యాజ్ గ్లోబల్ ఎకనమిక్ హబ్ అనే పేరుతో నివేదికను విడుదల చేసింది, ఈ ఎకనమిక్ రీజియన్.. శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకు తొమ్మిది జిల్లాలను కవర్ చేస్తుంది. నీతి ఆయోగ్ నేషనల్ గ్రోత్ హబ్ కార్యక్రమం కింద విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ ఎంపిక చేశారు. మరోవైపు ముంబై నుంచి నేర్చుకున్న వాటి ఆధారంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ల్యాండ్ వాల్యూ క్యాప్చర్, ల్యాండ్ మానిటైజేషన్ పాలసీలను అనుసరించనుంది.

ఇందులో భాగంగా ఇంటిగ్రేటెడ్ కోస్టల్ హబ్ వైజాగ్ 2.0 ఆలోచన చేస్తున్నారు. దక్షిణాన విశాఖపట్నం ఓడరేవు నుంచి ఉత్తరాన భోగాపురం విమానాశ్రయం వరకు 200–250 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని ఇంటిగ్రేటెడ్ కోస్టల్ హబ్‌గా తీర్చిదిద్దాలని ఆలోచన చేస్తున్నారు. అలాగే వైజాగ్ బే సిటీని 40 చదరపు కిలోమీటర్ల ఇంటిగ్రేటెడ్ కోస్టల్ హబ్‌గా ప్రతిపాదించారు. కైలాసగిరి, భీమిలి మధ్య 25 కి.మీ తీరప్రాంతాన్ని వాటర్‌ఫ్రంట్ నగరంగా మార్చాలని ఆలోచనలు చేస్తున్నారు.మరోవైపు మధురవాడ, కాపులుప్పాడ, ఆనందపురంలోని ఐటీ, డేటా సెంటర్ హబ్‌లు, భోగాపురం ఏరోసిటీ, వైజాగ్ బే సిటీ వంటి ప్రాజెక్టుల ద్వారా విశాఖ రూపురేఖలు మారుతాయని భావిస్తున్నారు.

# స్కిల్ డెవలప్ మెంట్ కేసు.. క్లోజేనా

విజయవాడ, జనవరి 17, (భారతశక్తి)

ఏపీ సీఎం చంద్రబాబుకు మంచి రోజులు నడుస్తున్నాయి. ఆయన ఎన్ని రకాల ఇబ్బందులు పడ్డారో తెలియనిది కాదు. ఆయన అధికారంలోకి రావడం అసాధ్యం అనుకున్న రీతిలో.. సుసాధ్యం చేసి చూపించారు. కూటమి కట్టి తిరుగులేని విజయం సాధించారు. 164 అసెంబ్లీ సీట్లతో ఘనవిజయం పొందారు. దాదాపు ఏడాదిన్నర పాలనను కూడా పూర్తి చేసుకున్నారు. అయితే ఎప్పుడైతే జగన్మోహన్ రెడ్డి చంద్రబాబును అరెస్టు చేశారో.. అప్పుడే ఆయనకు టర్నింగ్ పాయింట్ అయింది. అది మొదలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కౌంట్ డౌన్ ప్రారంభం అయ్యింది. అయితే అప్పట్లో పెట్టిన కేసులు ఒక్కొక్కటి కూటమి వచ్చాక క్లోజ్ అవుతున్నాయి. అందులో ప్రధానమైన స్కిల్ డెవలప్మెంట్ స్కాం కేసును కూడా ఏసీబీ కోర్టు కొట్టి వేసింది. చంద్రబాబుతో సహా 37 మందిపై విచారణను మూసివేస్తున్నట్లు కోర్టు స్పష్టం చేసింది.వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో చంద్రబాబు అవినీతి కేసుల్లో అరెస్టయిన సంగతి తెలిసిందే. ప్రధానంగా స్కిల్ డెవలప్మెంట్ పేరిట భారీ కుంభకోణానికి తెర తీసారని అప్పట్లో సిఐడి కేసు నమోదు చేసింది. రూ.371 కోట్లు దుర్వినియోగం చేసినట్లు చూపింది. ఈ కేసుల్లో అప్పటి సీఎం చంద్రబాబును బాధ్యుడిని చేసింది. 2023 సెప్టెంబర్ 9న సిఐడి అధికారులు చంద్రబాబును అరెస్టు చేశారు. 52 రోజులపాటు చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. 2023 అక్టోబర్ 31న కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు చంద్రబాబు. అటు తరువాత కూడా చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని వైసిపి ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. కానీ చివరకు అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో అప్పట్లో చంద్రబాబుకు పోరాట లభించింది..అయితే అప్పట్లో చంద్రబాబుపై ఒక్క స్కిల్ డెవలప్మెంట్ స్కామ్ కేసు మాత్రమే కాదు. ఓ ఐదు కేసులను పెట్టారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కో కేసులో ఆయనకు విముక్తి లభిస్తూ వచ్చింది. అయితే స్కిల్ స్కామ్ కేసులో సిఐడి సమగ్ర దర్యాప్తు పూర్తి చేసి ఏసీబీ కోర్టులో తుది నివేదికలు దాఖలు చేసింది. అయితే ఈ కేసులో తీర్పును వెలువరించే ముందు తన వాదనలు వినాలని స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అప్పటి చైర్మన్ అజయ్ రెడ్డి ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టులో వాదనలు కూడా జరిగాయి. అన్ని పక్షాల వాదనలను పరిగణలోకి తీసుకున్న కోర్టు అజయ్ రెడ్డి పిటిషన్ ను కొట్టివేసింది. మిస్టేక్ ఆఫ్ షార్ట్ కారణంగా చూపుతూ నిందితులపై విచారణను మూసివేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. చంద్రబాబుతో సహా 37 మంది నిందితులకు ఆరోపణల నుంచి విముక్తి కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

# ఏప్రిల్ నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ: కేంద్ర ఎన్నికల సంఘం

న్యూ డిల్లీ జనవరి 16

తె లుగు రాష్ట్రాలు ఎపి, తెలంగాణల్లో ఏప్రిల్ నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను మొదలు పెట్టనున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసిఐ) అధికారులు పేర్కొన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో ఎస్ఐఆర్ ప్రారంభించి, మే నెల మూడవ వా రానికి ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. కాగా కేంద్ర ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియ తొలి దశను బిహార్ లో పూర్తి చేయగా ప్రస్తుతం రెండో దశలో దేశంలోని 9 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో కొనసాగిస్తోంది. రెండవ దశలో గుజరాత్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్ వంటి పలు రాష్ట్రాల్లో కొ నసాగుతున్న ఎస్ఐఆర్ తుది దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఎపి, తెలంగాణతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో మూడవ దశ ఎస్ఐఆర్ ప్రక్రియను చేపడతామని అధికారులు వెల్లడించారు. అయితే ఈ ప్రక్రియపై విపక్షాలు తీవ్ర అభ్యంతరం తెలుపుతున్న విషయం తెలిసిందే.

# పాపం... బాబు..

తిరుపతి, జనవరి 17, (భారతశక్తి)

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పుంగనూరు నియోజకవర్గ పాలిటిక్స్ సమ్‌థింగ్ స్పెషల్. వైసీపీ మాజీ మంత్రి, ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫ్యామిలీదే అక్కడ హవా. 2009 నుంచి పుంగనూరులో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్న పెద్దిరెడ్డి దూకుడుకు బ్రేకులు వేసేందుకు టీడీపీ అనేక ఎత్తులు వేసింది. 2024 ఎన్నికల్లో స్పెషల్‌గా టార్గెట్ చేసినా, ఆయన విజయాన్ని మాత్రం టీడీపీ ఆపలేకపోయిందన్న చర్చ ఉంది. గత ఎలక్షన్స్‌లో పెద్దిరెడ్డి చేతిలో టీడీపీ నేత చల్లా బాబు ఓటమి పాలయ్యారు. ఎమ్మెల్యేగా ఓడినా..రాష్ట్రంలో అధికారం రావడంతో ఇక తిరుగుండదని భావించారట చల్లా బాబు.ఎన్నో సవాళ్లను ఫేస్ చేస్తూ దాడులు, కేసుల పాలయ్యాయని వాపోతున్నారట. 2023లో టీడీపీ అధినేత చంద్రబాబు పుంగనూరు పర్యటనలో జరిగిన విధ్వంసంలో నమోదైన నాలుగు కేసుల్లో నిందితుడిగా చల్లా బాబు కడప సెంట్రల్ జైలుకు వెళ్లాల్సి వచ్చింది. కొంతకాలం అజ్ఞాతంలో ఉండాల్సిన పరిస్థితిని కూడా ఆయన ఎదుర్కొన్నారట. 2024 ఎన్నికల్లో పుంగనూరు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి పెద్దిరెడ్డిని ఓడించలేక పోయినా..ఆయన మెజారిటీని భారీగా తగ్గించారు చల్లా బాబు. ఇలా ప్రతిపక్షంలో ప్రత్యర్థి పార్టీకి టార్గెట్‌గా మారిన చల్లాబాబుకు ఇప్పుడు అధికారం వచ్చాక ప్రయారిటీ దక్కట్లేదట. పవర్‌లోకి వచ్చిన తొలినాళ్లలో కాస్త దూకుడు ప్రదర్శించి హంగామా చేసినా ఇప్పుడు స్పీడు తగ్గించాల్సి వస్తోందట. ఇందుకు ప్రధాన కారణం సొంత పార్టీలోనే కొందరు ఆయన హడావుడికి అడ్డంకులు సృష్టిస్తున్నారట.పుంగనూరు టీడీపీ ఇంచార్జ్‌గా భారీ కాన్వాయ్‌తో..చల్లా బాబు చేస్తున్న హడావుడిని కొందరు సొంత పార్టీ నేతలే డైజెస్ట్ చేసుకోలేకపోతున్నారట. టీడీపీలోనే ఒక వర్గం ఆయన్ను టార్గెట్ చేసి..హైకమాండ్ దగ్గర ఆయన పరపతిని తగ్గించే ప్రయత్నం చేస్తోందట. ఇది చల్లా బాబుకు ఇబ్బందిగా మారిందంటున్నారు. ఆయన అనుచరుల హడావుడిపైనా అధిష్టానానికి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో చల్లా బాబు పవర్‌కు బ్రేకులు వేసినట్లైందట. దీంతో చల్లాబాబు కూడా దూకుడును తగ్గించారట. జిల్లా ఇంచార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో సన్నిహితంగా ఉంటూ పుంగనూరులో మరింత బలపడాలనుకుంటున్న చల్లాబాబుకు సొంత పార్టీ నేతల పెడుతున్న ఇబ్బందులు హెడెక్‌గా మారాయట.నామినేటెడ్ పదవుల విషయంలో కూడా ఆయన వర్గానికి ఇంపార్టెన్స్ దక్కకపోవడంతో చల్లాబాబు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారట. టీడీపీ అధికారంలోకి వస్తే తమ నాయకుడికి ప్రాధాన్యత ఉంటుందని భావించిన చల్లా అనుచరులు, టీడీపీ క్యాడర్ కూడా నిరాశ చెందుతుందట. పుంగనూరులో చల్లా బాబును వ్యతిరేకిస్తున్న ఒక వర్గం..హైకమాండ్‌కు ఫిర్యాదుల మీద ఫిర్యాదులు చేస్తుందట. పుంగనూరులో చల్లాబాబు దూకుడుతో పార్టీ బలపడిందన్న అభిప్రాయం క్యాడర్‌లో ఉన్నా..ఆయనకు దక్కని ప్రాధాన్యత గురించే ఇప్పుడు ఎక్కువగా చర్చ జరుగుతోందట. దీంతో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసీపీ నుంచి, అధికారంలోకి వచ్చాక సొంత పార్టీలోని ఒక వర్గానికి టార్గెట్‌గా మారి చల్లా బాబు పొలిటికల్ ట్రబుల్స్ ఫేస్ చేస్తున్నారట.

# కాకినాడలో 84,000 కోట్ల పెట్టుబడి అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు

కాకినాడ, జనవరి 17, (భారతశక్తి)

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో సరికొత్త చరిత్ర లాంటి పెట్టుబడి రానుంది. కాకినాడ కేంద్రంగా ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సంస్థ సిద్ధమైంది. సుమారు 10 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ. 84,000 కోట్లు భారీ పెట్టుబడితో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా ఏటా 1.5 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియాను ఉత్పత్తి చేయనున్నారు. ఈ మెగా ప్రాజెక్టుకు అవసరమైన విద్యుత్తు కోసం 7.5 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని , 1 గిగావాట్ పంప్డ్ హైడ్రో స్టోరేజీని వినియోగించనుండటం విశేషం. ఇది భారతదేశం నుండి అంతర్జాతీయ మార్కెట్‌కు గ్రీన్ ఎనర్జీని ఎగుమతి చేసే తొలి ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా నిలవనుంది.ఈ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ గ్రీన్ ఎనర్జీ వ్యాల్యూ చైన్‌లో కీలక భాగస్వామిగా మారుతోంది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే గ్రీన్ అమ్మోనియాను జర్మనీ, సింగపూర్ , జపాన్ వంటి అగ్రదేశాలకు ఎగుమతి చేయనున్నారు. పర్యావరణ హితమైన ఇంధన తయారీలో అత్యాధునిక సాంకేతికతను వాడటం ద్వారా ఏపీ పారిశ్రామికంగా కొత్త పుంతలు తొక్కనుంది. కేవలం పెట్టుబడులకే పరిమితం కాకుండా, ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 8,000 మంది యువతకు ఉన్నత స్థాయి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఇది కాకినాడ ప్రాంత ఆర్థిక ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేస్తుందని భావిస్తున్నారు.ఈ భారీ ప్రాజెక్టుపై మంత్రి నారా లోకేష్ అత్యంత ఆనందం వ్యక్తం చేశారు. కాకినాడలో ఈ మెగా ప్రాజెక్టు ఏర్పాటు కావడం ఏపీకి గర్వకారణం. ఇది రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో ఒక మైలురాయి అని ఆయన పేర్కొన్నారు. భారీ పెట్టుబడులను ఆకర్షించడంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏపీ మళ్లీ పెట్టుబడుల గమ్యస్థానంగా మారుతోందని లోకేష్ ధీమా వ్యక్తం చేశారు. గ్రీన్ హైడ్రోజన్ , గ్రీన్ అమ్మోనియా రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి హబ్‌గా మార్చడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఒప్పందాలు పూర్తి కావడంతో, త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న ఈ ఎగుమతి టెర్మినల్ ద్వారా కాకినాడ పోర్టు గ్లోబల్ గ్రీన్ గేట్‌వేగా మారుతుంది. పర్యావరణ పరిరక్షణతో పాటు రాష్ట్రానికి భారీ ఆదాయం, యువతకు ఉపాధి కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం వెల్లడించింది. పారిశ్రామికవేత్తల్లో నమ్మకాన్ని పెంచేలా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఇలాంటి మెగా ప్రాజెక్టులు రాష్ట్రానికి రావడానికి దోహదపడుతున్నాయని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# చికెన్, మటన్ ధరలకు రెక్కలు

విశాఖపట్టణం జనవరి 17, (భారతశక్తి)



సంక్రాంతి పండుగ వేళ చికెన్ ధరలు భారీగా పెరిగాయి. గతంలో రూ. 200 ఉన్న చికెన్ ధర.. ప్రస్తుతం రూ. 350 వరకు చేరింది. దీంతో చాలా మంది సీఫుడ్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో కనుమ పండుగ సందర్భంగా విశాఖ ఫిష్ హార్బర్ జనసంద్రంగా మారింది. చేపలు, రొయ్యలు కొనుగోలు చేయడానికి జనం బారులు తీరారు. తెల్లవారు జామున 5 గంటల నుంచే ఎక్కువ సంఖ్యలో జనం వచ్చారు.సంక్రాంతి పండుగ సందర్భంగా చికెన్ ధర కొండెక్కి కూర్చుంది. కొద్దినెలల క్రితం కిలో చికెన్ (స్కిన్‌లెస్) ధర రూ. 200 ఉండగా.. నెల క్రితం రూ. 220 నుంచి రూ. 250 వరకు చేరింది. డిసెంబర్‌లో క్రిస్మస్ పండుగ నాటికి.. రూ. 270- 280కి చేరింది. ఇక కొత్త సంవత్సరం ప్రారంభంలోనే కోడి మాంసం ధరలు విపరీతంగా పెరిగాయి. ఇటీవల రూ. 300కు వరకు పెరిగిన చికెన్ రేటు.. పండుగ మొదలయ్యే సరికి రూ. 350 వరకు వెళ్లింది. కాగా, కనుమ పండుగ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో చికెన్ రేట్లు పెరిగాయి. విజయవాడలో కిలో స్కిన్ లెస్ చికెన్.. రూ. 350కి చేరింది. హైదరాబాద్‌లో చికెన్ రూ. 300 నుంచి 350 మధ్య ఉంది. అంతేకాకుండా మటన్ కూడా రూ. 1,050గా ఉంది. సాధారణ రోజులతో పోలిస్తే.. పండగ పూట చికెన్, మటన్ రేట్లు పెరిగాయి. దీంతో ప్రజలు సీఫుడ్ వైపు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ ఫిష్ హార్బర్‌లో.. చేపలు రొయ్యల కోసం ఎక్కువ సంఖ్యలో వచ్చారు.కనుమ సందర్భంగా విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ జనసంద్రంగా మారింది. చేపలు, రొయ్యల కోసం జనం అధిక సంఖ్యలో వచ్చారు. తెల్లవారుజామునే విశాఖ హార్బర్‌కు క్యూ కట్టారు. చేపలు, రొయ్యల కోసం బారులు తీరారు. దీంతో ఫిషింగ్ హార్బర్ మొత్తం నాన్వెజ్ ప్రియలతో నిండిపోయింది. చికెన్ రేట్లు పెరగడంతో.. కొనుగోలు చేయాలన్నా ఆలోచించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో.. చేపలు, రొయ్యలకు డిమాండ్ ఏర్పడింది. సైజును బట్టి బుట్ట రొయ్యలు రూ. 2 వేలకు పైగా ధర పలుకుతోంది. అయితే ఇక్కడ కూడా ధరలు ఎక్కువగా చెబుతున్నారని నాన్‌వెజ్ ప్రియులు వాపోతున్నారు.కొన్ని నెలల క్రితం చికెన్‌కు డిమాండ్ సరిగా లేకపోవడంతో పౌల్ట్రీ ఫారాల యజమానులు నష్టాలు చవిచూశారు. దీంతో ఉత్పత్తి తగ్గించారు. ఈ కారణంగానే.. ప్రస్తుతం ఉన్న డిమాండ్‌కు సరిపడా సప్లై చేయలేకపోతున్నారు. న్యూఇయర్, సంక్రాంతి పండుగ రావడంతో డిమాండ్ మరింత పెరిగింది. దానికి సరిపడా ఉత్పత్తి లేక కంపెనీలు ధరలు పెంచుతున్నాయి.కాగా, చికెన్ రేటు పెరగడానికి కోళ్లకు వేసే దాణా కూడా కారణమని తెలుస్తోంది. దాణాలో ప్రధానమైన మొక్కజొన్న వంటి పంటల ఉత్పత్తి తగ్గిపోవటంతో.. ధర పెరిగినట్లు సమాచారం. దీనికి తోడు హేచరీస్‌లో కోడి పిల్లకు రూ. 25 నుంచి రూ. 30 ఉన్న ధర.. ప్రస్తుతం రూ. 40గా పైగా పలుకుతోంది. ఇవేకాక పౌల్ట్రీ ఫారాల నిర్వహణ ఖర్చులు కూడా పెరిగడం ప్రధాన కారణాలుగా నిపుణులు చెబుతున్నారు.

# ఈశాన్య సైన్యం మోహరింపు.. బంగ్లాదేశ్‌లో మొదలైన వణుకు

న్యూఢిల్లీ, జనవరి 17 (భారతశక్తి)

భారత ప్రభుత్వం హఠాత్తుగా సైన్యాన్ని త్రిపుర, మిజోరాం వైపు తరలిస్తోంది. వాస్తవంగా ఈ రాష్ట్రాలకు ఎలాంటి ముప్పు లేదు. కానీ ఈశాన్య రాష్ట్రాల్లో సైనిక కార్యకలాపాలు వేగవంతం



చేస్తోంది. 1971 యుద్ధంలో అగర్తల భారత కేంద్రంగా బంగ్లాదేశ్ ఏర్పాటుకు సహాయం చేసినట్లుగా ఇప్పుడు కొత్త పరిణామాలు సూచిస్తున్నాయి. బంగ్లాదేశ్ చిట్టగాంగ్ హిల్ ట్రాక్‌లో జరుగుతున్న ఘర్షణలు ఇందుకు కారణం.బంగ్లాదేశ్ మైదానాల మధ్య చిట్టగాంగ్ హిల్ ట్రాక్ కొండలు, అడవులతో భారత్ (మిజోరాం, త్రిపుర), బర్మాను వేరుచేస్తుంది. ఇక్కడ 13 గిరిజన తెగలు (జోమా పీపుల్) బుద్ధిస్టులు, హిందువులు, క్రైస్తవులుగా ఉన్నారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ ముస్లిం స్థిరనివాసులను పెంచి గిరిజనుల సంఖ్యను తగ్గించాయి. కుకీ చిన్ నేషనల్ ఫ్రంట్ (కేఎన్ఎఫ్) ఏడాదిన్నరగా బంగ్లాదేశ్ ప్రభుత్వంతో పోరాడుతోంది. ఈ ప్రాంతం దేశ భూభాగంలో 20?25% ఉంటుంది, చిట్టగాంగ్ పోర్టు కీలకం.ఘర్షణల వల్ల గిరిజనులు మిజోరాం, త్రిపురలోకి ప్రవేశిస్తున్నారు. భారత్ వారికి పునరావాసం, మానవీయ సహాయం అందిస్తోంది. గూఢచార సంస్థలు బంగ్లాదేశ్‌లో శరణార్థులతో చర్చలు జరిపాయి. బంగ్లాదేశ్ భారత్ ఆయుధాలు, శిక్షణ ఇస్తోందని అనుమానిస్తోంది. 1971 ముందు ఆగస్టు 15న చిట్టగాంగ్‌లో త్రివర్ణ పతాకం ఎగిరింది. పాకిస్తాన్ ఆక్రమించి ముస్లింలను స్థిరపరిచింది. 1969 కప్తా డ్యాం గిరిజనులను తరిమేసింది. ఈ చరిత్ర మధ్య భారత్ 1971లో అగర్తల నుంచి బంగ్లాదేశ్ స్వాతంత్ర్యానికి సహకరించింది.చిట్టగాంగ్ హిల్ ట్రాక్ భారత్‌లోని రెండు, బర్మాలోని రెండు ప్రాంతాలతో లింక్. దీన్ని ఉపయోగించుకుంటే చికెన్ నెక్‌పై ఒత్తిడి తగ్గుతుంది. కేఎన్ఎఫ్ గెరిల్లా దాడులు బంగ్లాదేశ్ సైన్యాన్ని ఇబ్బంది పెడుతున్నాయి. భారత మద్దతు, బర్మా ఉగ్రవాదుల సహకారం అనుమానాలు పెరుగుతున్నాయి.మహ్మద్ యూనస్ అధికారంలోకి వచ్చాక హిందువులపై 2,900 దాడులు జరిగాయి. చిట్టగాంగ్ పోర్టు, భూభాగ నష్ట ప్రమాదం బంగ్లాదేశ్‌ను భయపెడుతోంది. భారత సైన్య మోహరాయనం దీన్ని మరింత తీవ్రతరం చేస్తోంది. బంగ్లాదేశ్ భారత్‌ను నిందించకపోయినా ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# గంటాకు క్యాబినెట్ హోదా...

విశాఖపట్టణం, జనవరి 17, (భారతశక్తి)

ఉత్తరాంధ్రలో ఆయనో పవర్ ఫుల్ లీడర్. ఎమ్మెల్యేగా గెలిచినా, పార్టీ పవర్‌లో ఉన్నా సరే ఆయనకు అత్యంత ఇష్టమైన పదవి మాత్రం దక్కలేదు. బుగ్గకారు యోగం కోసం 18 నెలలుగా ఊగిసలాటలో ఉన్న ఆయనకు ఎట్టకేలకు లక్కీ ఛాన్స్ దక్కబోతోందట. అత్యంత కీలకమైన పదవి ఆయన తలుపు తట్టబోతోందట. ఇప్పటికే సీఎం చంద్రబాబు ఆయనకు ఇండికేషన్ ఇచ్చారట. ఇంతకు ఎవరా నేత? ఆయన ఆశిస్తున్న పదవేంటి? ఆ లీడర్‌కు దక్కే పోస్ట్ ఏంటి?మంత్రి పదవి కోసం వెయిటింగ్‌లో ఉన్న మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు..త్వరలోనే గుడ్ న్యూస్ రాబోతోందట. గతంలో రెండుసార్లు మంత్రిగా పనిచేసి ఓ రేంజ్‌లో హవా నడిపించిన ఆయన..18నెలలుగా తనకు ఇష్టమైన పదవి దక్కకపోవడంతో అన్ హ్యాపీగా ఉన్నారట. కూటమి ప్రభుత్వంలో ఆయనకు ఎదురుచూపులు తప్పడం లేదట. తనకంటే జూనియర్లు, ఒకప్పుడు తాను టికెట్ రికమెండ్ చేస్తే పాలిటిక్స్‌లోకి వచ్చిన వాళ్లు మంత్రి పదవిలో ఉంటే..తాను మాత్రం ఓ ఎమ్మెల్యేగా ఉండిపోవాల్సి వచ్చిందనే అసహనంలో ఉన్నారట. అయితే గంటాకు లక్కీ ఛాన్స్ దక్కబోతోందట.ఆయను అదృష్టం వరించబోతోందని..మంత్రి పదవి కాకపోయినా సరే, దాదాపుగా అదే స్థాయి కలిగిన పదవి దక్కబోతోందని తెలుగు తమ్ముళ్లలో జోరుగా చర్చ సాగుతోంది. ఇంతకీ ఏంటా పదవి అంటే ఉత్తరాంధ్ర ఎకనామిక్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ పోస్ట్. ఈ పదవిని సీఎం చంద్రబాబు గంటాకు కట్టబెట్టబోతున్నారని పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. ఈ మధ్యే ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో ఎకనామిక్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేసింది ప్రభుత్వం. ఆయా ప్రాంతాల్లో పరిశ్రమలు, పెట్టుబడులు తేవడం, పెద్ద ఎత్తున ఉపాధి కల్పించడం ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధి వికేంద్రీకరణ చేపట్టాలని ప్రభుత్వం టాస్క్‌గా పెట్టుకుంది.ఉత్తరాంధ్ర ఎకనామిక్ రీజియన్ పరిధిలోకి 9 జిల్లాలు వస్తున్నాయి. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, పాడేరు, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, రాజమహేంద్రవరం వరకు విస్తరించారు. 9 జిల్లాల పరిధిలో ఎకనామికి రీజియన్ అథారిటీ చైర్మన్ పదవి చాలా ప్రతిష్టాత్మకమైనదిగా భావిస్తున్నారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర ఎకనామిక్ రీజియన్‌లో భారీగా పరిశ్రమలు వస్తున్నాయి. గూగుల్, రైడన్, బ్రూక్ ఫీల్డ్ డేటా సెంటర్లతో పాటుగా, దిగ్గజ



ఐటీ కంపెనీలు, ప్రఖ్యాత స్టార్ హోటల్స్, ఏరో స్పేస్ ప్రాజెక్టులు, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, మిట్టల్ స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్కు, ఎంఎస్ఎంఈ పార్కులు వంటివి వేలాది ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు.ఈ పరిశ్రమలకు అవసరమైన ప్రభుత్వ భూమి చాలా ఉన్నప్పటికీ, ఇంకా రైతుల నుంచి సేకరణ చేయాల్సి వస్తోంది. ఈ ప్రాసెస్‌ను కూల్‌గా డీల్ చేయడం ప్రభుత్వానికి ఛాలెంజ్‌గా మారింది. చాలా గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు విపక్ష వైసీపీ ఆధీనంలో ఉండటంతో గ్రామసభల తీర్మానాలు చేయడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ పనికి స్థానికంగా చాకచక్యంగా పావులు కదిపి..సమస్యలు లేకుండా స్మూత్‌గా భూసేకరణ పూర్తి చేయగల లీడర్ కోసం కూటమి సర్కారు చూస్తోంది. ఉత్తరాంధ్ర ఎకనామిక్ రీజియన్ పరిధిలో అంత సమర్థత ఉన్న నేత గంటా శ్రీనివాసరావు మాత్రమేనని చంద్రబాబు, లోకేశ్ భావిస్తున్నారట. అందుకే ఆయనకు లోపాయికారీగా ఈ వ్యవహారాలు అప్పగించారట.గంటా శ్రీనివాసరావు నియోజకవర్గం భీమిలిలో..డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలు, ఏరో స్పేస్ రిలేటెడ్ ఇండస్ట్రీస్, స్టార్ హోటల్స్, ఇన్ ఫ్రా ప్రాజెక్టుల పేరుతో లక్షలాది కోట్ల రూపాయలు పెట్టుబడులు రాబోతున్నాయి. వీటి కోసం కొన్ని వేల ఎకరాల భూమి అవసరం. ఇప్పటికే గూగుల్, అదానీ డేటా సెంటర్ కోసం భీమిలిలో 200 ఎకరాల వరకు ప్రభుత్వం భూమిని కేటాయించగా, రైతుల నుంచి భూమి సేకరించాల్సి వచ్చింది. దీంతో సీఎం చంద్రబాబు..ఎమ్మెల్యే గంటాతో మాట్లాడి..భీమిలిలో ల్యాండ్ అక్విజేషన్‌కు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారట. అంతేకాదు ఉత్తరాంధ్ర ఎకనామిక్ రీజియన్ అథారిటీ చైర్మన్ పదవి ఇస్తామని ఆఫర్ కూడా ఇచ్చారట. దీంతో గంటా తన నియోజకవర్గంలో వైసీపీ వర్గానికి చెందిన నేతలు, రైతలను కూడా ఒప్పించి ప్రభుత్వానికి భూమి అప్పగించేలా చేయడంలో చక్రం తిప్పుతున్నారట.కేవలం భీమిలిలోనే కాదు, విశాఖ, అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా గంటాకు పెద్దఎత్తున అనుచరగణం ఉండటంతో ఆయా ప్రాంతాల సమీకరణల బాధ్యతలు కూడా అప్పగించారంటున్నారు. ఉత్తరాంధ్ర ఎకనామిక్ రీజియన్ పరిధిని హ్యాండిల్ చేయాలని గంటాకు ఇండైరెక్ట్‌గా బాధ్యతలు అప్పగించినట్లు టాక్. దీంతో గంటా తనదైన శైలిలో చక్రం తిప్పుతూ తన సత్తా ఏటో చంద్రబాబు, లోకేశ్‌లకు చూపుతున్నారట. వచ్చే మార్చిలో గూగుల్ డేటా సెంటర్ భూమి పూజ చేయడానికి వీలుగా గంటా అడ్డంకులు తొలగించడంతో ఇటు గంటా, అటు టీడీపీ అధిష్టానం ఫుల్ హ్యాపీ అంటున్నారు. తన స్థాయికి తగ్గ సరైన పదవి లేకపోయిందని అసంతృప్తిలో ఉన్న గంటాకు మంత్రిగా మాత్రమే పరిమితం కాకుండా, ఏకంగా 9 జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతోనూ సమీక్షలు చేయగల లక్కీ పోస్టు వచ్చినట్లేనని విశాఖ రాజకీయవర్గాల్లో ప్రచారం ఊపందుకుంది. అయితే గంటా కల నెరవేరడానికి ఎంత టైమ్ పడుతుందో చూడాలి.

# ర్యాంపులో వ్యక్తి మృతి చెందిన ఘటనపై పలు అనుమానాలు.!

**-అక్రమ రహదారులు, అర్ధరాత్రి లోడింగ్ వలనే ఘటనలు**

**-మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి**

**-రేణుక అక్షరమండలి అధ్యక్షురాలు పూనెం సరోజ డిమాండ్**

మణుగూరు, జనవరి 17 (భారతశక్తి): మండలంలోని తిర్లాపురం గ్రామపంచాయితీ పరిధిలో గల ఇసుక ర్యాంపుల్లో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకున్న జేసిబి డ్రైవర్ మృతి పలు అనుమానాలకు తావిస్తోందని రేణుక అక్షర మండలి అధ్యక్షురాలు ఆరోపించారు. అతను స్నానానికి వెళ్లి ప్రమాద వశాత్తు చనిపోయాడా, లేక ఎవరైనా చంపారా..? అనే అనుమానాలు సోషల్ మీడియాలో జరిగిన ప్రచారాలతో వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు నిగ్గు తేల్చాలని ఆమె డిమాండ్ చేశారు. ఇసుక ర్యాంపుల్లో జరుగుతున్న అక్రమ వ్యవహారాలే ఈ మరణానికి కారణమై ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని ఆమె ఆరోపించారు. ర్యాంపుల పేరుతో అక్రమ రహదారులు నిర్మించి, గోదావరిని ఇష్టారాజ్యంగా ధ్వంసం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. లారీల రాకపోకల కోసం నిబంధనలకు విరుద్ధంగా మట్టి, ఇసుకతో అడ్డగోలు నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. వే బిల్లులు లేకుండా హైదరాబాద్ తదితర పట్టణాలకు ఇసుక తరలింపు యథేచ్ఛగా సాగుతోందని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలు పూర్తిగా తుంగలో తొక్కి కాంట్రాక్టర్లు కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని విమర్శించారు. అర్ధరాత్రి రెండు గంటలు దాటిన తర్వాత కూడా లోడింగ్ పనులు చేయిస్తున్నారని కార్మికులు వాపోతున్నట్లు మా దృష్టికి వచ్చిందని తెలిపారు. నిద్రాహారాలు లేకుండా పని చేయించడం వల్లే ప్రమాదాలు, మరణాలు జరుగుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

# అభాగ్యనగరం... వామ్మో... కాలుష్యం...

హైదరాబాద్, జనవరి 17, (భారతశక్తి)

సంక్రాంతి పండు గకు సొంతూళ్లకు వెళ్లారు.. హైదరాబాద్ నగరం సగం ఖాళీ అయ్యింది.. రోడ్లపై ట్రా ఫిక్ తగ్గింది.. సిటీ బస్సులు, మెట్రో రైళ్లు సగం ఖాళీగానే కనిపిస్తున్నాయి. అస లే చలికాలం. వాహనాలు వదిలే పొగతో ముక్కులకు మాస్కులు ధరించి, బతుకుజీవుడా అంటూ ఇంటికి చేరే నగరవాసులకు ఈ నాలుగు రోజులు పండగే. పండుగ, పబ్బం లేనిరోజుల్లో అటు వాహనాల రద్దీ, ఇటు కాలుష్యంతో పొగచూరుతున్న నగ రం కూడా త్వరలోనే కాలుష్యంలో ఢిల్లీ స్థాయికి 'ఎదుగుతున్నదా' అనే ప్రశ్న అందరిని వెంటాడుతున్నది. ఢిల్లీలో రియల్ టైమ్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 400 దాటింది. 'ప్రమాదకర' విభాగంలోకి ప్రవేశించింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ప్రకారం ఢిల్లీలో ఏఐక్యూ 411గా న మోదైంది. -ఇది తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలను కలిగించే స్థాయి కావడం గమ నార్హం. హైదరాబాద్ ఇప్పటికీ ఆ తీవ్రస్థాయికి చేరలేదు గానీ, నగరంలో క్రమంగా దిగజారుతున్న గాలి నాణ్యతను నిర్లక్ష్యం చేయలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే, హైదరాబాద్ కూడా అదే పరిస్థితిని ఎదుర్కొనే ప్రమా దం ఉ ందని వారు చెబుతున్నారు. హైదరాబాద్‌లో పరిశ్రమలు నగరమంతటా చెల్లాచెదురుగా విస్తరించి ఉన్నాయి. ఇది వ్యవస్థీకృత పరిశ్రమల జోనింగ్ సూత్రాలను ఉల్లంఘిస్తోంది. నగర విస్తరణ సమయంలో శాస్త్రీ య విశ్లేషణలు, పౌర సంప్రదింపులు ఎక్కువగా లేకపోయాయి. ఒకప్పుడు హైదరా బాద్‌లో మూసారాంబాగ్ వంటి చారిత్రక 'బాగ్‌లు', అనేక చెరువులు ఉండేవి. కానీ అవి కనుమరుగవడం గాలి నాణ్యతపై నే రుగా ప్రభావం చూపింది. ప్రజా రవాణా ఇప్పటికీ విశ్వసనీయంగా లేకపోవడం, అం దుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు వ్యక్తిగత వాహనాలపై ఆధారపడాల్సి రావడం మరో ప్రధాన కారణం. 'హైదరాబాద్‌లో ఇప్పుడు ద్విచక్ర, త్రిచక్ర వాహనాల సాంద్రత అత్యధికంగా ఉంది. ఏటా లక్షల సంఖ్యలో వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి, దీనివల్ల ఉద్గారాలు గణనీయం గా



పెరుగుతున్నాయ'ని ఒక పౌరుడు తెలిపారు. ప్రణాళిక లేని పరిశ్రమల అభివృద్ధి, ముఖ్యంగా రసాయన, ఔషధ పరిశ్రమలు, కాలుష్య భారాన్ని మరింత పెంచుతూ హైదరాబాద్ గాలిని రసాయనపరంగా మరింత విషపూరితంగా మారుస్తున్నాయి. కాలుష్యానికి మరో ప్రధాన కారణం హైదరాబాద్‌లో శాస్త్రీయ పట్టణ ఘన వ్యర్థాల నిర్వహణ లేకపోవడమే. 'చెత్తను తరచుగా కాల్చడం లేదా రోడ్ల పక్కన పడేయడం జరుగుతోంది. భారీ చెత్త కొండలు ఏర్పడి, జవహర్‌నగర్ వంటి ప్రాంతాలు డంపింగ్ యార్డులుగా మారా యి. ఇది పౌరులూ, జీహెచ్‌ఎంసీ రెండింటికీ చెందిన వైఫల్యం' అని ఆయన వివరించారు. అత్యంత కీలకమైన చివరి అంశం పౌర స్ఫూ ర్తి అని ప్రొఫెసర్ రెడ్డి పేర్కొన్నారు. గాలిలోనూ, నీటిలోనూ మైక్రో ప్లాస్టిక్స్ ఉన్నాయని ఆయన అన్నారు. పర్యావరణ పరిరక్షణను రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ(జీ) తప్పనిసరిగా పేర్కొన్నప్పటికీ, పౌరులు పర్యావరణా న్ని దెబ్బతీసే ఆచారాలను కొనసాగిస్తూనే ఉన్నారని ఆయన విమర్శించారు. స్థిరమైన ప్రణాళికలు అమలు చేయడానికి ప్రత్యేక రాష్ట్ర పర్యావరణ అభివృద్ధి కమిషన్ ఏర్పా టు చేయాలని పిలుపునిచ్చారు. మునిసిపల్ వ్యవస్థపై మరింత బలమైన బాధ్యత నిర్ధారణ అవసరమని డిమాండ్ చేశారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలికి చెందిన పర్యావరణ శాస్త్రవేత్త శరత్ కుమార్ హైదరాబాద్‌లో కాలుష్యం ఉందని అంగీకరించినప్పటికీ, అది ఢిల్లీ స్థాయికి చేరదని అన్నారు. 'ఏఐక్యూను అర్థం చేసుకోవడంలో చాలాసార్లు గందరగోళం ఏర్పడుతుంది. మనకు 50-100 మంచి స్థాయి, 100-200 సంతృప్తికర స్థాయి. ఢిల్లీ ఏఐక్యూ గణాంకాలు జాతీయ సగటుగా తీసుకోవడం వల్ల అవి తరచూ తప్పుగా అర్థం చేసుకోవాల్సి వస్తుంద'ని ఆయన వివరించారు. హైదరాబాద్‌లో ఏఐక్యూ ప్రాంతానికి, ప్రాంతానికి చాలా తేడా ఉంటుందని, సనత్‌నగర్, జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో స్థానిక పరిస్థితుల ఆధారంగా మారుతుందని చెప్పారు. వాతావరణ పరిస్థితులు కూడా కొన్నిసార్లు కాలుష్యాన్ని తాత్కాలికంగా పెంచుతాయని తెలిపారు. ఐఐటీ కాన్పూర్‌తో కలిసి దాదాపు రూ. 1 కోటి వ్యయంతో నిర్వహించిన సోర్స్ అపోర్షన్‌మెంట్ అధ్యయనం ప్రకారం రోడ్డు ధూళి 27--30 శాతం, వాహనాలు మరో 20--30 శాతం, పరిశ్రమలు సుమారు 15 శాతం కాలుష్యానికి కారణమని వెల్లడైంది. ప్రస్తుతం దాదాపు 500 అనుబంధ పరిశ్రమలను కవర్ చేసే కార్యాచరణ ప్రణాళిక అమల్లో ఉందని ఆయన తెలిపారు. ఇందులో ఆకస్మిక తనిఖీలు, వాహనాల పర్యవేక్షణ, ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహం, చార్జింగ్ మౌలిక వసతుల విస్తరణ, మొక్కల నాట్లు, రియల్‌టైమ్ గాలి నాణ్యత పర్యవేక్షణ వంటి చర్యలు ఉన్నాయి. 'మన అవగాహన, చర్యలే కీలకం. ఉల్లంఘనలను అరికట్టడంలో పౌరుల భాగస్వామ్యం అత్యంత అవసరమ'ని శరత్ కుమార్ అన్నారు. ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కే పురుషోత్తం రెడ్డి ఒక కఠిన హెచ్చరిక జారీ చేస్తూ హైదరాబాద్ నిజంగానే ఢిల్లీ దిశగా కదులుతోందని అన్నారు. ఢిల్లీ భౌగోళిక పరిస్థితులు అక్కడి కాలుష్యాన్ని మరింత తీవ్రం చేస్తున్నాయని ఆయన వివరించారు. హిమాలయాలు, ఉత్తర పర్వత శ్రేణులు గోడలా నిలిచి, గాలిని అడ్డుకుంటాయని, దాంతో ధూళి అక్కడే చిక్కుకుపోతుందని చెప్పారు. అనేక ప్రాంతాల నుంచి వచ్చే ధూళి, థార్ ఎడారి నుంచి వచ్చే ఇసుకతో కలిసిపోయి, సూక్ష్మ కణాలను పెంచి గాలిని అత్యంత విషపూరితంగా మారుస్తోందని ఆయన అన్నారు. ఢిల్లీ అభివృద్ధిని ప్రణాళిక చేయడంలో పర్యావరణ పరిమితులను పర్యావరణ మంత్రిత్వ శాఖ చాలా ముందే పరిగణనలోకి తీసుకోవాల్సింద'ని ఆయన తెలిపారు. భారత ప్రభుత్వం అప్పుడప్పుడు మాత్రమే జాతీయ పట్టణీకరణ కమిషన్లను ఏర్పాటు చేసిందని ఆయన పేర్కొన్నారు. 'వారు మూడు లేదా నాలుగు సిఫారసులు చేశారు గానీ, ప్రకృతి పరిమితులను ఎప్పుడూ గంభీరంగా పరిగణించలేద' అని ఆయన అన్నారు.

# ముంబై ఎన్నికల్లో ఓవైసీ పార్టీ విజయం...
## ఎన్సీపీ కంటే మెరుగైన ఫలితాలు



ముంబై, జనవరి 17 (భారతశక్తి)

మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం పార్టీ గణనీయమైన ప్రభావాన్ని చాటుకుంది. కేవలం ముస్లిం ప్రాబల్యం ఉన్న ప్రాంతాలకే పరిమితం కాకుండా.. పట్టణాల్లో కూడా తన ఉనికిని చాటుకుంటూ పలు చోట్ల నిర్ణయాత్మక శక్తిగా ఎదిగింది. ముఖ్యంగా శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ కంటే ఎక్కువ స్థానాల్లో ముందంజలో ఉండటం గమనార్హం. ఇక బీఎంసీ పరిధిలో తొలిసారి ఎంఐఎం బోణీ కొట్టింది. ఆసియాలోనే అత్యంత సంపన్న మున్సిపల్ కార్పొరేషన్ అయిన బృహన్ ముంబై కార్పొరేషన్ (బీఎంసీ)లో ఎంఐఎం తన మొదటి విజయాన్ని నమోదు చేసి చరిత్ర సృష్టించింది. మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం తన పట్టణ ప్రాబల్యాన్ని చాటుకుంది. ముంబై బీఎంసీలో తొలి సీటును గెలవడంతో పాటు.. రాష్ట్రవ్యాప్తంగా 13 కార్పొరేషన్ల పరిధిలో మొత్తం 89 స్థానాలను గెలుచుకుంది. శంభాజీనగర్, మాలెగావ్ వంటి నగరాల్లో కింగ్ మేకర్ పాత్రను పోషించడమే కాకుండా.. శరద్ పవార్ ఎన్సీపీని వెనక్కి నెట్టి తన రాజకీయ శక్తిని నిరూపించుకుంది. బీఎంసీ ఎన్నికల్లో వార్డు నంబర్ 134 (మాంఖుర్ద్) పరిధిలో ఎంఐఎం పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థి మెహజబిన్ ఖాన్ విజయం సాధించారు. బీఎంసీలో ఎంఐఎం గెలుపొందడం ఇది తొలిసారి కావడం విశేషం. తాజా సమాచారం ప్రకారం.. ముంబైలో ఎంఐఎం మొత్తం 4 స్థానాల్లో విజయం సాధించింది. మహారాష్ట్ర వ్యాప్తంగా వివిధ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో జరిగిన ఎన్నికల్లో ఎంఐఎం అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఛత్రపతి శంభాజీనగర్ మున్సిపల్ ఎన్నికల్లో ఏకంగా 24 స్థానాలను కైవసం చేసుకున్న ఎంఐఎం ప్రధాన పోటీదారుగా నిలిచింది. మాలెగావ్ కార్పొరేషన్ ఎన్నికల్లో 20 స్థానాల్లో గెలుపొంది.. తన పట్టును నిరూపించుకుంది. ధూలే మున్సిపల్ ఎన్నికల్లో 8 స్థానాలు, సోలాపూర్ ఎన్నికల్లో 8 సీట్లు, నాందేడ్‌లో 8 8 స్థానాల్లో విజయం సాధించింది. థానేలో 5, అమరావతిలో 6 స్థానాలను ఎంఐఎం పార్టీ కైవసం చేసుకుంది. బీజేపీకి కంచుకోట అయిన నాగపూర్‌లో కూడా ఎంఐఎం 4 స్థానాలను గెలుచుకుని అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ ఎన్నికల ట్రెండ్స్ ప్రకారం.. మహారాష్ట్ర వ్యాప్తంగా ఎంఐఎం సుమారు 89 స్థానాల్లో విజయం సాధించింది. ఇది శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (27 స్థానాలు) కంటే చాలా ఎక్కువ కావడం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పట్టణ ఓటర్లు, ముఖ్యంగా మైనారిటీలు ఉన్న ప్రాంతాల్లో ఒవైసీ పార్టీ వైపు మొగ్గు చూపడం ఈ ఫలితాల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

# మూసీ ప్రక్షాళనకు టీడీఆర్

హైదరాబాద్, జనవరి 17, (భారతశక్తి)

హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణలో ఒక కొత్త అధ్యాయానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నగరం చుట్టూ ఉ న్న చెరువులు, కుంటలు, నాలాలు, నదుల పరిరక్షణే ధ్యేయంగా రేవంత్ రెడ్డి సర్కారు అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు తీసుకొచ్చిన రూల్స్ వల్ల చెరువుల సంరక్షణతోపాటు ప్రతిష్టాత్మకంగా భావించే మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టులో కదలిక రానుంది. టీడీఆర్‌లో మార్పులు చేర్పులు కేవలం ఆక్రమణ తొలగింపు మాత్రమే కాకుండా భూమిని కోల్పోయే పట్టాదారులకు ఊరట కల్పించేలా ఉన్నాయి.



తెలంగాణ పురపాలక శాఖ విడుదల చేసిన జీవో నెంబర్ 16 ద్వారా భవన నిర్మాణ నిబంధనలు -2012లో కీలక సవరణలు చేసింది. సుప్రీంకోర్టు, ఎన్‌జీటీ ఆదేశాలతో జలాశయాల పరిరక్షణకు ఈ నిర్ణయం తీసుకుంది. చెరువుల ఎఫ్టీఎల్, నదుల ఎంఎఫ్ఎల్, బఫర్ జోన్‌లలో ఉన్న పట్టా భూములను స్వాధీనం చేసుకునే క్రమంలో భూ యజమానులకు భారీగా నగదు పరిహారానికి ప్రత్యామ్నాయంగా టీడీఆర్‌ను ఇవ్వబోతోంది. ఈ సవరణలు కేవలం నోటిఫైడ్ ప్రాజెక్టులకు, అంటే హైడ్రా, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ వంటి సంస్థలు చేపట్టే పనులకు మాత్రమే వర్తిస్తాయి. ఇది తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 300 డివిజన్ల వరకు అంటే ఔటర్ రింగ్ రోడ్డు వరకు అమలులోకి రానుంది. గతంలో ఉన్న టీడీఆర్ నిబంధనలను ప్రభుత్వం మరింత వెసులుబాటు కల్పించింది. స్వచ్ఛందంగా భూమిని అప్పగించే వారికి ప్రోత్సాహకాలు పెంచింది. ఇప్పుడు విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం పరిహారం మార్చింది. చెరువుల పూర్తి స్థాయి ఈబఒ, ఓఈఒ పరిధిలో ఉ న్న భూములకు, ఆ యజమాని వదులుకున్న నిర్మిత విస్తీర్ణానికి ఏకంగా 200 శాతం టీడీఆర్ మంజూరు చేస్తారు. చెరువులు లేదా నదుల బఫర్ జోన్‌లలో ఉన్న భూములను అప్పగిస్తే 300 శాతం టీడీఆర్ లభిస్తుంది. జవనరుల అభివృద్ధి, రహదారి విస్తరణ లేదా బఫర్ జోన్ వెలుపలి భూములను ప్రభుత్వం సేకరించాల్సి వస్తే ఏకంగా 400 శాతం టీడీఆర్ ఇవ్వనున్నారు. ప్రైవేటు భూముల్లో నాలా విస్తరణ చేపడితే, రోడ్డు విస్తరణకు ఇచ్చే విధంగా 400 శాతం టీడీఆర్ వర్తింపజేస్తారు. దీని వల్ల నిర్వాసితులు ప్రభుత్వం నుంచి నగదు కోసం ఎదురు చూడాల్సిన పని లేదు. టీడీఆర్ సర్టిఫికెట్ల ద్వారా మార్కెట్‌లో మంచి లాభం పొందే ఛాన్స్ ఉంది. గత ప్రభుత్వ హయాంలో దాదాపు 10వేల కోట్లకుపైగా విలువైన టీడీఆర్ సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. దీని వల్ల మార్కెట్‌లో వాటి సరఫరా పెరిగింది. దీంతో డిమాండ్ పడిపోయింది. దీని వల్ల భూ యజమానులు టీడీఆర్ తీసుకోవడానికి అంగీకరించడం లేదు. కేవలం నగదు రూపంలోనే పరిహారం అడుగుతున్నారు. అందుకే రూల్స్ మార్చిన ప్రభుత్వం ఈ ఇబ్బందిని అధిగమించాలని చూస్తోంది. అందుకే బిల్డర్స్‌కు కొన్ని రూల్స్ పెట్టింది. హైదరాబాద్‌లో పది అంతస్తులకు మించిన భవనాలు నిర్మిస్తే టీడీఆర్ వినియోగించుకోవాలి. అంటే 11 అంతస్తు నుంచి నిర్మించే ప్రతి ఫ్లోర్‌కు చదరపు అడుగు విస్తీర్ణంలో పది శాతానకకి సమానమైన టీడీఆర్ కచ్చితంగా కొనుగోలు చేయాలి. ఈ రూల్ వల్ల మార్కెట్‌లో టీడీఆర్‌కు ఒక్కసారిగా డిమాండ్ పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తుంది. టీడీఆర్‌లు చెల్లుబాటు అవుతాయని ప్రజలకు మేలు జరుగుతుందని అంచనా వేస్తున్నారు. టీడీఆర్ జారీ ప్రక్రియలో ఎటువంటి అక్రమాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వ కఠినమైన రూల్స్ పెట్టింది. టీడీఆర్ ఇచ్చే ముందు ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ స్థాయి అధికారుల నుంచి తప్పనిసరిగా క్లియరెన్స్ తీసుకోవాలి. భూ యజమాని అందుబాటులో లేకపోయినా లేదా టైటిల్ వివాదాలు ఉన్నా ఆ టీడీఆర్‌ను టీడీఆర్ బ్యాంకులో జమ చేస్తారు. వివాదం పరిష్కారమైన తర్వాత అసలు ఓనర్‌కు అప్పగిస్తారు. ఒక ఎకరం కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న భూములకు టీడీఆర్ ఇవ్వాలంటే ముందస్తుగా రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. భూమిని ఉచితంగా ప్రభుత్వానికి అప్పగించే సంస్థలకు మరిన్ని ఆఫర్లు ప్రకటించింది ప్రభుత్వం. వారు తమ ప్రాజెక్టులో సెట్ బ్యాక్‌ల సడలింపు ఉంటుంది. అదనపు అంతస్తుల నిర్మాణం, అదనపు నిర్మిత విస్తీర్ణంలో వెసులుబాటు పొందవచ్చు. ఏ నిబంధన అయినా సరే ఫైర్, ఎయిర్‌పోర్టు అథారిటీ రూల్స్‌కు అనుగుణంగానే ఉంటుంది.

# కశ్మీర్ లో పాక్ కు చావుదెబ్బ

శ్రీనగర్, జనవరి 17(భారతశక్తి)

దేశంలో పాకిస్తాన్ ఉగ్రవాదులను అంతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ముఖ్యంగా జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలని లక్ష్యంగా పెంట్టుకుంది. ఇందులో భాగంగానే ఆర్టిక్ 370ని రద్దు చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వ శాఖల్లో దాగి ఉన్న మద్దతుదారుల నెట్‌వర్క్‌ను గుర్తించే పనిలో ఉంది. ఈ ఓవర్‌గ్రౌండ్ వ్యవస్థ ఆయుధాలు, ఆశ్రయాలు, రహస్య సహాయాల ద్వారా ఉగ్రవాదానికి ఆధారం. తాజా చర్యల్లో లష్కర్?ఏ?తొయిబా, జైష్?ఏ?మహ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్‌కు సహకరించిన ఐదుమంది ప్రభుత్వ ఉద్యోగులను తొలగించి అరెస్టు చేశారు. ఇది 2021 నుంచి జరుగుతున్న వ్యాపక కార్యాచరణలో భాగం. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగలు చేస్తూ.. ఉగ్రవాదులకు సహకరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఐదుగురూ వివిధ రకాలుగా ఉగ్రవాదులకు సహకరించారు. వీరిపై నిఘా పెట్టిన పోలీసులు అరెస్ట్ చేసి ఉద్యోగాల నుంచి తొలగించారు.

మహ్మద్ ఇషాక్:

ఇతను విద్యాలయ ఉపాధ్యాయుడిగా విద్యార్థుల్లో తీవ్రవాద భావాలు నాటి, లష్కర్ నాయకుడు అబు కోలాయ్‌తో కలిసి పనిచేశాడు. 2022లో పట్టుబడ్డాడు.

తారిక్ అహ్మద్ రా..

ఇతను కార్మిక శాఖలో పనిచేస్తూ హిజ్బుల్ ఉగ్రవాది అమీన్ బాబాను పాకిస్తాన్‌కు తప్పించాడు.

ఫారుఖ్ అహ్మద్ భట్..

ఇతను అటవీ విభాగంలో ఉండగా, ఒక శాసనసభ్యుని వాహనంలో హిజ్బుల్ ఉగ్రవాదిని సరిహద్దు దాటించాడు. తారిక్ రాహ్‌తో కలిసి ఈ కుట్ర రచించాడు.

బషీర్ అహ్మద్ మీర్..

ఇంజనీరింగ్ శాఖలో ఆయుధాలు, ఆశ్రయాలు అందించి లష్కర్‌కు మద్దతు ఇచ్చాడు. ఇంట్లో రెండు ఏకే?47లు స్వాధీనం.

మహ్మద్ యూసుఫ్..

ఆస్పత్రి అంబులెన్స్ డ్రైవర్‌గా ఉగ్రవాదులను తరలించి, హిజ్బుల్‌కు సహకరించాడు. ఆస్పత్రి నిర్వాహకుల మద్దతు కూడా బయటపడింది.

ఆర్టికల్ 370 తొలగింపు తర్వాత ప్రభుత్వం ఈ రహస్య నెట్‌వర్క్‌పై దృష్టి పెట్టింది. 2021లో ప్రారంభమైన కార్యాచరణలో ఇప్పటివరకు 85 మంది ఉద్యోగులను తొలగించారు. విద్యా, వైద్య, అటవీ, కార్మిక, ఇంజనీరింగ్ శాఖల్లో ఈ మద్దతుదారులు ఆధారాలు కలిగి ఉగ్రవాదానికి ఆక్సిజన్‌గా పనిచేశారు. ఈ ప్రక్రియ వేగవంతమైతే ఉగ్రవాదం బలహీనపడుతుందని నిపుణులు అంచనా. ఈ నెట్‌వర్క్‌ను పూర్తిగా ధ్వంసం చేయాలంటే కఠిన తనిఖీలు, ఇంటెలిజెన్స్ మానిటరింగ్ కీలకం. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో రాడికలైజేషన్‌ను అరికట్టడం, ఆయుధ పరపటి బ్రేక్ చేయడం అవసరం. ఇది దీర్ఘకాలిక భద్రతకు బలమైన పునాది వేస్తుంది, కశ్మీర్ స్థిరత్వాన్ని నెలకొల్పుతుంది.

# వ్యూహాత్మక మౌనమే పరిష్కారమా

హైదరాబాద్, జనవరి 17,( (భారతశక్తి)

ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తప్పులు జరగడం సహజం, ప్రజలు క్షమించడానికి సమయం పడుతుంది. తర్వాతి ఎన్నికల్లో ప్రజలే భవిష్యత్‌ను నిర్ణయిస్తారు. కానీ పదేళ్ల అధికారంతో తెలంగాణ చాంపియన్‌లుగా ప్రచారం చేసుకున్న బీఆర్ఎస్‌ను 2023 ఎన్నికల్లో ప్రజలు ఓడించారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉంది. రెండేళ్ల పాలన పూర్తి చేసుకుంది. ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత లేదు. హామీలు అమలు చేయకపోయినా విపక్షాల నుంచి తప్ప ప్రజల నుంచి విమర్శలు రావడం లేదు. ఇక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అయితే రేవంత్ సర్కార్‌ను నిత్యం టార్గెట్ చేస్తున్నారు. దీంతో విశ్లేషకులు నేతలకు ఓపిక ఉండాలని సూచిస్తున్నారుకేటీఆర్ ప్రతీ మాట సామాన్యుడి మనసులో కౌంటర్‌గా మారుతోంది. ఇది తన మాటల విలువను తగ్గిస్తూ, పార్టీకి నష్టం కలిగిస్తోంది. రేవంత్‌పై ఘాటు వ్యాఖ్యలు చేస్తూ కేటీఆర్ స్వయం పార్టీ బలోపేతానికి అడ్డంకిగా మారుతున్నారు. గత అధికార కాలంలోని తప్పులు గుర్తుంచుకోకుండా విమర్శిస్తుండడంతో ప్రజలు పెద్దగా కనెక్ట్ కావడం లేదు. తాజా పార్టీ మార్పులపై కేటీఆర్ వ్యాఖ్యలు గతాన్ని గుర్తు చేస్తున్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉంటూ ప్రతిపక్షాలను అణచివేసి, తెలంగాణ పోరాటకారులను దూరం చేసి, కొత్తలకు పదవులు పంచారు. ఇప్పుడు కాలె యాదయ్య, పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి ఎమ్మెల్యేలపై ఆరోపణలు చేస్తున్నారు. స్పీకర్ ఆధారాలు లేవని ప్రకటించినా, కేటీఆర్ సోషల్ మీడియాలో రాజ్యాంగ విలువలను ప్రశ్నిస్తున్నారు. అప్పటి ఫిరాయింపులు 'బంగారు తెలంగాణ' పేరుతో జరిగాయని ప్రజలు మరువలేదు కేటీఆర్. ప్రస్తత పరిణామాల్లో మౌనం చాలా మంచిది. ప్రజలకు ఆలోచనకు సమయం ఇవ్వాలి. గత తప్పులకు పశ్చాత్తాపం చెంది, భవిష్యత్తులో అవి జరగకుండా హామీ ఇవ్వాలి. పడిగట్టు మాటలు, నాన్ స్టాప్ విమర్శలు ప్రజల మద్దతు ఆకర్షించవు. కేటీఆర్ దీన్ని గుర్తించి వ్యూహం మార్చితే పార్టీకి లాభం. అధికారంలో ఉంటూ అందరినీ 'గులాబీ కారు'లో ఎక్కించిన గతం ప్రజల మనసుల్లో ఉంది. ఇప్పుడు విమర్శలు చేసినా, స్వీయ పరిశీలన లేకపోవడం వల్ల ప్రజలు దూరమవుతున్నారు. తగిన సమయం కోసం వేచి ఉండి.. ప్రజల్లో వ్యతిరేకత వచ్చిన తర్వాత స్పందిస్తే ప్రజల మద్దతు లభిస్తుంది.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో కొత్త రూల్

హైదరాబాద్, జనవరి 17 (భారతశక్తి)

హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్, పట్టణ అభివృద్ధిని ప్రభావితం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 10 అంతస్తులు దాటి నిర్మించే భవనాలకు టీడీఆర్ కొనుగోలు తప్పనిసరి చేసింది. చెరువులు, నదుల పరిరక్షణకు భూసేకరణను వేగవంతం చేసేందుకు ఆకర్షణీయమైన టీడీఆర్ ప్యాకేజీని ప్రకటించింది. హైదరాబాద్ మహానగరంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని, పట్టణ అభివృద్ధిని ప్రభావితం చేసేలా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలోని చెరువులు, నదుల పరిరక్షణతో పాటు మౌలిక సదుపాయాల కల్పన కోసం భూసేకరణను వేగవంతం చేసేందుకు 'టీడీఆర్' నిబంధనలను సవరిస్తూ పురపాలక శాఖ జీవో నం.16ను విడుదల చేసింది. ఈ కొత్త ఉత్తర్వులు ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరించిన తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 300 డివిజన్లకు వర్తిస్తాయి. కొత్త నిబంధనల ప్రకారం.. నగరంలో 10 అంతస్తులు దాటి నిర్మించే ప్రతి భవనానికి టీడీఆర్ కొనుగోలు తప్పనిసరి చేశారు. 11వ అంతస్తు నుంచి పై అంతస్తుల వరకు మొత్తం నిర్మాణ విస్తీర్ణంలో 10 శాతానికి సమానమైన టీడీఆర్ సర్టిఫికెట్లను బిల్డర్లు సమర్పించాల్సి ఉంటుంది. దీనివల్ల మార్కెట్‌లో నిల్వ ఉన్న టీడీఆర్ బాండ్లకు విపరీతమైన డిమాండ్ పెరుగుతుంది. ఒకవేళ బిల్డర్లు తమ భూమిని ప్రభుత్వానికి ఉచితంగా అప్పగిస్తే.. వారికి సెట్‌బ్యాక్, భవన ఎత్తు నిబంధనలలో ప్రత్యేక సడలింపులు కూడా కల్పిస్తారు. చెరువులు, నదుల సమీపంలోని పట్టా భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం ఆకర్షణీయమైన ప్యాకేజీని ప్రకటించింది. ఎఫ్‌టీఎల్ పూర్తిస్థాయి నీటి మట్టం పరిధిలోని భూములకు 200 శాతం టీడీఆర్, చెరువుల బఫర్ జోన్లలోని భూములకు 300 శాతం టీడీఆర్, బఫర్ వెలుపలి భూములు అభివృద్ధి కోసం సేకరిస్తే ఏకంగా 400 శాతం టీడీఆర్ ఇవ్వాలని నిర్ణయించారు. అయితే, భూసేకరణ విస్తీర్ణం ఒక ఎకరా కంటే ఎక్కువగా ఉంటే ఆ దరఖాస్తును ప్రభుత్వం నేరుగా పరిశీలిస్తుంది. మూసీ నది పరీవాహక ప్రాంతం, చెరువుల సుందరీకరణకు భూ యజమానుల నుంచి ఎదురవుతున్న అడ్డంకులను తొలగించడానికి ఈ నిర్ణయం దోహదపడనుంది. గతంలో జారీ చేసిన సుమారు రూ. 10 వేల కోట్ల విలువైన టీడీఆర్ సర్టిఫికెట్లు మార్కెట్‌లో పేరుకుపోయి, వాటి విలువ పడిపోయింది. ఫలితంగా యజమానులు భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తూ నగదు పరిహారం కోరుతున్నారు. ఇప్పుడు పెద్ద భవనాల నిర్మాణానికి టీడీఆర్ తప్పనిసరి చేయడం వల్ల, బిల్డర్లు వీటిని కొనుగోలు చేయక తప్పదు. దీనివల్ల మార్కెట్‌లో టీడీఆర్ ధర పెరగడంతో పాటు, ప్రభుత్వంపై నగదు పరిహారం భారం తగ్గుతుంది. తద్వారా నిధుల కొరతతో ఆగిపోయిన రోడ్ల విస్తరణ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులు వేగవంతం కానున్నాయి.

# తెలంగాణలో కుల రాజకీయాలు సాధ్యమేనా

కరీంనగర్, జనవరి 17 (భారతశక్తి)

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ రెండు పడవలపై కాళ్లు పెట్టకూడదు. ఆంధ్రప్రదేశ్ లో కూటమి తో అధికారంలోకి వచ్చిన పవన్ కల్యాణ్ తెలంగాణలోనూ పార్టీని విస్తరించాలని భావిస్తున్నట్లు కనపడుతుంది. ఇటీవల కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయం పర్యటనలో భాగంగా ఒక రిసార్ట్ లో తెలంగాణ జనసేన నేతలు, కార్యకర్తలతో పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. అయితే పవన్ కల్యాణ్ ను అభిమానించే వారు తెలంగాణలో లేరని కాదు. అది సినిమా హీరోగానే అభిమానించేవాళ్లు. అంతే తప్ప రాజకీయంగా ఆయనను ఓన్ చేసుకునే వారు దాదాపుగా లేరనే చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు,తెలంగాణ పాలిటిక్స్ కు చాలా తేడా ఉంది. ఇక్కడ కుల రాజకీయాలు అస్సలు పనిచేయవు. అలాగే సెంటిమెంట్ బాగా పనిచేస్తుంది. గతంలో జరిగిన అనేక ఎన్నికలు ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. అందుకే వైసీపీ తెలంగాణలో దుకాణం మూసేసింది. తన పార్టీని ఆంధ్రప్రదేశ్ కు మాత్రమే పరిమితం చేసింది. అసలు జగన్ తెలంగాణ రాజకీయాల్లో వేలు కూడా పెట్టడం లేదు. ఇక కూటమిలో తన మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ కూడా దాదాపు అదే బాటలో పయనిస్తుంది. తెలంగాణలో టీడీపీ ఇంతవరకూ రాష్ట్ర కమిటీని కూడా ఏర్పాటు చేయలేదు. జగన్, చంద్రబాబును చూసినట్లుగానే పవన్ కల్యాణ్ ను ఆంధ్రప్రదేశ్ వాసిగానే తెలంగాణ ప్రజలు చూస్తారు. అంతే తప్ప తండోపతండాలుగా వచ్చి ఓట్లు గుమ్మరించే సీన్ మాత్రం లేదనే చెప్పాలి. అందుకే ఆంధ్రప్రదేశ్ లో క్షేత్రస్థాయిలో పార్టీని



బలోపేతం చేసుకుంటే మంచిది. పార్టీ పెట్టి ఇన్నేళ్లయినా ఆంధ్రప్రదేశ్ లోని అన్ని నియోజకవర్గాల్లో జనసేన లేదు. ఇది వాస్తవం. అలాంటిది తెలంగాణలో రాజకీయం చేసి చేతులు కాల్చుకోవడం తప్ప మిగిలేది ఏమీ ఉండదన్న కామెంట్స్ వినపడుతున్నాయి. బహుశ బీజేపీతో పొత్తు పెట్టుకున్నప్పటికీ ఇక్కడ పెద్దగా రాజకీయంగా ఒరిగేది లేదు. వచ్చేది లేదు. అందుకే ముందు ఆంధ్రప్రదేశ్ లో పార్టీపై ఫోకస్ పెట్టి వచ్చే ఎన్నికల్లో మరిన్ని సీట్లు గెలిచి ముఖ్యమంత్రి పదవికి దగ్గర దారి ఏర్పరుచుకుంటే మంచిదన్న సూచనలు పవన్ కల్యాణ్ కు కొందరు సోషల్ మీడియా వేదికగా చెబుతున్నారు. మరి పవన్ చెవికి ఈ మాటలు ఎక్కుతాయో? లేదో? చూడాలి.

# బెట్టింగ్ యాప్ లపై కొరడా..

న్యూఢిల్లీ, జనవరి 17, (భారతశక్తి)

బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వెబ్‌సైట్లపై కేంద్రం కొరఢా ఝుళిపించింది. ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్ వల్ల యువత ఆర్థికంగా చితికిపోకుండా ఉండేందుకు కేంద్రం తాజాగా 242 చట్ట విరుద్ధమైన వెబ్‌సైట్లను బ్లాక్ చేసింది. అక్టోబర్ 2025 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త గేమింగ్ చట్టం ప్రకారం ఇప్పటివరకు దాదాపు 8 వేల వెబ్‌సైట్లపై నిషేధం విధించింది. నగదు ప్రమేయం ఉన్న ఆన్‌లైన్ గేమ్స్‌ను నిర్వహిస్తే భారీ జరిమానాలు తప్పవని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం వెబ్‌సైట్లపై కేంద్ర ప్రభుత్వం మరోసారి ఉక్కుపాదం మోపింది. జనవరి 16వ తేదీన (శుక్రవారం) ఒక్కరోజే దేశవ్యాప్తంగా 242 చట్టవిరుద్ధమైన వెబ్‌సైట్లను బ్లాక్ చేసినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. దేశ యువతను ఈ చెడు వ్యసనాల నుంచి కాపాడటమే లక్ష్యంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం తాజాగా బ్లాక్ చేసిన 242 సైట్లతో కలిపి.. ఇప్పటివరకు దేశంలో మొత్తం 7,800 కంటే ఎక్కువ బెట్టింగ్, జూదపు ప్లాట్‌ఫామ్‌లను నిలిపివేశారు. గత ఏడాది తీసుకొచ్చిన కొత్త చట్టం తర్వాత ఈ చర్యలు మరింత వేగవంతం అయ్యాయి.ఆన్‌లైన్ గేమింగ్ రంగాన్ని క్రమబద్ధీకరించడానికి కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్ 2025 ను అమలులోకి తెచ్చింది. ఈ కొత్త చట్టం 2025 అక్టోబర్ 1వ తేదీ నుంచి అధికారికంగా అమల్లోకి వచ్చింది. డబ్బుతో కూడిన అన్ని రకాల ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ సైట్లపై ఈ చట్టం పూర్తిగా నిషేధం విధిస్తుంది. ఇందులో నైపుణ్యంతో కూడిన ఆటలైనా లేదా అదృష్టంపై ఆధారపడే ఆటలైనా నగదు ప్రమేయం ఉంటే అవి చట్టవిరుద్ధమేనని కేంద్రం తేల్చి చెప్పింది. ఈ చట్టం ప్రకారం చట్టవిరుద్ధమైన గేమ్స్ నిర్వహించే వారికి 3 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ. 1 కోటి వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం గేమింగ్ సేవలను అందించే సంస్థలు.. బెట్టింగ్ సైట్లను ప్రచారం చేసే ప్రకటనదారులు, ప్రమోటర్లు.. ఆ ప్లాట్‌ఫామ్‌లకు ఆర్థిక సహకారం అందించే వారిపై ప్రధానంగా చర్యలు తీసుకుంటుంది. ఈ ఆటలు ఆడే ప్లేయర్స్‌పై ప్రస్తుతానికి ఎలాంటి జరిమానాలు విధించబడవని.. కేవలం నిర్వాహకులపైనే చర్యలు ఉంటాయని తెలుస్తోంది.

ఈ-స్పోర్ట్స్‌కు ప్రోత్సాహం

అన్ని ఆటలను నిషేధించడం కాకుండా.. విద్య, సామాజిక స్పృహను పెంపొందించే ఈ-స్పోర్ట్స్.. ఎడ్యుకేషనల్ గేమ్స్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వీటి నియంత్రణకు ఒక ప్రత్యేక అథారిటీని కూడా ఏర్పాటు చేయనున్నారు.

# భూభారతిలోనూ...అవే లోపాలు

హైదరాబాద్, జనవరి 17 (భారతశక్తి)

బీఆర్ఎస్ ప్రభుత్వ పతనానికి ఒక ప్రధాన కారణమైన ధరణి పోర్టల్‌లోని లోపాలను సరిదిద్ది, పారదర్శకమైన భూ రికార్డుల నిర్వహణ కోసం ప్రస్తుత ప్రభుత్వం భూభారతి ని ఎంతో ఆర్భాటంగా తీసుకువచ్చింది. అయితే, ఆచరణలో ఈ కొత్త వ్యవస్థ కూడా పాత రోగాలనే ప్రదర్శిస్తుండటం ఇప్పుడు రైతాంగాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. ఇటీవల జనగామ, యాదాద్రి జిల్లాల్లో వెలుగుచూసిన చలాన్ల కుంభకోణం ఈ వ్యవస్థలోని సాంకేతిక లొసుగులను బట్టబయలు చేసింది. పేరు మార్చారు కానీ, అక్రమార్కులు చొరబడే మార్గాలను మాత్రం మూసివేయలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. భూభారతి వెబ్‌సైట్‌లో ఎడిట్ ఆప్షన్లను వాడుకుని నిందితులు ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయల గండి కొడుతున్నారు. కేవలం సాఫ్ట్‌వేర్ కోడింగ్‌లో ఉన్న లోపాల వల్ల అక్రమార్కులు చలాన్ల విలువను మార్చి, ప్రభుత్వానికి తక్కువ డబ్బు చెల్లిస్తూ రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తున్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సింది పోయి, సమస్య బయటపడినప్పుడు మాత్రమే స్పందిస్తూ అండర్ ప్లే చేస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. లోపాలను ఆదిలోనే గుర్తించి అరికట్టడంలో ఐటీ విభాగం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. భూముల మార్పిడి, వారసత్వ సంక్రమణ, పట్టాదారు పాస్ పుస్తకాల్లో తప్పుల సవరణ వంటి అంశాల్లో భూభారతి ఇంకా వేగం పుంజుకోలేదు. స్లాట్ బుకింగ్ దొరకకపోవడం, డాక్యుమెంట్లు అప్‌లోడ్ కాకపోవడం వంటి సాంకేతిక సమస్యలతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ధరణిలో ఉన్న సమస్యలే ఇక్కడా కొనసాగుతున్నాయి, మాకు ఒరిగిందేమిటి అని రైతులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం పర్యవేక్షణ లోపించడం వల్ల మధ్యవర్తులు మళ్లీ రంగప్రవేశం చేసి రైతులను నిలువునా దోచుకుంటున్నారు. గత ఎన్నికల్లో ధరణిపై ఉన్న ప్రజా వ్యతిరేకతను బీఆర్ఎస్ ప్రభుత్వం తక్కువ అంచనా వేసి భారీ మూల్యం చెల్లించుకుంది. ఇప్పుడు అదే బాటలో భూభారతి వల్ల వచ్చే ఫిర్యాదులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. భూమి అనేది సగటు మనిషికి అత్యంత సెంటిమెంట్ , ఆర్థిక మూలాధారం. అక్కడ చిన్న తప్పు జరిగినా అది పాలనపై తీవ్ర వ్యతిరేకతకు దారి తీస్తుంది. భూభారతి పట్ల పెరుగుతున్న అసంతృప్తిని ప్రభుత్వం సకాలంలో గుర్తించకపోతే, అది రాబోయే ఎన్నికల్లో ప్రస్తుత ప్రభుత్వానికి చేదు అనుభవాలను మిగిల్చే అవకాశం ఉంది. అసలు ఇలాంటి స్కాములు ఎందుకు జరుగుతున్నాయి? వ్యవస్థలో పారదర్శకత ఎక్కడ లోపిస్తోంది? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. కేవలం ఒక పోర్టల్‌ను మార్చి మరొకటి తీసుకురావడం వల్ల ప్రయోజనం ఉండదు. అది పటిష్టమైన భద్రతతో, సామాన్యుడికి అర్థమయ్యేలా ఉండాలి. అధికారులు, ఐటీ నిపుణులు నిరంతరం పర్యవేక్షించని పక్షంలో ఏ వ్యవస్థ అయినా అక్రమార్కులకు అడ్డాగా మారుతుందన్న ఆందోళన కనిపిస్తోంది.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కండిషన్స్ అప్లై...

ఖమ్మం, హైదరాబాద, జనవరం 17, (భారతశక్తి)

పేదల సొంతింటి కలను నెరవేర్చి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి తెలంగాణ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇళ్లు పథకం' అమలు చేస్తోంది. ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు కూడా ఈ పథకానికి అర్హులే. నియోజకవర్గానికి 3,500 చొప్పున తొలి విడతలో 4,16,500 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. పూరిగుడిసెలు, తాత్కాలిక ఇళ్లలో ఉంటున్నవారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. సొంత స్థలం ఉన్నవారికి తొలి దశలో ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా పనుల పురోగతిని అప్‌డేట్ చేస్తుండగా.. ఏఐ సాంకేతికతో అక్రమాలను గుర్తించి, చర్యలు తీసుకుంటున్నారు. సొంతిల్లు నిర్మించుకోవడం అనేది ఎలాంటి వారికైనా ఒక అపురూపమైన కల. మరి పేదలకు సొంతిల్లు నిర్మించుకోవడం అనేది చాలా పెద్ద కల. పేదలకు, గూడు లేనివారికి సొంతింటి కలను నిజం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం 'ఇందిరమ్మ ఇళ్లు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో నిరుపేదలైన, సొంత ఇల్లు లేని వారికి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం లేదా ఇంటి స్థలంతో పాటు ఆర్థిక సాయం అందిస్తారు. ఈ పథకం పూర్తి వివరాలు, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ, దరఖాస్తు స్టేటస్ తెలుసుకునే విధానం, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ తదితర వివరాలు..

తెలంగాణ రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పక్కా ఇల్లు నిర్మించుకోవడానికి సహాయం అందించడమే ఇందిరమ్మ ఇళ్లు పథకం ముఖ్య ఉద్దేశ్యం. ఈ పథకం ద్వారా కింది విధంగా లబ్ధి చేకూరుస్తారు..

1) ఆర్థిక సహాయం: సొంత స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తారు.

2) స్థలం + ఆర్థిక సహాయం: సొంత స్థలం లేని వారికి ఇంటి స్థలం కేటాయించడంతో పాటు రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తారు.

3) ఎస్సీ, ఎస్టీలకు అదనపు సహాయం: ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ. 5 లక్షలతో పాటు అదనంగా రూ. 1 లక్ష (మొత్తం రూ. 6 లక్షలు) ఆర్థిక సహాయం అందిస్తారు. ఇంటి నిర్మాణం వివిధ దశల్లో ఆర్థిక సహాయం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఉదాహరణకు.. పునాది పూర్తయిన తర్వాత రూ. 1 లక్ష, గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత రూ. 1.25 లక్షలు, స్లాబ్ నిర్మాణ సమయంలో రూ. 1.75 లక్షలు అందిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షలకు పైగా ఇళ్లను నిర్మించాలని రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తొలి దశలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకానికి తెలంగాణ ప్రభుత్వం రూ. 22,000 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది.

ఇందిరమ్మ ఇళ్లు పథకానికి ఎవరు అర్హులు?

దరఖాస్తుదారుడు తెలంగాణ రాష్ట్రానికి చెందిన పర్మినెంట్ నివాసి అయి ఉండాలి.

దారిద్ర్యరేఖకు) దిగువన ఉన్న కుటుంబాలు, లేదా ఆర్థికంగా వెనుకబడిన వర్గా ప్రజలు అర్హులు.

దళితులు, గిరిజనులు, మైనారిటీలు, ఇతర బలహీన వర్గాల వారికి ప్రాధాన్యం ఇస్తారు.

దరఖాస్తుదారుడికి లేదా అతడి కుటుంబానికి సొంత పక్కా ఇల్లు ఉండకూడదు.

గుడిసెలు, తాత్కాలిక ఇళ్లలో నివసించే వారికి ప్రాధాన్యం ఇస్తారు.

దరఖాస్తుదారుడు గతంలో ఏ ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం కింద లబ్ధి పొంది ఉండకూడదు (ముఖ్యంగా 1995 తర్వాత).

రేషన్ కార్డు ఆధారంగా లబ్ధిదారుడిని ఎంపిక చేస్తారు.

కుటుంబ వార్షిక ఆదాయం రూ. 2 లక్షల కంటే తక్కువగా ఉండాలి.

ఒంటరి మహిళలు, వితంతువులు కూడా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇందిరమ్మ ఇళ్లు అధికారిక వెబ్‌సైట్:ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోనివారు.. కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందిరమ్మ ఇళ్లు పథకం నిరంతరంగా కొనసాగుతుందని, అర్హులైన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోచ్చునని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. గ్రామ పంచాయతీలు లేదా వార్డు కార్యాలయాలు లేదా మండల కార్యాలయాల నుంచి ప్రజా పాలన దరఖాస్తు పత్రాలను పొందవచ్చు. ఈ దరఖాస్తు ఫారమ్‌లను జాగ్రత్తగా నింపి, అవసరమైన పత్రాలను జతచేసి ఎంపీడీవో, ఎమ్మార్వో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో సమర్పించాలి. ఇందిరమ్మ ఇళ్లు పథకానికి దరఖాస్తులను 'ప్రజా పాలన' కార్యక్రమం ద్వారా స్వీకరించారు. 2023 డిసెంబర్ 28 నుంచి 2024 జనవరి 6 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరించారు. ఇళ్ల కోసం మొత్తం 77.18 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 36.03 లక్షల (46.7 శాతం) మంది మాత్రమే అర్హులని గుర్తించారు. మిగతా 41.15 లక్షల (53.3 శాతం) మందిని అనర్హులుగా తేల్చారు. అనర్హులందరూ దారిద్ర్యరేఖ (బీపీఎల్)కు ఎగువన ఉన్నవారేనని అధికారులు నిర్ధారించారు. మొత్తం దరఖాస్తుదారుల వివరాలను తెలంగాణ గృహ నిర్మాణ శాఖ ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాలుగా సిద్ధం చేసింది. దీని ప్రకారమే ప్రతి ఆర్థిక సంవత్సరం నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున.. రాష్ట్రవ్యాప్తంగా ఏటా గరిష్టంగా 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం



లక్ష్యంగా పెట్టుకుంది. ఇళ్ల దరఖాస్తుల వివరాలను ఇందిరమ్మ యాప్‌లో నమోదు చేశారు. యాప్‌లో పొందుపరిచిన మార్గదర్శకాల ప్రకారం క్షేత్ర స్థాయిలో సిబ్బంది అన్ని కోణాల్లో సర్వేలు నిర్వహించారు. దీంతో పాటు ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా తీసుకున్న వివరాలను కూడా పరిశీలించి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేశారు. దరఖాస్తుదారులను ఎల్-1, ఎల్-2, ఎల్-3గా విభజించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ప్రస్తుతం ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ అందుబాటులో లేదు. భవిష్యత్తులో ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించవచ్చు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం దరఖాస్తుకు అవసరమైన పత్రాలు ఏంటి?

- ఆధార్ కార్డు
- రేషన్ కార్డు / ఆహార భద్రతా కార్డు
- కుటుంబ ఆదాయ ధ వీకరణ పత్రం
- నివాస ధృవీకరణ పత్రం
- కుల ధృవీకరణ పత్రం (అవసరమైతే)
- మైనారిటీ ధృవీకరణ పత్రం (అవసరమైతే)
- బ్యాంకు ఖాతా వివరాలు (బ్యాంకు పాస్‌బుక్ జీరాక్స్)
- భూమి యాజమాన్య పత్రాలు (సొంత స్థలం ఉన్నవారికి)

దరఖాస్తుదారుడి పాస్‌పోర్ట్ సైజు ఫోటోలబ్ధిదారులను గుర్తించేందుకు ఇందిరమ్మ కమిటీలను నియమించారు. గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక విషయంలో ఇందిరమ్మ కమిటీలు ప్రధాన పాత్ర పోషించాయి. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి అధికారులకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. అనర్హులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించినట్లు తేలితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. క్షేత్ర స్థాయి సిబ్బంది, అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అధికారులు పలు విడతలుగా పరిశీలించి అర్హులను గుర్తిస్తున్నారు. ఎంపికలో అతిపేదలు, ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులకు ప్రాధాన్యం ఇస్తారు. పూరిగుడిసెలు లేదా పెంకుటిళ్ళలో నివసిస్తున్న వారికి తొలి దశలో ఇళ్లను నిర్మించి ఇస్తారు. గ్రామసభల ద్వారా అర్హులైన లబ్ధిదారుల జాబితాలను గుర్తిస్తారు. తుది జాబితాను గ్రామసభలో ప్రదర్శించి, అభ్యంతరాలను స్వీకరిస్తారు. నియోజకవర్గాల వారీగా కలెక్టర్లు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పర్యవేక్షిస్తారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు యాప్ తీసుకొచ్చింది. ఈ మొబైల్ యాప్‌ల ద్వారా దరఖాస్తుల పరిశీలన జరుగుతోంది. అధికారులు దరఖాస్తుదారుల వద్దకు వెళ్లి ఫోటోలు తీసుకుని, వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. సొంత స్థలం ఉన్న వారిని అదే స్థలం దగ్గర ఉంచి, జియో ట్యాగింగ్ ద్వారా ఫోటో తీస్తున్నారు. పార్టీలకు అతీతంగా, ఎలాంటి సిఫారసులకు తావులేకుండా, నిజమైన అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రయోజనం చేకూరాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను అందించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో గ్రామాలు, పట్టణాల వారీగా ఎక్కడెక్కడ ఎన్ని కేటాయించాలనే దానిపై అధికారులు దృష్టి సారించారు. మొత్తం 3,500 ఇళ్లలో గ్రామాలు, పట్టణాల వారీగా మంజూరు చేసిన వాటి వివరాలను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి సమర్పిస్తే, ఆయన ఆమోదం తెలుపుతారు. అనంతరం ఎన్ని మంజూరయ్యాయో మళ్లీ గ్రామసభల్లో ప్రదర్శిస్తారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, బిల్లుల మంజూరులో ఏఐ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోంది. ఇందిరమ్మ యాప్‌లో తప్పుడు సమాచారం నమోదు చేస్తే, సులభంగా గుర్తిస్తోంది. ఇందిరమ్మ యాప్‌లో గుంతలు, పునాది, పిల్లర్లు, స్లాబు, గోడలు, ఇంటి స్వరూపం లాంటి ఫొటోలను సిబ్బంది అప్‌లోడ్ చేశారు. దరఖాస్తుదారులకు సంబంధించిన సమగ్ర సమాచారం రికార్డై ఉంటుంది. పనుల పురోగతిపై యాప్‌లో వివరాలు నమోదు కాగానే, లబ్ధిదారుడి వివరాల ఆధారంగా ఏఐ వాటిని పరిశీలిస్తుంది. ఉండాల్సిన దానికంటే భిన్నంగా కనిపిస్తే వెంటనే గుర్తిస్తుంది. దీని ఆధారంగా అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి, అక్రమాలు తేలితే చర్యలు తీసుకుంటారు. ఇళ్ల పునాది నిర్మాణాలు పూర్తి కాకున్నా, తప్పుడు ఫోటోలను అప్‌లోడ్ చేసి డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు చేసే ప్రయత్నాలను ఏఐ సాంకేతికతతో గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో 18 ఇళ్ల నిర్మాణాల పునాదులు పూర్తయ్యాయంటూ బిల్లుల కోసం ఆన్‌లైన్‌లో వివరాలు, ఫొటోలు నమోదు చేయగా.. తేడా ఉన్నట్లు ఏఐ గుర్తించడంతో అధికారులు పరిశీలించి, బిల్ కలెక్టర్‌ను విధుల నుంచి తొలగించారు. యాప్‌లో ఏఐ సాయంతో గుర్తించే అంశాలు:లబ్ధిదారుల ముఖకవళికలుఇల్లు నిర్మించాల్సిన స్థలం అక్షాంశ, రేఖాంశాలుఇంటి స్వరూపం (ఆర్‌సీసీ/ ఏసీ షీట్/ తాటాకులు/ ప్లాస్టిక్ షీట్ రూఫ్)ఇంటి నిర్మాణ దశల ఫొటోలులబ్ధిదారుడి వివరాలుఇందిరమ్మ ఇళ్లు స్కీమ్ 2025

యాప్ సర్వేలో ఇందిరమ్మ ఇంటికి అర్హులేనని తేలినప్పటికీ.. సమగ్ర కుటుంబ సర్వేలో ఆదాయ పన్ను చెల్లిస్తున్నట్లు, ఇతర ప్రాంతంలో ఇల్లు, కారు ఉన్నట్లు తేలితే, అలాంటివారిని అనర్హులుగా గుర్తించి దరఖాస్తులను పక్కన పెట్టేస్తున్నారు

# రాహుల్ గాంధీ ప్రచారం చేసిన నన్ను ఓడించారు: టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, జనవరి 17:




రాహుల్ గాంధీ స్వయంగా ప్రచారం చేసినప్పటికీ, ఇక్కడి ప్రజలు తనను ఓడించారని, ఇది బాధ కలిగించిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డిలో శనివారం జరిగిన సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు జగ్గారెడ్డి తన ఓటమిపై ఆవేదన వ్యక్తం చేశారు.నా ఓటమికి కారణం పేద ప్రజలు కాదు,ఇక్కడి పెద్దలు, మేధావులే తనను ఓడించారని ఆరోపిస్తూ, ఇకపై తాను ఎన్నికల్లో పోటీ చేయనని స్పష్టం చేశారు. భుజంపై చేయి వేసి జగ్గారెడ్డిని గెలిపించాలని స్థానికులను రాహుల్ గాంధీ అడిగితే ఓడించారన్నారు. ఇది నా జీవితంలో మరువలేనిదన్నారు.సంగారెడ్డి లో నా భార్య నిర్మల పోటీ చేసిన కూడా నేను ప్రచారానికి రాను. రాష్ట్రంలో నేను ఎక్కడికి వెళ్లి అయినా ప్రచారం చేస్తానని సంగారెడ్డిలో మాత్రం ప్రచారం చేయనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఆర్కిటెక్చర్ కోర్సు, కెరీర్ అవకాశాలపై అవగాహన

సంగారెడ్డి,భారతశక్తి ప్రతినిధి, జనవరి 17:



ఆర్కిటెక్చర్ విద్య, కెరీర్ అవకాశాల గురించి ఇంటర్మీడియెట్ విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించే లక్ష్యంతో, హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (జీఎస్ఏ) డిసెంబర్ 2025 నుంచి జనవరి 2026 వరకు పలు ఔట్ రీచ్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించింది.మదీనగూడలోని జెన్ సిస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఆర్కిటెక్చరల్ మోడల్స్, డ్రాయింగులు, ముఖాముఖి ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. అలాగే ఆచరణాత్మక, సృజనాత్మక అన్వేషణను ప్రోత్సహించే మందల ఆర్ట్ వర్కుషాపును కూడా నిర్వహించారు. మొత్తం 168 మంది జెన్ సిస్ విద్యార్థులు, ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆ తరువాత, స్వామినారాయణ గురుకుల్ నుంచి దాదాపు 250 మంది విద్యార్థులు, శ్రీ చైతన్య బాలురు (వివిధ సెషన్లలో 300, 500, 300 మంది), బాలికల (855 మంది) కోసం వరుస ఔట్ రీచ్ కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు విశ్వవిద్యాలయ ప్రాంగణ అభవాలను, ఆర్కిటెక్చర్ విద్యపై ఆచరణాత్మక అవగాహనను, డిజైన్ ఆలోచనను పెంపొందించడంతో పాటు విభిన్న కెరీర్ అవకాశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమాలన్నింటినీ గీతం ఆర్కిటెక్చర్ అధ్యాపకులు ఆర్.అభిషేక్ కుమార్ సింగ్, ఆర్.స్నిగ్ధరాయ్ సమన్వయం చేశారు. ఇవన్నీ గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ యొక్క విద్యాపరమైన అవగాహన, కెరీర్ మార్గదర్శనం పట్ల నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు.


# మున్సిపాలిటీల వార్డు స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు

## – రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా కొనసాగిన ప్రక్రియ

సంగారెడ్డి,భారత శక్తి, జనవరి 17 : మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా జిల్లాలోని అందోల్ బి జోగిపేట్ , గడ్డపోతారం, గుమ్మడిదల, ఇంద్రేశం, ఇస్నాపూర్ , జిన్నారం , కోహీర్, నారాయణఖేడ్, సదాశివపేట్, సంగారెడ్డి, జహీరాబాద్

మున్సిపాలిటీల వార్డు స్థానాలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ రిజర్వేషన్ లు ఖరారు చేయడం జరిగిందని అడిషనల్ కలెక్టర్ మాధురి తెలిపారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో అదనపు కలెక్టర్లు మాధురి, ఇంచార్జ్ అడిషనల్ కలెక్టర్ పాండు తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శనివారం రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించారు.జిల్లాలోని సంగారెడ్డి మునిసిపాలిటీ పరిధిలోని 38 వార్డులకు, అందోల్ జోగిపేట్ మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులు, గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులు, గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డులకు , ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులకు, ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 26 వార్డులకు, జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులకు, కోహీర్ మున్సిపాలిటీ పరిధిలోని 16 వార్డులకు, నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని 15 వార్డులకు, సదాశివ పేట మున్సిపల్ పరిధిలోని 26 వార్డులకు, జహీరాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని 37 వార్డు స్థానాల కోసం ఎస్.సి, ఎస్సీ(మహిళా), ఎస్.టి, ఎస్టీ(మహిళా), బి.సి, బీసీ(మహిళా), అన్ రిజర్వుడు, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీల రిజర్వేషన్లను నిబంధనలను అనుసరిస్తూ ఖరారు చేశారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి 1 వార్డు కేటాయించబడగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి 3 వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి 2 వార్డులు ఖరారయ్యాయని అడిషనల్ కలెక్టర్ మాధురి తెలిపారు. అదేవిధంగా బీ.సీ జనరల్ కు 7 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 6 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు జనరల్ కేటగిరీకి 8 , అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 11 వార్డులు రిజర్వ్ అయ్యాయని వివరించారు.

జహీరాబాద్ మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి 2 వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి 2 వార్డు కేటాయించబడిందని ఆమె వెల్లడించారు. బీ.సీ జనరల్ కు 7 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 6 వార్డులు




రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 9, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 10 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు.సదాశివపేట మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి ఒక వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించడం జరిగిందని వెల్లడించారు. బీ.సీ జనరల్ కు 5 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 5 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 6, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 7 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు.ఆందోల్ జోగిపేట్ మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి రెండు వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించబడిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 3 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 3 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 4, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 6 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు.నారాయణఖేడ్ మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించబడిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 2 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 2 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 4, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 4 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు.ఇస్నాపూర్ మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి 2 వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి రెండు వార్డులు కేటాయించడం జరిగిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 4 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 4 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 6, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 7 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు.జిన్నారం మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి రెండు వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించబడిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 3 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 3 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 4, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 6 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు. కోహిర్ మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి రెండు వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి రెండు వార్డులు కేటాయించడం జరిగిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 2 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 3, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 5 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు.గడ్డపోతారం మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి రెండు వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించబడిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 3 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 2 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 3, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 6 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు.గుమ్మడిదల మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి ఒకటి, ఎస్సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు కేటాయించబడిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 4 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి 4 వార్డులు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 5, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 6 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు.ఇంద్రేశం మున్సిపాలిటీలో ఎస్టీ జనరల్ కేటగిరీకి ఒక వార్డు ఖరారు కాగా, ఎస్సీ జనరల్ కేటగిరీకి మూడు వార్డులు, ఎస్సీ మహిళా కేటగిరీకి రెండు వార్డులు కేటాయించడం జరిగిందని తెలిపారు. బీ.సీ జనరల్ కు 2 వార్డులు, బీ.సీ మహిళా కేటగిరీకి ఒక వార్డు రిజర్వ్ అయ్యాయని, అన్ రిజర్వుడు కేటగిరీకి 3, అన్ రిజర్వుడు (మహిళా) కేటగిరీకి 6 వార్డులు రిజర్వ్ అయ్యాయని తెలిపారు.ప్రతి మున్సిపాలిటీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, అన్‌రిజర్వుడ్ కేటగిరీలకు కేటాయించిన వార్డుల వివరాలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఖరారు చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. మహిళలకు రిజర్వ్ చేసిన వార్డులను డ్రా విధానంలో ఎంపిక చేసి ప్రకటించినట్లు తెలిపారు.రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియలో జెడ్పీ సీఈవో జానకి రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు ,గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ వార్డుల రిజర్వేషన్లు ఖరారు

## –జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి జితేష్ వి. పాటిల్.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, (భారతశక్తి)జనవరి 17: జిల్లా పరిధిలోని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్, అశ్వారావుపేట, ఇల్లందు మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ ప్రక్రియను శనివారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి. పాటిల్ లాటరీ




పద్ధతిలో నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకతతో రిజర్వేషన్ ప్రక్రియను చేపట్టినట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారుల సమక్షంలో లాటరీ ప్రక్రియ పూర్తయినట్లు స్పష్టం చేశారు.

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 60 వార్డులున్నాయి. వీటిలో ఎస్టీ 11, ఎస్సీ 12, బీసీ 7, సాధారణ మహిళలు 30 మరియు అన్‌రిజర్వ్ 14 వార్డులు ఉన్నాయి. ఎస్టీ వార్డులు 20, 34, 9, 33, 23, 19, 3, 48, 31, 52, 32 గా ఖరారు అయ్యాయి. వీటిలో మహిళలు 34, 52, 31, 23, 9, జనరల్ వర్గానికి 20, 33, 19, 3, 48, 32 అనుగుణంగా ఉన్నాయి. ఎస్సీ వార్డులు 18, 47, 24, 13, 26, 17, 43, 15, 12, 27, 35, 28; మహిళలు 18, 13, 27, 15, 12, 35, జనరల్ 47, 24, 26, 17, 43, 28 గా ఉన్నాయి. బీసీ వార్డులు 46, 59, 21, 60, 30, 55, 53; మహిళలు 46, 60, 21, జనరల్ 59, 30, 55, 53. సాధారణ మహిళలు 10,5,11,54,36,7,22,4,56,8,41,37,57,2,1,16 అన్‌రిజర్వ్ వార్డులు 5, 6, 14, 25, 29, 38, 39, 40, 42, 44, 45, 49, 50, 58 గా నిర్ణయించబడ్డాయి.

అశ్వరావుపేట మున్సిపాలిటీలి 22 వార్డులతో ఉంది. ఎస్టీ 3 (12, 14, 9) వార్డులు, వీటిలో మహిళ 12, జనరల్ 14, 9. ఎస్సీ 4 (2, 21, 7, 22), మహిళలు 2, 21, జనరల్ 7, 22. బీసీ 4 (1, 3, 4, 5), మహిళలు 4, 5, జనరల్ 1, 3. సాధారణ మహిళలు 6 (6, 8, 15, 16, 17, 20), అన్‌రిజర్వ్ 5 (10, 11, 13, 18, 19) గా ఖరారు అయ్యాయి.

ఇల్లందు మున్సిపాలిటీలి 24 వార్డులతో ఉంది. ఎస్టీ 2 (3, 11), మహిళ 11, జనరల్ 3. ఎస్సీ 4 (12, 14, 21, 24), మహిళలు 12, 24, జనరల్ 14, 21. బీసీ 6 (2, 9, 10, 13, 15, 17), మహిళలు 2, 9, 15, జనరల్ 10, 13, 17. సాధారణ మహిళలు 6 (4, 5, 6, 16, 18, 19), అన్‌రిజర్వ్ 6 (1, 7, 8, 20, 22, 23) గా ఖరారు అయ్యాయి.

ఈ రిజర్వేషన్లు 2011 జనాభా ఆధారంగా, బీసీ డెడికేషన్ కమిషన్ నివేదికను అనుసరిస్తూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా ఖరారు చేయబడ్డాయి. లాటరీ ద్వారా ఖరారైన రిజర్వేషన్ల పూర్తి వివరాలను ప్రభుత్వం మరియు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కి నివేదించనున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సంబంధిత మున్సిపల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లా గ్రంథాలయంకు పుస్తకాల విత్తరణ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, (భారతశక్తి)జనవరి 17: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సెంట్రల్ ఆటో వర్క్ షాప్ సూపరింటెండెంట్ ఇంజనీర్ డిపార్ట్మెంట్ లో పనిచేయుచున్న ఆర్ రామ శేషయ్య జిల్లా గ్రంథాలయంకు ఇంజనీరింగ్ బుక్స్, నీట్ ,ఐఐటి, జేఈఈ సంబంధించిన పుస్తకాలను శనివారం వితరణగా అందించారు. వారిని గ్రంథాలయం తరపున గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, పాలకురాలు జి.మణి మృదుల అభినందించారు. ఇలాంటి దాతలు ముందుకు వస్తేనే గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు లాభం చేకూరుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ఈ నెల 20 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ: ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి




తిరుపతి, జనవరి 17(భారత శక్తి): విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణా మండలి (ఏపీఈఆర్సీ) ఈనెల 20వ తేదీ నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహించనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2026 - 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏపీఈఆర్సీ చైర్మన్ పి.వి.ఆర్.రెడ్డి అధ్వర్యంలో నాలుగు రోజులపాటు జరిగే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని తిరుపతి, విజయవాడ, కర్నూలులో నిర్వహించనున్న ట్లు తెలిపారు. విద్యుత్ సంస్థలు ఏపీఈఆర్సీకి సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్) పై ఈనెల 20వ తేదీన తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోనూ, 22, 23 తేదీల్లో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలోనూ, 27న కర్నూలులోని ఏపీఈఆర్సీ కార్యాలయంలోనూ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, తిరిగి 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏపీఈఆర్సీ అధికారులతో పాటు ఆంధ్రప్రదేశ్ ఇంధనశాఖ, ఏపీట్రాన్స్కో, ఏపీజెన్కో, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్, ఏపీసిపిడీసీఎల్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రతి రోజూ మూడు విద్యుత్ పంపిణీ సంస్థల టారిఫ్ ఫైలింగ్ కు సంబంధించిన ప్రజాభిప్రాయాలను స్వీకరిస్తారని వివరించారు. అభిప్రాయాలు తెలియజేయదలుచుకున్న వారు నేరుగా ఆయా వేదికల వద్ద పాల్గొనవచ్చని, నేరుగా పాల్గొనలేని వారికోసం రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల్లోని సమీప విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం లేదా డివిజన్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకోనివారు కూడా విద్యుత్ నియంత్రణ మండలి అనుమతితో అభిప్రాయాలను తెలియచేయవచ్చన్నారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు వీక్షించేందుకు వీలుగా ప్రత్యక్షప్రసారం చేయనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

# బాలికల భవితకు బంగారు బాట వేద్దాం

సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న అసమానతలు వివక్ష పై ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో జాతీయ బాలికా దినోత్సవం జనవరి 24' 2008 నుండి కేంద్ర ప్రభుత్వం నేషనల్ గర్ల్స్ డెవలప్మెంట్ మిషన్ కేంద్ర ప్రభుత్వం 'మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖఆధ్వర్యంలోనిర్వహిస్తారు. "బాలికా దినోత్సవ సందర్భంగా" బాలికల సాధికారిత సమాజంలో బాలికల సంరక్షణ హక్కులు ఆరోగ్యం 'విద్య 'భద్రత సామాజిక ఎదుగుదల బాలికలకు 'బాలురతో సమానహక్కులు' సమాన అవకాశాలు స్వేచ్ఛ బాలికను గౌరవించడం అన్ని రంగాలలో బాలురతో సమానంగా అవకాశాలు ఇవ్వడం బాలికల పట్ల వివక్షతను తొలగించడం సాంఘిక 'ఆర్థిక సమానత్వ కల్పన 'జెండర్ సమానత్వం సామాజిక భద్రత మొదలగు అంశాల మీద అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపపట్టడం జరుగుతుంది.

ఆడపిల్లనే అనే సంస్కృతి



ఆడపిల్ల అంటే "ఆడపిల్లనేఅబశ్రీశ్రీ" అనే సంస్కృతి సమాజంలొ నెలకొనడం బాలికల పాలిట శాపంగా పరిణమించింది. తల్లి గర్భంలో పెరుగుతున్నది ఆడ శిశువు అని తెలియగానే "భ్రూణ హత్యలకు" పాల్పడటం సర్వసాధారణమైంది.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో నిర్లక్ష్యం

కుటుంబం నుండేఅబశ్రీశ్రీ ఆడపిల్ల నిర్లక్ష్యం పెంపకంలొ వివక్షతకు గురికావడం విచారకరం. కుటుంబం నుండి మొదలైన వివక్షత నిర్లక్ష్యం చిన్న చూపు అన్ని రంగాలలో నెలకొనడం వల్ల బాలికల అభివృద్ధికి వారి సాంస్కృతిక 'సాంఘీక ' ఆర్థిక 'సామాజిక వికాసానికి గొడ్డలిపెట్టుగాపరిణమించింది . సమస్యల విషవలయంలో చిక్కుకు పోయిన ఆడపిల్లల అభివృద్ధి సంక్షేమం ఆశించిన మేరకు జరుగలేదు. ఆడ పిల్లలను కించపరచడం సామాజిక రుగ్మతైంది.

లిచట్టాలు విఫలంలి బాలికలకు విద్య వైద్యం ఆహారం చట్టబద్దమైన హక్కు ఆరోగ్య సంరక్షణ సామాజిక భద్రత బాల్యవివాహాలు నుండి బాలికలకు విముక్తి కల్పించాలని ప్రవేశపెట్టిన అనేక చట్టాలు పథకాలు ఆశించిన ఫలితాలు సాధించలేదు . సమస్యలేఅబశ్రీశ్రీ ఆడపిల్లల ఆస్తులుగా అవమానాలు నిర్లక్ష్యం అనారోగ్యం వేతన వివక్ష వారికి అబశ్రీశ్రీ ఆభరణాలుగా పరిణమించాయి.

రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం

కేంద్ర ప్రభుత్వం 2015లో చేపట్టిన " "భేటీ బచావో బేటి పడావో' అనే పథకం ఆడపిల్లల అభివృద్ధికి వారి సాంఘిక ఆర్థిక వికాసం కోసం ప్రవేశ పెట్టిన పథకం రాష్ట్ర ప్రభుత్వాల అమలులో నిర్లక్ష్యం వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదు. కేంద్ర మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2015 ఏప్రిల్ నుండి జాతీయ బాలికా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించడానికి నేషనల్ గర్ల్స్ డెవలప్ మెంట్ మిషన్ కార్యక్రమ రూపకల్పన జరిగింది.

బాలికల సంరక్షణ కొరకు ఆడపిల్లలకు షరతులతో కూడిన ధనలక్ష్మి పథకం' కిశోరి శక్తి యోజన సుకన్య 'స్వమృద్ధి యోజన పౌష్టి ఆహార పథకం మొదలగు పలు పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుంది 1989వ సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల అంతర్జాతీయ ఒడంబడికను రూపొందించి సభ్య దేశాలలో ఆడపిల్లల సామాజిక ఆర్థిక సాంఘిక సాంస్కృతిక హక్కుల పరిరక్షణకు పూనుకున్నది.

స్త్రీల అక్షరాస్యత

జనాభాలో నేటికీ 20 కోట్ల మంది మహిళలు నిరక్షరాస్యులుగా ఉన్నారు. వీరిని అక్షరాస్యులను చేసినప్పుడు మాత్రమే మహిళా సాధికారత సాధ్యమవుతుంది.

స్త్రీ పురుష నిష్పత్తి

రోజురోజుకీ ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతుంది ఇలాగే కొనసాగితే చాలా సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది 2011లో స్త్రీ పురుష నిష్పత్తి ప్రతి 1000 మంది పురుషులకు 940 మంది స్త్రీలు ఉన్నారు. ఇందులో ఆరు సంవత్సరాల లోపు వయసు కలిగిన బాలికలు ప్రతి వెయ్యి మంది బాలురకు 914 మంది మాత్రమే ఉన్నారు.

బాల్యవివాహాలు

దేశంలో 26.5శాతం బలవంతపు బాల్య వివాహాలు జరుగుతున్నాయి.ప్రపంచములో జరుగుతున్న 40 శాతం బాల్యవివాహాలు మన దేశములో జరుగుతున్నాయని "యూనిసెఫ వెల్లడించింది . మన దేశములో 40 శాతం బలవంతపు బాల్య వివాహాలు పశ్చిమబెంగాల్లో చోటుచేసుకోవడంగమనార్హం.

భ్రూణహత్యాలు

ఆడపిల్లను మైనస్ గా భావించి మగ శిశువును ప్లస్ గా పరిగణించే మానసిక స్థితి సమాజంలో నెలకొనడం వల్ల పుట్టుకతోనే ఆడపిల్లల భ్రూణహత్యాలకు బలై వివక్షతకుగురిఅవుతున్నారు

పేదరికం.అల్పపౌష్టికాహారం

బాలికలకు ఉన్నత విద్య సమస్యగా మారింది. నేటికీ 40 శాతం పైగా బాలికలు పదవ తరగతి కంటే ముందే బడి మానేస్తున్నారు బడి మానుకొని గ్రామాలలో వ్యవసాయ రంగంలో అసంఘటిత ప్రైవేట్ రంగంలో బాలకార్మికులుగా అబశ్రీశ్రీపనిచేస్తున్నారు. శ్రమ దోపిడీకి 'లైంగిక వివక్షతకు భిక్షాటనకు గురవుతూ తమ అమూల్యమైన బాల్య దశను పేదరికం' ఆకలిచావులు అల్ప పౌష్ఠికాహారం' అనారోగ్యానికి గురౌతున్నారని అనేక అధ్యయనాలల్లో తేలింది.

బాలికల సంరక్షణ చర్యలు

ప్రభుత్వం బాలికల సమగ్ర వికాసానికి సంరక్షణకు అవసరమయ్యే విధానాలను అమలు చేయాలి.

బాలికల భద్రత '' లింగ నిష్పత్తి 'విద్య 'వైద్యం ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి. బాలికలకు బాలురతో పాటు సమాన అవకాశాలు సమాన హక్కులు' స్వేచ్ఛ కల్పించాలి .

.బాలికల అభివృద్ధియే లక్ష్యంగా జాతీయ విద్యా విధానంలో పలు పథకాలు ప్రవేశపెట్టడం బాలికలకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించడం సమాన విద్యావకాశాల సాధనకు" ప్రతేక నిధిని" కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం అభినందనీయమైన చర్య. బాలికల హక్కుల రక్షణ భద్రత పౌరసమాజం సామాజిక బాధ్యతగా గుర్తించాలి. ఆడపిల్లలను మగపిల్లలతో పోటీ పడేట్లు ప్రోత్సహించాలి .అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పించాలి . ఆడపిల్లల అభివృద్ధి దేశాభివృద్ధిగా భావించాలి. దేశ ప్రగతి పురోగతిలో ఆడపిల్లలు మానవ వనరులుగా ఎదగడానికి ప్రభుత్వం కృషి చేయాలి. బడుగు బలహీన వర్గాల్లో బాలికలకు ఉచిత విద్య వైద్యం అందించాలి. సమాజంలో మహిళాల పట్ల గౌరవంఆర్థికస్థాయి.సామాజిక హోదా పెంచాలి.

బాలికల సంరక్షణ ప్రభుత్వం

బాల్య వివాహాలు బాలికల అక్రమ రవాణా' అత్యాచారాలు' లైంగిక వివక్ష మొదలగు సమస్యల నుండి ఆడ పిల్లలను సంరక్షించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి .పౌరసమాజం యువజన సంస్థలు మహిళా స్వచ్ఛంద సంస్థలు సంఘాలు ఆడపిల్లల సంరక్షణ హక్కుల రక్షణకు పాటుపడాలి .

బాలికలు డిజిటల్ విద్య

ప్రభుత్వం బాలికలకు కంప్యూటర్ విధ్య డిజిటల్ విద్య టెక్నాలజీ ఆధునాతన సాంకేతిక ఉన్నత విద్య ఉపాధి దోహక విద్యను ఉచితంగా అందుబాటులోకి తేవాలి . బాలికలకు వృత్తి నైపుణ్య విద్యను అందించాలి . బాలికల సామాజిక ఆర్థిక స్థాయి పెంచే పథకాలను అమలు చేయాలి

మహిళా రిజర్వేషన్స్

కేంద్ర రాష్ట్ర 'ప్రభుత్వ 'ప్రైవేట్ రంగ ఉద్యోగ నియామకాల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి. ప్రభుత్వం మహిళా బిల్లును ప్రవేశ పెట్టి రాజకీయాలలో స్త్రీల వాటా పెంచాలి. మహిళలను పారిశ్రామిక వేత్తలుగ ఎదిగేట్లు వాతావరణం కల్పించాలి.

మహిళా సాధికారిత

ప్రభుత్వం మహిళా సాధికారిత సాధనకు ఉద్యమించాలి. శాస్త్ర సాంకేతిక 'పారిశ్రామిక 'వ్యవసాయ వ్యాపార 'వాణిజ్య 'రాజకీయ రంగాలలో మహిళా వికాసానికి ప్రభుత్వం పెద్ద పీట వెయ్యాలి .బాలికల కొరకు ప్రత్యేక పాఠశాలలు కళాశాలలు ఏర్పాటు చేసి ఇంటర్మీడియేట్ వరకు ఉచిత వొకేషనల్ విద్య అందించాలి.

ఆడపిల్లలను పుట్టనిద్దాం బతుకనిద్దాం చదువనిద్దాం ఎధుగనిద్దాం అన్న నినాదం విధానమైనప్పుడే బాలికల దినోత్సవం ఆశయాలు నెరవేరుతాయి . స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు. స్త్రీ లేకపోతే అసలు సృష్టి లేదు. అందువల్ల ఆడపిల్లలను రక్షించుదాం. అమ్మాయిలను ఆదరిద్దాం. బాలికల భవితకు బంగారు బాటలు వేద్దాం .

నేదునూరి కనకయ్యఅధ్యక్షులు

తెలంగాణ ఎకనామిక్ ఫోరంసామాజిక ఆర్థిక అధ్యయన వేదిక9440245771

# బుర్గంపాడు హాస్పిటల్ లో మొట్టమొదటి సిజేరియన్

**-జిల్లాలోని అన్ని హాస్పిటల్స్ లో ప్రసూతి సేవలు,**

**-నలుమూలల ప్రసూతి సేవలు అందిస్తున్న జిల్లా టీవీవీపీ అధికారులు**

**-ఆసుపత్రి పురోగతిపై హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే పాయం, జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ , డీసీ హెచ్ ఎస్ డా.రవి బాబు, స్థానిక ప్రజలు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, జనవరి 17 (భారతశక్తి): బూర్గంపాడు మండల కేంద్రంలో గల ఆసుపత్రిలోని వైద్యులు శనివారం మొట్టమొదటి సీజేరియన్ (పెద్దాపెరేషన్) చేసి చరిత్ర సృష్టించారు. సారపాక కి చెందిన బానోత్ మమత అనే 26 ఏళ్ల మహిళకి మొదటి కాన్పు సీజేరియన్ కాగా రెండో కాన్పు కోసం బూర్గంపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవశీ కోసం చేరగా పరీక్షించిన ప్రసూతి వైద్యురాలు డా అనూష లక్ష్మి నేడు సిజేరియన్ ఆపరేషన్ చేసి పండంటి 3 కేజీల మగబిడ్డకు పురుడుపోసారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు. గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గా ఉన్న ఆసుపత్రిని 2022 లో వైద్య విధాన పరిషత్ లోకి 30 పడకల ఆసుపత్రి గా మార్చారు. కాకపోతే 30 పడకల కి సరిపడా భవనం, మౌలిక సదుపాయాలు మంజూరు కాలేదు. స్థానిక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు సూచన మేరకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా చొరవ చూపి ఆసుపత్రికి కావలసిన మౌలిక సదుపాయాలు, ఆపరేషన్ థియేటర్ కి అవసరమైన పనిముట్లు సమకూర్చారు. జిల్లా ఆసుపత్రుల ప్రధాన సమన్వయ అధికారి డాక్టర్ రవి బాబు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గతం లో ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులను, ఇటీవలే ఒక ప్రసూతి వైద్యురాలిని నియమించారు. అలాగే 24 గంటల వైద్య సదుపాయాలు, రక్త పరీక్షల యంత్రాలు, డెంటల్ పరికరాలు ఏర్పాటు చేశారు. వైద్యులు అందుబాటులో ఉండడంతో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. సుమారు రెండు కోట్ల డీఎంఎఫ్టీ నిధులతో నూతన ఆసుపత్రి భవంతి ని ఆరునెలల క్రితం స్థానిక ఎమ్మెల్యే ప్రారంభించగా నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆసుపత్రికి లో మొట్టమొదటి సీజేరియన్ ఆపరేషన్ జరగడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి -ఆసుపత్రి సూపరింటెండెంట్ డా ముక్కంటేశ్వరావు

గత సంవత్సరం నుండి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు విజయవంతంగా జరుగు తున్నాయని, ఇప్పుడు పెద్దపరేషన్ చేయడం వల్ల పరిసర గ్రామాల ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ అవుతున్నాయని, సేవలు మెరుగు పరచడానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ప్రత్యేకంగా దృష్టి పెట్టారని, డీసీఎచ్ఎస్ రవి బాబు నిరంతర పర్యవేక్షణ లో అన్ని విధాలుగా ఆసుపత్రి ని అభివృద్ధి చేస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా ముక్కంటేశ్వరావు తెలిపారు.

సేవలు మరింత విస్తృతం చేస్తాశీ -డీసీ ఎచ్ ఎస్ రవి బాబు

ఇటీవలే రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చర్ల, జిల్లాలో ఇతర వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల పనితీరును రాష్ట్ర సచివాలయం లో సమీక్షించి వైద్య సిబ్బందిని జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులలో అందిస్తున్న వైద్య సేవలను ప్రత్యేకంగా అభినందించారనీ, ఏ జిల్లాలో లేని విధంగా ఈ ఆపరేషన్ తో జిల్లాలో లోని ఉన్న ఏడు వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో సైతం ఆపరేషన్ థియేటర్ సేవలు, ప్రసూతి సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చినట్టు అయిందని డీసీ ఎచ్ ఎస్ రవి బాబు తెలిపారు. త్వరలోనే బూర్గంపాడు లో డయాలిసిస్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని అతి త్వరలోనే నూతన ఆసుపత్రి భవంతి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. బుర్గంపాడు ప్రజలు సిజేరియన్ ఆపరేషన్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఇక లేదని ఆయన చెప్పారు. ఈ సిజేరియన్ విజయవంతం కావడంతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎంపీ బలరాం నాయక్, టీవీవీపీ రాష్ట్ర కమీషనర్ డా అజయ్ కుమార్ , జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ , డిసిహెచ్ఎస్ డా రవి బాబు సిబ్బందిని అభినందించారు. ఈ ఆపరేషన్ లో ఆసుపత్రి సూపరింటెండెంట్ పిల్లల వైద్య నిపుణులు డా ముక్కంటేశ్వరావు, ప్రసూతి వైద్యురాలు అనూష లక్ష్మి, మత్తు డాక్టర్ డా రామ్ ప్రసాద్,నర్సింగ్ ఆఫీసర్ రేవతి, కరుణశ్రీ, పద్మ, జ్యోతి, నర్సింహా , కవిత ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఉమ్మడి నల్లగొండ జిల్లా గడ్డపై సింహం గుర్తు జెండా ఎగురవేస్తాం: పరంగి రాము

**-ప్రధాన పార్టీలకు ముచ్చెమటలు పట్టిస్తున్న సింహం గుర్తు**


**-బీ-ఫామ్ ఆశించి భంగపడిన వారికి అవకాశం కల్పిస్తున్న సింహం గుర్తు**

**-నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధన లక్ష్యంగా వస్తున్న ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్**

మిర్యాలగూడ, జనవరి 17(భారత శక్తి: రానున్న మున్సిపల్ ఎన్నికలలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సింహం గుర్తు జెండాను ఎగురవేస్తాం అని ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ. తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జి. పరంగి రాము అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఎంతోమంది రాజకీయ నాయకులకు రాజకీయ పునర్జన్మ ఇచ్చిందని గత మున్సిపల్, నగరపాలక కార్పొరేట్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల 23 మంది కార్పొరేటర్లు గా 136 మంది కౌన్సిలర్లు గా గెలుపొందారు అన్నారు. నల్లగొండ జిల్లా లోని నకిరేకల్ మున్సిపాలిటీలో 14 మంది పోటీ చేసి 6 గెలవడం జరిగిందని మరియు చిట్యాల లో 6 పోటీ చేసి 2 గెలవడం జరిగిందని ఈ పలుచోట్ల స్వల్ప తేడాతో ఓడిపోవడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఉ కార్పొరేషన్ ఎన్నికల హడావుడి జరుగుతున్నా క్రమంలో అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీలకు సంబంధించిన టికెట్ ఆశించి రాని వారు ఇప్పటికే మా ఙా×ఖీదీ పార్టీని సంప్రదించి బీ-ఫామ్ ల కోసం ఎదురు చూస్తున్నారని ఈసారి ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ప్రస్తుతం ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని 18 మున్సిపాలిటీలు మరియు 1 కార్పొరేషన్ లకు సంబందించిన 427 వార్డులకు గాను సుమారు 100 నుండి 150 స్థానాలలో పోటీ చేయడానికి కార్యాచరణ సిద్ధంచేసి ప్రభంజనాన్ని సృష్టిస్తుందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన పార్టీలకు సింహం గుర్తు ముచ్చెమటలు పట్టిస్తుందని అదే తరహాలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ప్రధాన భూమిక పోషిస్తుందని ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితులలో దేశ పునర్నిర్మాణం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆలోచన విధానం దేశానికి చాలా అవసరమని యువత విద్యావంతులు ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందన్నారు. దేశం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఏ విధంగా పనిచేశారో నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అదే తరహాలో ప్రజల కోసం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తుంది అని అన్నారు.




ఈ కార్యక్రమంలో పార్టీ అనుబంధ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ బాబా విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు యువజన విభాగం జిల్లా నాయకులు. మరుపాక నాగరాజు, భాస్కర్, సుధాకర్, మధు తదితరులు పాల్గొన్నారు.



## వచ్చే సంక్రాంతికి మళ్లీ వస్తా!

''నారీ నారీ నడుమ మురారి'తో చెప్పి మరీ హిట్టు కొట్టాన'ని కథానాయకుడు శర్వానంద్ అన్నారు. ఈ కథ విన్న తొలిరోజు నుంచే ఇది తనకెంతో నమ్మకాన్ని కలిగించిందని.. ఈ సినిమా ఎప్పుడు విడుదల చేసినా తప్పకుండా బ్లాక్‌బస్టర్ అవుతుందని ముందే ఊహించానని.. ఇప్పుడా నమ్మకం నిజమైనందుకు ఆనందంగా ఉందని తెలిపారు. శర్వా హీరోగా నటించిన ఈ సినిమాని రామ్ అబ్బరాజు తెరకెక్కించారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. సంయుక్తా మేనన్, సాక్షి వైద్య కథానాయికలు. నరేశ్, సంపత్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. నిర్మాత దిల్‌రాజు, దర్శకుడు శ్రీను వైట్ల అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో శర్వానంద్ మాట్లాడుతూ.. ''ఇది నాకు చాలా ఎమోషనల్ మూమెంట్. హిట్ కొడతానని చెప్పి మరీ కొట్టాను. సంక్రాంతికి రావాలన్న నా కల నెరవేర్చినందుకు నిర్మాత అనిల్‌కు ధన్యవాదాలు. నేను చాలా రోజులుగా హిట్ కోసం ఎదురు చూస్తున్నా. నాకు ఆ హిట్ ఇచ్చిన దర్శకుడు రామ్ అబ్బరాజుకు కృతజ్ఞతలు. తనలాంటి దర్శకులు ఇండస్ట్రీకి కావాలి. తాను నాకు కథ ఎంత బాగా చెప్పాడో.. అంతకంటే అద్భుతంగా తెరపైకి తీసుకొచ్చాడు. ఈ చిత్రానికి మరో హీరో నరేశ్. మా నాన్న పాత్ర పోషించారు. సినిమా చూసిన వాళ్లంతా 'చాలా రోజుల తర్వాత ఇంతలా నవ్వుకున్నామ'ని చెప్తుంటే ఆనందంగా అనిపించింది. నేనెప్పుడు సంక్రాంతికి వచ్చినా అన్ని సినిమాలు ఆడతాయి. అందుకే ఇకపై ప్రతి సంక్రాంతికి నాకోసం ఒక స్లాట్ పక్కన పెట్టండి (నవ్వుతూ). వచ్చే సంక్రాంతికి మళ్లీ వస్తా. శ్రీను వైట్ల దర్శకత్వంలో మైత్రీ మూవీస్ నిర్మించనున్న నా తదుపరి సినిమా పండక్కే వస్తుంది'' అన్నారు. ''ఇది మంచి సినిమా. పండగ చివర్లో రావడం వల్ల ఎక్కువ థియేటర్లు ఇవ్వలేకపోయాం. కానీ, వచ్చే వారం నుంచి స్క్రీన్స్ పెరగబోతున్నాయి. ఇది చాలా పెద్ద హిట్ కొట్టబోతుంది'' అన్నారు నిర్మాత దిల్‌రాజు. ఈ కార్యక్రమంలో రామ్ అబ్బరాజు, అనిల్ సుంకర, సంయుక్త తదితరులు పాల్గొన్నారు.

## ప్రేక్షకులు ఆగకుండా నవ్వుతున్నారు!



''వినోదంతో పాటు మంచి భావోద్వేగాలు నిండిన సినిమా 'అనగనగా ఒక రాజు'. ప్రేక్షకులు దీంట్లోని వినోదాన్ని ఎంతలా ఆస్వాదిస్తున్నారో.. ఎమోషనల్ సీన్లకు అదే స్థాయిలో చప్పట్ల వర్షం కురిపిస్తున్నారు'' అన్నారు హీరో నవీన్ పొలిశెట్టి. ఆయన.. మీనాక్షి చౌదరి జంటగా నటించిన ఈ సినిమాని మారి తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రం ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ ''నాకు రాజ్‌కుమార్ హిరాణీ సినిమాలంటే చాలా ఇష్టం. తెలుగులో అలాంటి చిత్రం చేయాలనే ఉద్దేశంతో ఈ ప్రయత్నం చేశాం. దీన్ని శ్రీరాములు లాంటి మాస్ థియేటర్లో చూశాను. ఇందులోని కామెడీని.. ఎమోషన్‌ను అందరూ ఆస్వాదిస్తున్నారు. ఫస్టాఫ్ తొలి సీన్ నుంచి ఇంటర్వెల్ వరకు ఆగకుండా నవ్వుతున్నారు. ద్వితీయార్ధంలోని పొలిటికల్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. మా కథ అన్ని వర్గాల ప్రేక్షకులకు చేరువైందని అర్థమైంది. ఈ సంక్రాంతికి పెద్ద సినిమాలు పోటీలో ఉన్నప్పటికీ మా చిత్రాన్ని బ్లాక్‌బస్టర్ చేసిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. నా వెనకున్న శక్తి ప్రేక్షకులే. నా చిత్రాల్ని మోసేది వాళ్లే. అందుకే వాళ్లని అలరించడానికి నా శక్తికి మించి కృషి చేస్తా'' అన్నారు. ''2020లో విడుదలైన 'అల వైకుంఠపురములో' సినిమా తర్వాత ఆ స్థాయిలో తృప్తినిచ్చిన సంక్రాంతి ఇది. త్రివిక్రమ్ ఈ చిత్రం తొలిసారి చూసినప్పుడే బాగుందని చెప్పారు. అది నాకెంతో ధైర్యాన్నిచ్చింది. రెండు పెద్ద సినిమాలు విడుదలైనప్పటికీ మా డిస్ట్రిబ్యూటర్లు మాకు తగినన్ని థియేటర్లు కేటాయించి అండగా నిలిచారు. అందుకే రెండు రోజుల్లోనే రూ.41కోట్ల గ్రాస్ రాబట్టగలిగాం'' అన్నారు నిర్మాత సూర్యదేవర నాగవంశీ. ఈ కార్యక్రమంలో మారి, మీనాక్షి చౌదరి, మిక్కీ జే మేయర్, రావు రమేశ్, చిన్మయి తదితరులు పాల్గొన్నారు.



# సినిమా


## జక్కన్న తర్వాతి స్థానం



టాలీవుడ్‌లో అపజయం ఎరుగని దర్శకుడిగా గుర్తింపు సంపాదించుకున్న అనిల్ రావిపూడి ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాడు. వరుసగా తొమ్మిది విజయాలు నమోదు చేసి ట్రిపుల్ హ్యాట్రిక్ సాధించిన దర్శకుడిగా రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. మన శంకర వరప్రసాద్ గారు సినిమాకు వచ్చిన పాజిటివ్ టాక్‌తో పాటు బాక్సాఫీస్ వద్ద కనిపిస్తున్న నిలకడైన వసూళ్లు ఆయన మార్కెట్‌ను మరింత పెంచేశాయి. ఈ సినిమాతో ఆయనపై నిర్మాతల నమ్మకం రెట్టింపైంది. తాజా సమాచారం ప్రకారం ఆయన తన తదుపరి సినిమా కోసం టాలీవుడ్‌కు చెందిన నాలుగు అగ్ర నిర్మాణ సంస్థలు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. ఒక్క సినిమాకు రూ.50 కోట్ల వరకు రెమ్యునరేషన్ ఇవ్వడమే కాకుండా.. లాభాల్లో వాటా కూడా ఇచ్చేందుకు నిర్మాతలు సిద్ధంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది. ఇదే నిజమైతే టాలీవుడ్‌లో అత్యధిక రెమ్యునరేషన్ తీసుకునే దర్శకుల జాబితాలో ఎస్.ఎస్. రాజమౌళి తర్వాతి స్థానాన్ని ఆయన కైవసం చేసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం సుకుమార్, త్రివిక్రమ్ శ్రీనివాస్, ప్రశాంత్ నీల్ వంటి స్టార్ డైరెక్టర్లు కూడా భారీ పారితోషికాలు తీసుకుంటున్నప్పటికీ వరుస విజయాల పరంపర, మినిమం గ్యారెంటీ ఎంటర్‌టైన్‌మెంట్ అనిల్‌ను ఈ రేంజ్‌కు తీసుకొచ్చిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఫిబ్రవరి 14న ధనుష్, మృణాల్ పెళ్లి?

సౌత్ స్టార్ ధనుష్, బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ డేటింగ్ లో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆ వార్తలు మరింత ఊపందుకున్నాయి. వాలెంటైన్స్ డే అయిన ఫిబ్రవరి 14న ఇద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారంటూ కొన్ని మీడియా కథనాలు ప్రచారం అవుతున్నాయి. సన్నిహితులు, కుటుంబ సభ్యుల మధ్య ప్రైవేట్ కార్యక్రమంగా వివాహం జరగనుందన్నది ఆ కథనాల సారాంశం. దీనిపై ధనుష్ గానీ, మృణాల్ ఠాకూర్ గానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. 'సన్ ఆఫ్ సర్దార్ 2' సినిమా స్క్రీనింగ్‌కు ధనుష్ హాజరుకావడం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారి తీసింది. ఆ సందర్భంగా వివరణ ఇచ్చిన మృణాల్, ఆ ఈవెంట్‌కు ధనుష్‌ను ఆహ్వానించింది అజయ్ దేవగన్ అని, ఎవరూ అపార్థం చేసుకోవద్దని స్పష్టం చేసింది. ఒక ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ, ధనుష్ తనకు మంచి స్నేహితుడు మాత్రమేనని కూడా చెప్పింది. అంతకుముందు ధనుష్ నటిస్తున్న 'తేరే ఇష్క్ మే' సినిమా ర్యాప్ పార్టీకి మృణాల్ హాజరుకావడం, వివిధ ఈవెంట్లలో ఇద్దరి మధ్య జరిగిన ఇంటరాక్షన్ వీడియోలు వైరల్ కావడం ఈ రూమర్స్‌కు మరింత బలం చేకూర్చాయి. ఇక ధనుష్ విషయానికి వస్తే, సూపర్ స్టార్ రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య రజనీకాంత్‌తో 18 ఏళ్ల వివాహ బంధానికి 2022లో ముగింపు పలికారు. వారికి లింగా, యాత్ర అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రస్తుతం ధనుష్ వ్యక్తిగత జీవితంపై వస్తున్న ఈ వార్తలు ఎంతవరకు నిజమో, లేదో అన్నది వారి స్పందన వస్తే గానీ తేలాల్సి ఉంది.








## ఆ వీడియోలకు నో సర్టిఫికెట్

యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం టాక్సిక్. యశ్ పాత్రను పరిచయం చేస్తూ ఇటీవల ఓ గ్లింప్స్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే అందులో ఇంటిమేట్ సన్నివేశాలు ఎక్కువగా ఉండడంతో విమర్శలొచ్చాయి. దీనిపై కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలు ఫిర్యాదు చేశారు. దీంతో మహిళా కమిషన్ రంగంలోకి దిగి.. ఈ వివాదంపై తగిన చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలంటూ సెన్సార్ బోర్డుకు లేఖ రాసింది. రోజు రోజుకు ముదురుతున్న ఈ టీజర్ వివాదంపై తాజాగా సెన్సార్ బోర్డు ఛైర్మన్ ప్రసూన్ జోషి స్పందించారు. యూట్యూబ్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో చూసే వీడియోలకు సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఉండదని, అవి తమ పరిధిలోకి రావని స్పష్టం చేశారు. ఓటీటీ కంటెంట్ కూడా సెన్సార్ పొందిందనే భావన సరికాదన్నారు.

## బాలీవుడ్‌పై రెహమాన్ కామెంట్స్.. స్పందించిన ప్రముఖులు



బాలీవుడ్ గురించి ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ వ్యక్తం చేసిన అభిప్రాయంపై దుమారం రేగుతోంది. దీనిపై ప్రముఖులు స్పందిస్తున్నారు. 'అవి డేంజరస్ కామెంట్స్' అని రచయిత్రి శోభా డే మండిపడగా.. రెహమాన్ ఇలాంటి స్టేట్‌మెంట్ ఇవ్వడాన్ని తాను నమ్మలేకపోతున్నానని, ఆయన వ్యాఖ్యలను కొందరు అపార్థం చేసుకొని ఉండొచ్చని ప్రముఖ స్క్రీన్ రైటర్ జావేద్ అక్తర్ అన్నారు. ''రెహమాన్‌కు బాలీవుడ్‌లో వర్క్ లేకపోవడానికి కారణం మతం కాదు. ముంబయిలో నాకు తెలిసిన చాలామందికి రెహమాన్‌పై గౌరవం ఉంది. అంతర్జాతీయ ప్రాజెక్టులతో ఆయన బిజీగా ఉంటున్నారని, విదేశాల్లో ఆయన నిర్వహించే ప్రోగ్రామ్స్ ఎక్కువ సమయం తీసుకుంటున్నాయని, అందుకే తమ ప్రాజెక్టులకు ఆయన అందుబాటులో ఉండరేమో అని ఇక్కడ మేకర్స్ అనుకోవచ్చు. పైగా తొలి నుంచి రెహమాన్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్. అందుకే చిన్న నిర్మాతలు ఆయన్ను సంప్రదించలేకపోవచ్చు. కమ్యూనిటీ కారణంగానే ఆయనకు అవకాశాలు తగ్గుతున్నాయనే దాన్ని నేను నమ్మను'' అని జావేద్ పేర్కొన్నారు. ఇదే అంశంపై సింగర్ షాన్ మాట్లాడుతూ.. ''ఇక్కడ మతపరమైన కోణం ఉందని నేను అనుకోవడం లేదు. ఒకవేళ అదే కారణమైతే.. కొందరు హీరోలు ఇప్పుడు స్టార్ హీరోలుగా ఉండేవారు కాదు కదా'' అని అభిప్రాయపడ్డారు.

### రెహమాన్ ఏమన్నారు?

రెహమాన్ ఇటీవల ఓ మీడియా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో 'బాలీవుడ్‌లో తమిళ్ లేదా మహారాష్ట్రేతరులపై పక్షపాతం ఉంటుందా?' అని ప్రశ్నించగా.. వ్యక్తిగతంగా తానెప్పుడూ ఎలాంటి వివక్షను ఎదుర్కొలేదని తెలిపారు. ''ఎనిమిదేళ్లుగా ఇండస్ట్రీలో 'పవర్ షిఫ్ట్' నెలకొంది. సృజనాత్మకత లేని వారే కీలకంగా వ్యవహరిస్తున్నారు. దీనికి మతపరమైన అంశం ఓ కారణమై ఉండొచ్చు. అది నాకు నేరుగా ఎదురుకాలేదు గానీ.. గుసగుసలు వినిపించాయి.




# అచ్చంగా బంగారమే!

అనంత్ – రాధికల వివాహ వేడుకలో అంబానీ కుటుంబ సభ్యులు ధరించిన నగలు, దుస్తుల గురించి చర్చోపచర్చలు జరిగాయి. అయితే, ఆ వేడుకలో పెండ్లి కొడుకు అనంత్ అంబానీ ధరించిన దుస్తులు కూడా చాలా ప్రత్యేకమైనవని తెలుసా. ఆయన వేసుకున్న జాకెట్ మీద బంగారు రంగులో డిజైన్ ఉంది. అది కేవలం బంగారు రంగు కాదు.. అచ్చంగా బంగారమే. బంగారంతో ఆ డిజైన్ పెయింట్ చేశారట. ఆ విశేషాలేంటో చూద్దాం.



అంబానీలు ధరించే ప్రతి డిజైనర్ వేర్‌లో కచ్చితంగా ఎంబ్రాయిడరీ ఉంటుంది. అదీ కూడా భారత పురాత సంప్రదాయ ఎంబ్రాయిడరీ మెళుకువలే ఎక్కువగా ఉండటం విశేషం. అనంత్ తన వివాహ వేడుకలో మనీష్ మల్హోత్రా డిజైనర్ వేర్ బాంధీ జాకెట్‌ని ధరించాడు. దీనిపై చేతితో ఎంబ్రాయిడరీ చేసిన డిజైన్ ఉంటుంది. దీన్ని బంగారంతోనే చేశారు. రాజస్థాన్‌లోని నాథద్వారా ఆలయానికి సంబంధించిన పిచ్వాయ్ పెయింటింగ్ ఆధారంగా రూపొందించారు. ఇది కృష్ణుడి జీవితంలోని ఇతివృత్తాలను వర్ణిస్తుంది. ఇందులో తామరలు, చెట్లు, ఆవులు, నెమళ్లు వంటివి ఉంటాయి. ముగ్గురు భిల్వారా కళాకారులచే 600 గంటలకు పైగా కష్టపడి రూపొందించారు. దీనిపై సుమారు 100 రియల్ బంగారు ఆకులను వాడారు.

# యోగా చేసిన తర్వాత.. బెస్ట్ ఫుడ్ ఇదే

యోగా చేసిన తర్వాత ఏ ఫుడ్ తింటే బెస్ట్ అనే విషయం తెలుసా? రోజూ తినే బ్రెడ్ మంచిదే కదా అంటారా.. కానీ అది బెస్ట్ బ్రేక్ ఫాస్ట్ కాదట. అందులో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉంటాయట. దాంతో రక్తంలో గ్లూకోజ్ లెవల్స్ పెరిగిపోతాయి. కాబట్టి దానికి బదులు ఏం తింటే బెటర్ అంటే.. ఇవిగో ఈ ఫుడ్స్ అన్నీ మంచివే.

ఉదయాన్నే ఇడ్లీ, దోశ, పూరీ, పొంగల్ ఇది ప్రతి ఇంట్లో ఉండే బ్రేక్ ఫాస్ట్ మెనూ. ఇందులో ఎక్కువగా కార్బోహైడ్రేట్స్ ఉంటాయి. అవి రక్తంలో గ్లూకోజ్ స్థాయిని పెంచుతాయి. కాబట్టి, వాటికి బదులు శనగలతో చేసిన దోశను తినడం ఉత్తమం. దాంతో పాటు కూరగాయలు కూడా తీసుకోవచ్చు.





యోగా చేసిన తర్వాత తీసుకోవాల్సిన బెస్ట్ ఫుడ్‌లో వెజిటేబుల్ సూప్ ఒకటి. అనేక కూరగాయలతో తయారు చేసిన సూప్ తీసుకోవడం మంచిది. ఇందులో విటమిన్స్, ఫైబర్స్, ఖనిజాలు ఉంటాయి. ఇవన్నీ శరీరానికి పూర్తి శక్తిని ఇస్తుంది.



వర్కౌట్ తర్వాత ఉదయాన్నే మొలకెత్తిన ధాన్యాలు తీసుకోవాలి. ఇందులో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది. దీంతో పాటు ఉల్లిపాయ, దోసకాయ, క్యారెట్ వంటి కూరగాయల్ని సలాడ్‌లా తీసుకోవచ్చు.

ప్రోటీన్స్ ఎక్కువగా ఉండే ఫుడ్ పనీర్. దీన్ని ఉదయాన్నే తీసుకుంటే మంచిది. పనీర్‌తో ఎక్కువగా కూరగాయల్ని కలిపి తీసుకోవడం వల్ల అదనపు పోషకాలు అందుతాయి.





ఉదయం, సాయంత్రం యోగాసనాలు చేసిన తర్వాత సలాడ్ కూడా మంచిది. ఇందులో కూరగాయలు, ప్రోటీన్స్ ఉండేలా చూసుకోండి. ఎగ్ పాలకూర సలాడ్, చిక్‌పీ సలాడ్, దోసకాయ క్యారెట్ నట్స్, పనీర్ వంటి సలాడ్స్ తీసుకోవచ్చు.

ఓట్స్... యోగా తర్వాత తినొచ్చు. ఓట్స్‌లో నట్స్, సీడ్స్, ఫ్రూట్స్ కూడా కలిపి తీసుకోవడం వల్ల ఫైబర్, విటమిన్స్ అందుతాయి.

# అందం కోసం అమ్మ సలహా

పాలలా తెలుపు రంగులో ముట్టుకుంటే కందిపోయే అందం ఆమె సొంతం. కళ్లు తిప్పుకోనివ్వని అందంతో కట్టిపడేస్తుంది మిల్కీ బ్యూటీ తమన్నా. మరి అందాల తార సౌందర్య రహస్యమేంటో తెలుసుకుందామా..



**రోజూ.. మంచి నీళ్లలో నిమ్మ రసం, దాల్చిన చెక్క పొడి కలిపి తాగుతుంది. ఈ డ్రింక్ కాలేయాన్ని శుభ్రపరుస్తుంది. అంతేకాకుండా పేగుల ఆరోగ్యాన్ని కూడా మేలు చేస్తుంది. బరువు తగ్గడంలోనూ సాయపడుతుంది. స్వీట్స్ ఇష్టపడే తమన్నా ఎప్పుడైనా ఎక్కువగా లాగించేస్తే మర్నాడు అదనంగా వ్యాయామం చేస్తుంది.. దాంతో కేలరీలు బర్న్ అవుతాయి. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది అని నమ్మే తమన్నా అందం, ఆత్మవిశ్వాసం ఆమె ముఖంలో ప్రతిబింబిస్తుంది.**

### అమ్మ సలహా..

ఫెయిర్‌నెస్ క్రీమ్‌ను ఉపయోగించకూడదని తమన్నాకు వాళ్లమ్మ సలహా ఇచ్చిందట. అందుకే ఆమె ఎప్పుడూ ఫెయిర్‌నెస్ క్రీమ్‌ను వాడనని చెప్పింది. దాని బదులు ఇంట్లో తయారుచేసిన ఫేస్ ప్యాక్‌లను వాడడానికి ఇష్టపడుతుంది. షూటింగ్ అయిపోయిన తర్వాత శనగపిండి, పసుపు, వేప ఆకుల మిశ్రమాన్ని ఫేషియల్ లేదా స్క్రబ్‌గా ఉపయోగిస్తుంది. చర్మం గ్లో కోసం చందనం ఫేస్ ప్యాక్‌ను అప్లై చేస్తుంది. క్రమం తప్పకుండా హెర్బల్ స్క్రబ్‌ని వాడుతుంది. ఇది చర్మం ఆరోగ్యంగా కనిపించేలా చేస్తుంది.

### మేకప్ కు దూరం..

**షూటింగ్ లేని రోజుల్లో మేకప్‌కు దూరంగా ఉంటుంది తమన్నా. తరచుగా చర్మాన్ని చల్లటి నీటితో కడుక్కుంటుంది. చర్మాన్ని తేమగా ఉంచడానికి సహజమైన కలబంద జెల్‌ను ముఖంపై అప్లై చేస్తుంది.**

### ఫిట్‌నెస్ తప్పనిసరి



ప్రతిరోజు కనీసం ఒక గంట పాటు వ్యాయామం చేస్తుంది. ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నా వ్యాయామం చేయడం అస్సలు మానదు. ఒత్తిడిని తగ్గించుకోవడానికి, మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడానికి రోజూ యోగా చేస్తుంది. ప్రతిరోజు కొన్ని నిమిషాలు ధ్యానం చేస్తుంది. వ్యాయామ దినచర్యలో కొంత మార్పు కోసం కొన్నిసార్లు డ్యాన్స్, ఏరోబిక్స్ చేస్తుంది. రోజు ఏడు గంటలు నిద్రపోతుంది. సమయానికి నిద్రపోవడానికి మొగ్గుచూపుతుంది.

### జుట్టుకోసం..



మార్కెట్‌లో దొరికే షాంపూకు బదులు షికాకాయ్, బొప్పాయి, ఉసిరికాయ వంటి వాటితో ఇంట్లోనే తయారుచేసిన హెర్బల్ పౌడర్ వాడుతుంది. ప్రతిరోజు ఆమె తల స్నానం చేయడానికి ఇష్టపడుతుంది. కొబ్బరి నూనెతో తలకు మర్దన చేస్తుంది.

### నిద్ర లేచాక..

ఉదయం నిద్రలేవగానే 2-3 గ్లాసుల నీరు తాగుతుంది. ప్రతిరోజు ఉదయం, ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో తేనె, నిమ్మరసం కలిపి తాగుతుంది. నానబెట్టిన బాదంపప్పులను ఉదయం తింటుంది. ఇది శరీరంలో మంటను తగ్గిస్తుంది.

### రోజంతా కొబ్బరి నీరు



**రోజంతా కొబ్బరి నీరు, తాజా పండ్ల రసాలను తాగుతుంది. ప్రతి 2-3 గంటలకు ఒకసారి తినడానికి ఇష్టపడుతుంది. అల్పాహారం కోసం ఓట్ మీల్, ఇడ్లీ లేదా దోసను చట్నీ, సాంబార్‌తో తింటుంది. మధ్యాహ్న భోజనంలో, 1 కప్పు ఉడికించిన అన్నం, 1 కప్పు పప్పు, కూరగాయలు తీసుకుంటుంది. రాత్రి భోజనం కోసం తన జీవక్రియను పెంచడానికి ప్రోటీన్-రిచ్ ఫుడ్ తినడానికి ఇష్టపడుతుంది. సాధారణంగా గుడ్డులోని తెల్లసొన లేదా కాల్చిన చేపలు తినడానికి ఇష్టపడుతుంది. నిద్రపోవడానికి 2-3 గంటల ముందు రాత్రి భోజనం పూర్తి చేస్తుంది. ఆహారంలో నట్స్, ఫ్లెక్స్ సీడ్స్, చియా సీడ్స్, గుమ్మడికాయ గింజలు, ఫిష్ లివర్ ఆయిల్, ఆలివ్ ఆయిల్ ఉపయోగిస్తుంది. ఇది రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి సహాయపడుతుంది. పెరుగును ప్రతి భోజనంలో తీసుకుంటుంది. ఇదిశరీరాన్ని చల్లగా ఉంచుతుంది. రోజూ పొద్దున్నే1 టేబుల్ స్పూన్ నెయ్యి, కాఫీ పౌడర్ లను వేడి నీటిలో కలిపి తాగుతుంది. ఇది శరీరంలో పేరుకున్న కొవ్వును దూరం చేస్తుంది.**

# మల్కాజ్‌గిరి కమీషనరేట్ పరిధిలో చైన్ స్నాచింగ్స్



ఎల్బీనగర్, జనవరి 17 (భారత శక్తి ): చాలా రోజుల తరువాత మళ్ళీ విజృంభిస్తున్న గొలుసు దొంగలు. మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలో ఒక అర్ధగంటలోపే రెండు స్టేషన్ల పరిధిలో గొలుసు దొంగలు ఇద్దరి మహిళల మెడలో నుండి సుమారుగా 4 తులాల బంగారు పుస్తెల తాళ్లు తెంపుకొని, ఒక వృద్ధ మహిళపై దాడి చేసి, గొలుసు తెంపుకోలేక పారిపోయారు. ఈ విధంగా మళ్ళీ గొలుసు దొంగలు విజృంభించారు. నాగోలు, చైతన్యపురి పోలీస్ స్టేషన్ల సీఐలు మహ్మద్ మక్బుల్ జాని, సైదులు తెలిపిన వివరాల ప్రకారం..ఉదయం 10గంటల 07 నిమిషాలకు నాగోలు డివిజన్ బ్లైండ్ కాలనీ నివాసురాలు మారగోని మణెమ్మ (58)తన పెద్ద కొడుకు ఇంటికి నడుచుకుంటూ వెళుతుండగా, గుర్తు తెలియని ఇద్దరు యువకులు మోటర్ సైకిల్ పై వస్తూ వెనుక నుండి ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడు లాక్కొని, నిందితులు రాజ్యలక్ష్మి కాలనీ నుండి నాగోల్ మెయిన్ రోడ్డు వైపు పారిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా గొలుసు దొంగలు చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని రామకృష్ణ పురం కాలనీ రోడ్ నెంబర్ 2లో 10గంటల 21నిమిషాలకు ఆదిలక్ష్మి (40) అనే మహిళ గుడికి వెళ్లి తిరిగి ఇంటికి వెళుతున్న ఆమె మెడలో ఉన్న 1.5 తుల బంగారు గొలుసు ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్ మీద వచ్చి తెంపుకొని పారిపోయారు. అదేవిధంగా న్యూ మారుతీ నగర్ కమ్యూనిటీ హాల్ ఎదురుగా 10 గంటల 31నిమిషాలకు పద్మ అనే 72 ఏండ్ల ముదుసలి నడుచుకుంటూ వెళుతుండగా వెనుకనుండి వచ్చి బంగారు గొలుసు తెంపే ప్రయత్నం చేయగా, ఆమె భయంతో అరిచింది, ఆ అరుపులకు భయపడి గొలుసు దొంగలు పారిపోయినట్లు పోలీసులు తెలిపారు.రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో 24 నిమిషాల వ్యవధిలో 4 తులాల బంగారు గొలుసులు తెంపుకొని పోయిన స్నాచర్స్ ను పట్టుకోవడానికి ఎల్బీనగర్, చైతన్యపురి, నాగోల్ పోలీసులు పలు టీములుగా ఏర్పడి నేరస్థుల కోసం గాలింపు చర్యలు చేపట్టారని ఇద్దరు సీఐలు తెలిపారు.




జాతీయ భద్రతా దినోత్సవ మాసం సందర్భంగా ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ సీఐ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ ప్రోగ్రాం సందర్భంగా అమితాభ ఆధారణ విద్యాలయ (అనాథ హోమ్) విద్యార్థులతో, రోడ్ సేఫ్టీ, ప్రమాదాల నివారణపై అవగాహన గురించి వ్యాస రచన పోటీలు నిర్వహించడం జరిగింది.

**ఎల్బీనగర్, జనవరి 17 (భారత శక్తి):**

# కమ్యూనిస్టుల ఐక్యత అవశ్యం

- * **కమ్యూనిజం అజరామరం**
- * **పోరాట పంథా మార్పు అనివార్యం**
- * **యువత ఓ చట్రంలో బిగుసుకు పోవటం సరైంది కాదు**
- * **కార్మిక, కర్షక ఫలాలు కమ్యూనిస్టుల పోరాట ఫలితమే..!**
- * **ప్రజల్లో చైతన్యం కోసం కమ్యూనిస్టులుగా కృషి**
- * **శతాబ్ది ఉత్సవాలు ఓ చారిత్రక ఘట్టం**
- * **సీఎం దృష్టికి జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య**
- * **సీపీఐ శతాబ్ది ఉత్సవాలు ఖమ్మంలో జరపటం చరిత్రాత్మక ఘట్టం**
- * **టీడబ్ల్యూజేఎఫ్ 'మీట్ ద ప్రెస్'లో కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**




ఖమ్మం బ్యూరో, భారత శక్తి, జనవరి 17: కమ్యూనిస్టుల ఐక్యత అవశ్యమని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. కమ్యూనిజం అజరామరమని పేర్కొన్నారు. ప్రజల్లో మరింత చైతన్యం కోసం కమ్యూనిస్టులుగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలు ఖమ్మం వేదికగా జరుపుకోవడం చారిత్రక ఘట్టమని స్పష్టం చేశారు. యువత ఓ చట్రంలో బిగుసుకు పోవడం సరైంది కాదని తెలిపారు. ప్రస్తుతం మనం అనుభవిస్తున్న కార్మిక, కర్షక ఫలాలు కమ్యూనిస్టుల పోరాట ఫలితమేనన్నారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని, శాసనసభలోనూ ఈ అంశంపై పోరాడుతానని కూనంనేని హామీ ఇచ్చారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన 'మీట్ ద ప్రెస్' కార్యక్రమంలో భాగంగా జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు సాంబశివరావు సమాధానమిచ్చారు.

*** జర్నలిస్టులు పంజరంలో చిలుకలు**

జర్నలిస్టులు పంజరంలో చిలికల లాంటి వారని కూనంనేని అభివర్ణించారు. వార్తలు రాసే విషయంలో జర్నలిస్టులు అనేక ఒత్తిడులకు లోబడి పనిచేయాల్సి వస్తోందన్నారు. జర్నలిస్టుల్లో అనేక మంది దుర్భర జీవితాలు అనుభవిస్తున్న దృష్ట్యా వారిని ఆదుకోవాల్సిన అవసరం పాలకులపై ఉందన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలకు హాజరవుతున్న ముఖ్యమంత్రి దృష్టికి ఖమ్మం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను తీసుకువెళ్తానని, శాసనసభలోనూ ఈ అంశాన్ని ప్రస్తావిస్తానని తెలిపారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్లకు సంబంధించిన జీవో నెంబర్ 252 సవరింపు అంశాన్ని ప్రెస్ అకాడమీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమేనని, కార్మిక కర్షకులు ప్రస్తుతం అనుభవిస్తున్న అనేక ఫలాలు కమ్యూనిస్టుల పోరాట ఫలితమే అన్నారు.

*** సంపదను దోచుకునేవారు దేశభక్తులు**

అటవీ సంపదను, ప్రజల శ్రమను దోచుకునేవారు దేశభక్తులుగా చెలామణి అవుతున్నారని, హక్కుల కోసం పోరాటాలు చేసేవారిని దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని కూనంనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాటాలు చేసేవారిని అణచివేసేవారు చట్టసభల్లో ఉన్నారని అంతిమంగా నేర ప్రవృత్తి కలిగినవారు, దోపిడీ చేసేవారు, డబ్బులు సంపాదించుకునేవారు దేశభక్తులుగా సమాజంలో స్థానం సంపాదించుకుంటున్నారని ధ్వజమెత్తారు. కాళోజీ చెప్పినట్లు ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక లాగా.. ఒక్క కమ్యూనిస్టు లక్షల కోట్ల మెదళ్లకు మేథ అన్నారు. కమ్యూనిస్టుల విధానాలు, సిద్ధాంతాలు, త్యాగాలు ఇంకా ప్రజల్లోకి వెళ్లాలన్నారు.

*** కమ్యూనిస్టుల ఐక్యతే అభిమతం**

ఎన్నికల్లో పొత్తులు, ఎత్తులు ఎలా ఉన్నా... బూర్జువా పార్టీలతో స్నేహం చేయాల్సి వచ్చినా అవి ఎలక్షన్ల వరకు మాత్రమేనని, కమ్యూనిస్టుల ఐక్యతే తమ అభిమతమని కూనంనేని స్పష్టం చేశారు. మనుషులన్నంత కాలం కమ్యూనిజం ఉంటుందని చెప్పారు. అనేక దేశాల్లో ఎర్రజెండాలు ఏకమై రాజ్యాధికారాన్ని సొంతం చేసుకున్నాయనే విషయాన్ని గుర్తు చేశారు. కమ్యూనిస్టుల ఐక్యత ప్రజల కోరిక అన్నారు. దేశానికి, సమాజానికి అవసరమని అభిప్రాయపడ్డారు. బూర్జువా పార్టీలతో సందర్భోచితంగా కలవడం అనివార్యమని పేర్కొన్నారు. ఎన్నికల ఎత్తుగడలో భాగంగానే ఆయా పార్టీలతో కలిసి పనిచేయడం జరుగుతుందని, పొత్తు పెట్టుకున్నా ఆశించిన స్థానాలు దక్కకపోవడంతో నిరాశ తప్పడం లేదన్నారు. ప్రస్తుతం మహాత్మాగాంధీ ఎన్నికల్లో పోటీ చేసినా నెగ్గుకు రాలేని స్థితి ఉందన్నారు. ప్రభుత్వానికి మిత్రపక్షంగా ఉన్నా అప్రజాస్వామిక పోకడలను ఎప్పటికప్పుడూ ఎత్తిచూపుతూనే ఉన్నామన్నారు. తెలంగాణ వచ్చాక కనీసం నిరసన తెలిపే అవకాశం కూడా లేకుండా పోయిందన్నారు.

*** సీపీఐ శతాబ్ది ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు: బాగం హేమంతరావు**

సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో భారీ ఏర్పాట్లు చేశామని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. భారీ బహిరంగ సభతో పాటు ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. సభకు రెండు రాష్ట్రాల కామ్రేడ్స్ తో పాటు ఇతర దేశాలకు చెందిన ప్రతినిధులు కూడా హాజరవుతున్నారని చెప్పారు. అన్ని రాష్ట్రాల్లో శతాబ్ది ఉత్సవాలు జరుపుకున్నామని, ముగింపు వేడుకలు మాత్రం ఖమ్మంలో జరుపుతున్నామని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ చేసిన త్యాగాలు, ఉద్యమాలు ప్రజలకు వివరించి ముందుకు సాగనున్నామన్నారు. ఈ సభలో సీఎం రేవంత్ రెడ్డి సౌహార్ధ సందేశం ఇస్తారని వెల్లడించారు.

*** వేడుకల్లో పాలుపంచుకోవడం సంతోషంగా ఉంది: దండి సురేశ్**

శతాబ్ది ఉత్సవాల్లో ఖమ్మం జిల్లా కార్యదర్శిగా తాను పాలుపంచుకోవడం సంతోషంగా ఉందని, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక బద్దంగా ఏర్పాటు చేసుకుని ముందుకుసాగుతామని ఖమ్మం జిల్లా సీపీఐ కార్యదర్శి దండి సురేశ్ అన్నారు. ఉద్యమాలకు ఊపిర్లూదిన ఖమ్మంలో ఈ వేడుక నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ ప్రతిష్టను మరింత పెంచుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు దువ్వా సాగర్, సహాయ కార్యదర్శి కూరాకుల గోపీ, టీబీజేఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవికిరణ్, ఖమ్మం నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు తురగ రాజేంద్రమూర్తి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాధవ్, నూకల రామచంద్రమూర్తి, స్టేట్, జిల్లా కమిటీ, నియోజకవర్గ కమిటీ నాయకులు నాగేందర్ రెడ్డి, మధుశ్రీ , జానీపాష, భారతి , ఫయాజ్ , భూక్యా గణేశ్ , అర్షద్ , యూసుఫ్ , జాకీర్ , వడ్డె గణేశ్ , వడ్డే పృథ్వి, కొత్త యాకేశ్ , మహేశ్ , సతీష్ , రమేశ్ , పత్తి శ్రీను , వినయ్ , ధనాల రవి , హరీష్, సీవీఆర్ రవి , గోపి , బ్రహ్మం, షకీల్ , మురళీరెడ్డి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా

వైఎస్సార్ కడప జిల్లా, జనవరి 17(భారత శక్తి): వై ఎస్ ఆర్ కడప జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన డా. నిధి మీనా శనివారం సాయంత్రం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి వారిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు.ఈ సందర్భంగా ఆయన జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.



# యువతను క్రీడల వైపు ప్రోత్సహించడమే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పునాది

భూపాలపల్లి జిల్లా (భారత శక్తి ప్రతినిధి )జనవరి 17: యువతను క్రీడల వైపు ప్రోత్సహించడమే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పునాది అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జంగేడు క్రికెట్ అసోసియేషన్ వారి ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని క్రికెట్ ఆడారు. అనంతరం కేకు కోసి పలువురు క్రీడాకారులకు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...క్రికెట్ వంటి క్రీడలు యువతలో క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయన్నారు. క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జంగేడు క్రికెట్ అసోసియేషన్ సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు.

# భూపాలపల్లి మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యం

- **మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే జీఎస్సార్..**

భూపాలపల్లి జిల్లా( భారత శక్తి ప్రతినిధి జనవరి17): భూపాలపల్లి మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈరోజు(శనివారం) భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వేశాలపల్లి, పెద్దకుంటపల్లి, జంగేడు లో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ తో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మున్సిపాలిటీ ల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. రోడ్ల విస్తరణ, సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యాలు, కమ్యూనిటీ హాల్స్ తదితర



పనులు ఈ అభివృద్ధి కార్యక్రమాలలో భాగమని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో నిర్లక్ష్యానికి గురైన భూపాలపల్లి ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రతి రూపాయి ప్రజల సంక్షేమానికే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా అధికారులకు సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రజలు కూడా సహకరించి అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

- * **వేశాలపల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీలో కొత్త రేషన్ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే...**

మున్సిపాలిటీ పరిధిలోని వేశాలపల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన రేషన్ షాపును ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు.అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై ఎమ్మెల్యే మాట్లాడారు.పేదలు, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా, సమర్థవంతంగా చేరాలన్నదే ప్రజా ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు.రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువులు సులభంగా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు.ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా రేషన్ సరుకులు పొందేందుకు అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ చేస్తోందని,సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు.

# రేపు దావోస్‌కు సీఎం చంద్రబాబు... నాలుగు రోజుల పాటు ఫుల్ బిజీ!

అమరావతి, జనవరి 17(భారత శక్తి): ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు (జనవరి 18) స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో పర్యటించేందుకు సిద్ధమయ్యారు. ప్రపంచ ఆర్థిక సదస్సు (వరల్డ్ ఎకనామిక్ ఫోరం)లో పాల్గొనేందుకు ఆయన మంత్రులు, ఉన్నతాధికారుల బృందంతో కలిసి ఆదివారం బయల్దేరి వెళ్లనున్నారు. జనవరి 19 నుంచి 22 వరకు నాలుగు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో ఆయన అత్యంత బిజీగా గడపనున్నారు. మొత్తం 36 కార్యక్రమాల్లో పాల్గొంటూ, ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామిక దిగ్గజాలతో ముఖాముఖి సమావేశాలు జరపనున్నారు. ఆదివారం రాత్రి 8:35 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి, అక్కడి నుంచి జ్యూరిచ్‌కు ముఖ్యమంత్రి పయనం కానున్నారు. జనవరి 19న ఉదయం జ్యూరిచ్ చేరుకున్నాక, స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్ ఆయనతో మర్యాదపూర్వకంగా సమావేశమవుతారు. అనంతరం ఎరోస్ ఇన్నోవేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ కిశోర్ లుల్లా, ఆయన బృందంతో భేటీ అవుతారు. పర్యటనలో తొలి ముఖ్య కార్యక్రమంగా, జ్యూరిచ్‌లోని హిల్టన్ హోటల్‌లో భారత ఎంబసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'తెలుగు డయాస్పోరా' సదస్సులో చంద్రబాబు పాల్గొంటారు. సుమారు 20 దేశాల నుంచి హాజరయ్యే ప్రవాస తెలుగువారిని (ఎన్నార్టీలు) ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో దావోస్ చేరుకుంటారు. దావోస్‌లో తొలిరోజు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఆర్థిక, పర్యాటక శాఖల మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో జరిగే అంతర్జాతీయ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి ముఖ్యమంత్రితో సమావేశమవుతారు. సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ కూడా సీఎంతో భేటీ కానున్నారు. ప్రముఖ విదేశీ మీడియా సంస్థ 'పొలిటికో'కు చంద్రబాబు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వనున్నారు.

**టెక్ దిగ్గజాలతో కీలక చర్చలు**

పర్యటనలో రెండో రోజు అత్యంత కీలకంగా జరగనుంది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నిర్వహించే 'ఇండియా ఎట్ సెంటర్: జియోగ్రఫీ, గ్రోత్ ఏపీ అడ్వాంటేజ్' అనే బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌లో ముఖ్యమంత్రి పాల్గొని రాష్ట్రంలోని అవకాశాలను వివరిస్తారు. అనంతరం భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఇండియా లాంజ్'ను ప్రారంభిస్తారు. ఆ తర్వాత టెక్నాలజీ రంగంలో ప్రపంచ దిగ్గజ సంస్థలైన ఐబీఎం ఛైర్మన్, సీఈఓ అరవింద్ కృష్ణ, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్‌లతో చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ భేటీ అవుతారు. ఈ సమావేశాల్లో రాష్ట్రానికి టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు (AI) రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. అదే రోజు ఇజ్రాయెల్ ఆర్థిక, పారిశ్రామిక మంత్రి నిర్ బర్కత్‌తో, స్విట్జర్లాండ్ ఆర్థిక వ్యవహారాల డిప్యూటీ మంత్రి హెలెన్ బడ్లిజెర్ అర్టెడాతోనూ చర్చలు జరుపుతారు. ఎన్విడియా ఉపాధ్యక్షుడు కాలిస్టా రెడ్‌మండ్‌తో పాటు, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్‌తోనూ సమావేశమవుతారు. రాష్ట్రంలో పోర్టులు, లాజిస్టిక్స్ రంగాల అభివృద్ధికి అత్యంత కీలకమైన అంతర్జాతీయ కంటైనర్ లాజిస్టిక్స్ సంస్థ ఏపీ మోలర్‌మేర్స్క్ సీఈఓ విన్సెంట్ క్లెర్క్‌తో ముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్ ముఖాముఖి సమావేశం కానున్నారు.

*** వివిధ అంశాలపై చర్చా వేదికల్లో ప్రసంగాలు**

మూడో రోజు పర్యటనలో భాగంగా, 'హీలింగ్ ప్లానెట్ త్రో రీజెనరేటివ్ ఫుడ్ సిస్టమ్స్' అనే అంశంపై జరిగే చర్చా కార్యక్రమంలో, బ్లూమ్‌బెర్గ్ సంస్థ నిర్వహించే 'ట్రిలియన్స్ ఆఫ్ డాలర్స్: ఏఐ మూమెంట్ ట్రాన్స్‌ఫార్మింగ్ గ్లోబల్ ఎకానమీ' సెషన్‌లో ముఖ్య వక్తగా ప్రసంగిస్తారు. పారిశ్రామిక పురోగతి, వాతావరణ మార్పులపై ఫైనాన్సింగ్ వంటి అంశాలపై జరిగే పలు సెషన్లలో కూడా ఆయన పాల్గొంటారు. ఏపీ లాంజ్‌లో కేంద్ర మంత్రులతో కలిసి 'బిల్డింగ్ ఇండియా ఇన్ఫ్రాస్ట్రక్చర్' కార్యక్రమంలో పాలుపంచుకుంటారు. మొత్తంగా ఈ నాలుగు రోజుల పర్యటనలో 3 ప్రభుత్వాల మధ్య సమావేశాలు, 16 మంది పారిశ్రామికవేత్తలతో వన్‌టువన్ భేటీలు, 9 రౌండ్ టేబుల్ సమావేశాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. సీఎన్‌బీసీ ఇంటర్నేషనల్ వంటి అంతర్జాతీయ మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పటంలో ఒక కీలక పెట్టుబడుల గమ్యస్థానంగా నిలపడమే లక్ష్యంగా ఆయన పర్యటన సాగనుంది. ఇక జనవరి 22న దావోస్ నుంచి బయల్దేరి, 23వ తేదీ ఉదయం 8:25 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హైదరాబాద్ చేరుకుంటారు.

## యాడ్స్ విషయంలో కీలక నిర్ణయం తీసుకున్న చాట్‌జీపీటీ

జనవరి 17(భారత శక్తి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచంలో సంచలనం సృష్టించిన చాట్‌జీపీటీ ఇకపై ప్రకటనల బాట పట్టబోతోంది. ఓపెన్ ఏఐ విలువ 500 బిలియన్ డాలర్లకు పెరిగినప్పటికీ భారీగా పెరుగుతున్న నిర్వహణ ఖర్చులను ఎదుర్కొనేందుకు వచ్చే కొన్ని వారాల్లో చాట్‌జీపీటీలో అడ్వర్టైజ్‌మెంట్లను పరీక్షించనున్నట్లు ఓపెన్‌ఏఐ ప్రకటించింది. మొదట అమెరికాలో ఫ్రీ, తక్కువ స్థాయి సబ్‌స్క్రిప్షన్ వినియోగదారులకు మాత్రమే ఈ ప్రకటనలు కనిపించనున్నాయి. అయితే ప్రో, ఎంటర్‌ప్రైజ్ యూజర్లకు మాత్రం యథావిధిగా యాడ్స్ ఉండవని సంస్థ స్పష్టం చేసింది. దాదాపు బిలియన్ మంది వినియోగదారులు ఉన్నప్పటికీ, చాలా తక్కువ మంది మాత్రమే చెల్లింపు సేవలు వినియోగిస్తుండటంతో కొత్త ఆదాయ మార్గాల అవసరం ఏర్పడింది. శక్తిమంతమైన కంప్యూటింగ్ వ్యవస్థల కోసం భారీగా ఖర్చవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రకటనలు చాట్‌జీపీటీ సమాధానాలను ప్రభావితం చేయవని, యూజర్ల వ్యక్తిగత డేటా ప్రకటనదారులకు అందుబాటులో ఉండదని ఓపెన్‌ఏఐ హామీ ఇచ్చింది. యూజర్ నమ్మకం, అనుభవమే తమకు మొదటి ప్రాధాన్యమని సంస్థ మరోసారి స్పష్టం చేసింది.

## కాకినాడలో ఏఎమ్ గ్రీన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కాకినాడ, జనవరి 17(భారత శక్తి): ఆంధ్రప్రదేశ్‌ను 'గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ'గా తీర్చిదిద్దడమే లక్ష్యమని, పర్యావరణహిత ఇంధన ఉత్పత్తిలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలుపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కాకినాడలో సుమారు రూ.18 వేల కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న 'ఏఎమ్ గ్రీన్ అమ్మోనియా' ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు రాష్ట్ర భవిష్యత్తుకు ఒక 'గేమ్ ఛేంజర్'గా నిలవనుందని, ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా పరిశ్రమగా ఇది చరిత్ర సృష్టించనుందని అన్నారు. భవిష్యత్తు మొత్తం గ్రీన్ ఎనర్జీదేనని, ఈ క్రమంలో గ్రీన్ అమ్మోనియా కీలక పాత్ర పోషించనుందని చంద్రబాబు వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా హరిత ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నారని గుర్తుచేశారు. "2014లోనే మా ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీకి నాంది పలికింది. ఇప్పుడు గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాతో మరో ముందడుగు వేస్తున్నాం. 2027 జూన్ నాటికి ఈ ప్రాజెక్టు మొదటి దశ ఉత్పత్తి ప్రారంభమవుతుంది" అని ఆయన ప్రకటించారు. బొగ్గు వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని, కాలుష్యం కారణంగా సముద్ర జీవావరణంలో పెను మార్పులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న సహజ వనరులు గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ఎంతో అనుకూలమని ముఖ్యమంత్రి తెలిపారు. వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీరం, రానున్న 20 పోర్టులు, రాష్ట్రంలో పుష్కలంగా లభించే సౌర, పవన విద్యుత్ వనరులు మనకు వరమని పేర్కొన్నారు. సాంస్కృతిక విలువలను కాపాడుకుంటూనే, ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఎంత ఎత్తుకు ఎదిగినా సొంత ఊరిని మర్చిపోకూడదని హితవు పలికారు. గొప్ప ఆలోచనలను ఆచరణలో పెట్టేవారు అరుదుగా ఉంటారని, అలాంటి వారిలో పారిశ్రామికవేత్త చలమలశెట్టి అనిల్ ఒకరని ప్రశంసించారు. గతంలో ఎన్టీఆర్ చొరవతోనే కాకినాడకు నాగార్జున ఫెర్టిలైజర్స్ పరిశ్రమ వచ్చిందని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో ఈ గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుతో కాకినాడ పేరు ప్రపంచవ్యాప్తంగా మారుమోగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే ఏ నిర్ణయాన్నైనా తక్షణమే అమలు చేస్తుందని స్పష్టం చేశారు. "2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా చూడాలన్నదే నా ఆకాంక్ష. గ్రీన్ అమ్మోనియా వల్ల వ్యవసాయ రంగానికి ఎంతో మేలు జరుగుతుంది. ప్రకృతి సేద్యం పెరగడమే మనందరి ఆరోగ్యానికి శ్రీరామరక్ష" అని అన్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలని రైతులకు పిలుపునిచ్చారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే గ్రీన్ అమ్మోనియాను ఏ దేశానికైనా ఎగుమతి చేసే వీలుంటుందని, ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గొప్ప బలాన్ని ఇస్తుందని వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, కాకినాడ ప్రాంతం ఒక కీలక పారిశ్రామిక, హరిత ఇంధన కేంద్రంగా అభివృద్ధి చెందనుంది.

## 25 ఏళ్లు కష్టపడి చదివితే 75 ఏళ్ల వరకు గౌరవంగా జీవించవచ్చు

హైదరాబాద్, జనవరి 17(భారత శక్తి): 25 ఏళ్లు కష్టపడి చదివితే 75 ఏళ్ల వరకు గౌరవంగా జీవించవచ్చని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, చిట్టబోయినపల్లి ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలి ప్రధానమంత్రి నెహ్రూ సాగునీటి ప్రాజెక్టులు, విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం కూడా వాటికే ప్రాధాన్యతనిస్తుందని స్పష్టం చేశారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులే నేటికీ జీవనాధారంగా నిలుస్తున్నాయని అన్నారు. భూగరిష్ఠ పరిమితి చట్టం తీసుకురావడం ద్వారా కాంగ్రెస్ దొరల వద్ద ఉన్న లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిందని గుర్తు చేశారు. విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని గుర్తించాలని సూచించారు. నిబద్ధత లేని చదువు వల్ల ప్రయోజనం ఉండదని అన్నారు.

## చరిత్ర తిరగరాయటం తెలుగువాళ్లతోనే సాధ్యం

అమరావతి, జనవరి 17(భారత శక్తి): చరిత్రను తిరగరాయడం తెలుగువాళ్లకే సాధ్యమని, ప్రపంచ గతిని మార్చే శక్తిసామర్థ్యాలు మనవారికి ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ సత్తాను చాటేలా, ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు కాకినాడ వేదిక కావడం తెలుగువారందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. గ్రీన్‌కో అనుబంధ సంస్థ ఏఎమ్ గ్రీన్ ఆధ్వర్యంలో కాకినాడలో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి చంద్రబాబు ఇవాళ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుతో ఇకపై ప్రపంచం మొత్తం కాకినాడ వైపు చూస్తుందని, భవిష్యత్ ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించనుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "గతంలో ఇదే ప్రాంతంలో నాగార్జునా ఫెర్టిలైజర్స్ గ్రే అమోనియా తయారు చేస్తే, ఇప్పుడు అదే చోట పర్యావరణహితమైన గ్రీన్ అమోనియా ఉత్పత్తి కాబోతోంది. ఇది మార్పునకు సంకేతం. చరిత్రను తిరగరాయడం అంటే ఇదే. తెలుగువాళ్లు తలచుకుంటే ఏదైనా సాధించగలరు. గత ఏడాది ఈ ప్రాజెక్టుకు అనుమతిస్తే, సరిగ్గా ఏడాది తిరిగేసరికి పనులు ప్రారంభించడం మన పనితీరుకు నిదర్శనం. ఇది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు చక్కటి ఉదాహరణ" అని అన్నారు. 495 ఎకరాల్లో, 2 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారని వెల్లడించారు. 2027 జూన్ నాటికి ఉత్పత్తి ప్రారంభించి, ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమోనియాను ఇక్కడి నుంచి జర్మనీ వంటి దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశించిన 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యాన్ని అందిపుచ్చుకుని, రాష్ట్రంలో 160 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేశామని చంద్రబాబు తెలిపారు. "సౌర, పవన, జల విద్యుత్‌తో పాటు పంప్డ్ స్టోరేజీకి ఏపీ అత్యంత అనుకూలమైన రాష్ట్రం. మనకున్న సుదీర్ఘ తీరప్రాంతం, రాబోయే 20 పోర్టులతో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా ఉత్పత్తికి ఏపీ కేంద్రంగా మారుతుంది. భవిష్యత్తులో గ్రీన్ ఎనర్జీపై ఎక్కడ చర్చ వచ్చినా కాకినాడ పేరు వినిపిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 'క్లీన్, గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ పాలసీ2024' దేశంలోనే అత్యుత్తమమైనదని, పారిశ్రామికవేత్తలకు పూర్తి స్వేచ్ఛనిస్తూ, ఒక్క నిమిషం కూడా ఆలస్యం చేయకుండా అనుమతులు మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, "విశాఖలో గూగుల్ సంస్థ 1గిగావాట్ సామర్థ్యంతో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఈ ఏడాదిలోనే అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయి. స్పేస్ టెక్నాలజీలో కూడా పురోగతి సాధిస్తాం. ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్ ఎకానమీ హబ్‌గా తీర్చిదిద్దుతాం" అని ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో పరిశ్రమలపై విద్యుత్ కొనుగోలు భారాన్ని యూనిట్‌కు రూ.1.19 మేర తగ్గించేందుకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే 29 పైసలు తగ్గించామని తెలిపారు. గ్లోబల్ సంస్థలన్నీ ఏపీ నుంచి తమ కార్యకలాపాలు నిర్వహించాలని పిలుపునిచ్చిన ఆయన, రాష్ట్రంలోకి వచ్చే ప్రతి పెట్టుబడికి ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

## బీహార్‌లో గెలిచాం.. బెంగాల్‌కు సమయం ఆసన్నమైంది

బీహార్, జనవరి 17(భారత శక్తి): బీహార్‌లో ఎన్డీయే విజయం సాధించిందని, ఇక పశ్చిమ బెంగాల్‌కు సమయం ఆసన్నమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. బెంగాల్ పర్యటనలో భాగంగా మాల్దాలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మమతా బెనర్జీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను మమతా బెనర్జీ ప్రభుత్వం కొల్లగొడుతోందని మోదీ ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి హింస, బుజ్జగింపు రాజకీయాలు కావాలని ఆయన విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. రాష్ట్రానికి అసలైన సవాల్ చొరబాటుదారులేనని మోదీ పేర్కొన్నారు. చొరబాట్లను అరికట్టడంలో తృణమూల్ ప్రభుత్వం విఫలమైందని ఆయన దుయ్యబట్టారు. మాల్దా, ముర్షిదాబాద్ వంటి ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగడానికి చొరబాట్లే కారణమని ఆయన ఆరోపించారు. బెంగాల్ రాష్ట్రానికి వరద సహాయ నిధులను కేంద్రం 40 సార్లు అందించినా, ఆ నిధులు అసలైన లబ్ధిదారులకు చేరలేదని ప్రధానమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే బీజేపీ ప్రభుత్వం ఇక్కడ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తున్నారని ఆయన అన్నారు.

## చైనా స్కూలులో నోరో వైరస్ కలకలం.. వంద మందికి పైగా సోకిన వైరస్

చైనా, జనవరి 17 : చైనాలోని ఓ స్కూలులో వైరస్ కలకలం రేగింది. వంద మందికి పైగా విద్యార్థులు అనారోగ్యానికి గురికావడంతో వైద్యాధికారులు రంగంలోకి దిగి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 103 మంది విద్యార్థులకు 'నోరా వైరస్' సోకినట్లు తేలింది. దీంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం.. క్లాస్ రూమ్ లతో పాటు స్కూలు ఆవరణలో వైరస్ ను నాశనం చేసే మందును చల్లారు. వైరస్ బాధిత విద్యార్థులకు చికిత్స అందజేస్తూనే మిగతా విద్యార్థులకు వైరస్ సోకకుండా చర్యలు చేపట్టారు. బాధిత విద్యార్థులు అందరూ కోలుకుంటున్నారని వివరించారు. రోజూ విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షిస్తూ ప్రత్యేక హాజరు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్కూలు పరిసరాల్లోని నివాస సముదాయాల్లో ఉంటున్న వారికి వైరస్ పరీక్షలు చేపట్టినట్లు వివరించారు. గ్వాంగ్ డాంగ్ ప్రావిన్స్ డిసీజ్ కంట్రోల్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏటా అక్టోబర్ నుంచి మార్చి మధ్య ప్రావిన్స్ లో నోరో వైరస్ విజృంభిస్తుందని అధికారులు తెలిపారు. వైరస్ బాధితులు ప్రధానంగా వాంతులు, విరేచనాలతో బాధపడుతుంటారని చెప్పారు. ఈ వైరస్ సాధారణమైందేనని, వైరస్ వ్యాప్తి చాలా వేగంగా ఉంటుందని వివరించారు. ఈ వైరస్ ను తొలిసారి 1968 లో అమెరికాలోని ఓహియో రాష్ట్రం నార్ వాక్ లోని ఓ స్కూలులో గుర్తించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈ వైరస్ ను నోరో వైరస్ గా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. అమెరికాలో ఎక్కువగా ఆహారం ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుందని చెప్పారు. ఏటా ప్రపంచవ్యాప్తంగా 68.5 కోట్ల మంది ఈ వైరస్ బారిన పడుతుండగా.. అందులో 20 కోట్ల మంది ఐదేళ్లలోపు చిన్నారులేనని గణాంకాలు చెబుతున్నాయి. ఈ వైరస్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 50వేల మంది చిన్నారులు సహా 20 లక్షల మంది మృత్యువాత పడుతున్నారని సమాచారం.

## భారత్, పాకిస్థాన్‌లతో సంబంధాలపై అమెరికా రిపబ్లికన్ పార్టీ నేత కీలక వ్యాఖ్యలు

అమెరికా, జనవరి 17(భారత శక్తి): భారత్, పాకిస్థాన్‌లతో అమెరికా సంబంధాలపై ఆ దేశ కాంగ్రెస్ సభ్యుడు, రిపబ్లికన్ పార్టీ నేత రిచ్ మెక్‌కార్మిక్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా.. పాకిస్థాన్‌తో కంటే భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని ఆయన సూచించారు. అమెరికాకు పెట్టుబడులను తీసుకొచ్చేది భారత్ తప్ప పాకిస్థాన్ కాదనే విషయాన్ని గుర్తించాలని అన్నారు. ప్రతిభావంతులైన నిపుణులను, ఉద్యోగులను భారత్ అమెరికాకు పంపిస్తోందని ఆయన పేర్కొన్నారు. అమెరికా అభివృద్ధిలో భారతదేశం, అక్కడి నిపుణులు, ఉద్యోగుల పాత్ర ఎంతో ఉందని ఆయన వ్యాఖ్యానించారు. భారత్‌కు చెందిన కంపెనీలు అమెరికాలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తాయని అన్నారు. భారత్‌ను అమెరికా దూరం చేసుకోకూడదని, ఒకవేళ అదే జరిగితే అమెరికాకే నష్టమని ఆయన పేర్కొన్నారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికను భారత్ లెక్కచేయడం లేదని, ఇది అధ్యక్షుడి ఆగ్రహానికి కారణమైందని ఆయన అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేయవద్దని ట్రంప్ హెచ్చరించినప్పటికీ భారత్ మాత్రం కొనుగోళ్లను ఆపడం లేదని గుర్తు చేశారు. ఇది నచ్చని ట్రంప్, భారత్ పట్ల కఠిన వైఖరిని అవలంభిస్తున్నారని వ్యాఖ్యానించారు. కానీ భారతదేశం ప్రయోజనాల గురించి ఆలోచించిన ప్రధాని నరేంద్ర మోదీ ఎవరి మాటను లెక్క చేయకుండా రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తున్నారని తెలిపారు.

## ఎన్‌కౌంటర్‌లో కోటి రూపాయల రివార్డ్ ఉన్న మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు మృతి

ఛత్తీస్గఢ్, జనవరి 17(భారత శక్తి): మావోయిస్టు పార్టీకి మరో కీలక ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు హతమయ్యారు. వీరిలో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, మోస్ట్ వాంటెడ్ నేత పాపారావు అలియాస్ మోంగు ఉన్నాడు. దక్షిణ బస్తర్ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలకు వ్యూహకర్తగా పాపారావు వ్యవహరిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లలో సీనియర్ నేతలు మృతి చెందిన తర్వాత మిగిలిన టాప్ లీడర్లలో ఒకరిగా పాపారావు కొనసాగుతున్నాడు. పాపారావు కదలికలపై సమాచారం అందడంతో ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా దళాలు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో పాపారావుతో పాటు మరో మావోయిస్టు మరణించాడు. పాపారావుపై కోటి రూపాయల వరకు రివార్డు ఉంది. ఘటన స్థలంలో ఏకే రైఫిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గతేడాది ఈ అడవుల్లోనే తప్పించుకున్న పాపారావు, ఇప్పుడు అదే ప్రాంతంలో మృతి చెందడం గమనార్హం.


# ఆదివాసిల కుంభ మేళ...!!

### * సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దం నాగోబా జాతర

ఆదిలాబాద్ జిల్లా,భారత శక్తి ప్రతినిధి, జనవరి 17: భారత దేశంలో ఆదివాసి జా తరలలో అతిపెద్ద రెండోజాతర, తెలంగాణలో ఆదివాసులు రెండో పెద్ద జాతర.ఆదివాసి రాజ్ గోండ్ తెగవారి యొక్క ఆరాధ్య దైవంనాగోబా. ఈ జాతర కేస్లాపూర్ గ్రామం, ఇం ద్రవెల్లిమండలం, అదిలాబాద్ జిల్లాలో ప్రతి సంవత్సరం పుష్య మాసంలో జరుగుతుంది. ఈ జాతరకి తెలంగాణ,ఆంధ్ర ప్రదేశ్, ఛత్తీస్గడ్, మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్వివిధ రా ష్ట్రాల నుండి ఆదివాసి భక్తులుహాజరవుతారు. ఈ జాతరలో వివిధ కార్యక్రమాలుసంప్రదా యబద్ధంగా ఆదివాసి పద్ధతిలోనిర్వహిస్తారు. ఆదివాసి తెగలు గోండ్(పర్ధాన్)లో గలమేస్రం వంశస్తుల యొక్క వంశ దేవుని గా నాగోబా(సర్పం) ని ఆ రాధి స్తారు. ఎంతో నియమనిష్ఠలతో ఈకార్యక్రమాన్ని నిర్వహణా జరుపుతారు.జారేవి మహాదేవున్నిప్రత్యక్షం చేసుకుని శివుని ద్వారావరం పొందుతుంది. ఈ వరంతో 12 సంవత్సరాలు ప్రతిరోజు నియ మనిష్టలతో బేరులి (మర్రి వృ క్షం) దగ్గరపాము పుట్టకి కల శం లేదా జాక్ తో ప్రతిరోజు పు ట్టక్షలాభిషేవేసి పూజిస్తుంది. ఫలితంగా జార్దేవ్ కి థార్ దేవ్జన్మిస్తారు. భార్ డప్ కి నాగ మోతితో వివాహం జరిపిస్తుంQ. ఈ వివాహ కార్యక్రమాన్ని ఈరా సుఖ తార పర్యవేక్షణలో జరుగుతుంది. వీరు నాగ బీడ్ ప్రాంతంలోస్థిరపడతారు. వారసత్వంగా వస్తున్నాం 'కల 'తం' 'కూల్ 'లేదా 'మురడి 'ని త న కుమారుడైన జలకల్ దేవు నీకిఅప్పగించి వీరు తండ్రి మాట ప్రకారం కేస్లాపూర్ గ్రామంపచ్చి గ్రామానికి పునాది వేసి అక్కడి స్థిరపడతారు. వీరికిఏడుగురు కుమారులు సం కాసం కలరు కేస్లాపూర్ లోపాడిపంటలు, వ్యవసాయం, పంటల అత్యంత దిగుబడితోధన రాశులతో కళకలాడుతుం డెను. అలాంటి సమయంలోకేస్లాపూర్ గ్రామంలోకి దుష్ట శ క్తులు ప్రవేశిస్తాయి. దీంతోతమ పంటలు, సంపద పూర్తిగా నాశ నం అవుతుంది.ఇలాంటి సమ యంలో తమ దైవం నాగోజా, పాము లేదాసర్పం కేస్లాపూర్ గ్రామంలోకి వచ్చి అక్కడే స్థిరా నివాసంఏర్పరుచుకోవడం వల్ల దుష్టశక్తులు మాయమై ము నుపటిపంటలు పశు సంపద సమృద్ధిగా అభివృద్ధి చెందు తుంది.దీనికి ప్రతీక గానే ప్రతి సంవత్సరము గోండ్స్ పుష్యప్రతి ఏడాది జలం తోనాగ దేవునికి అభిషేకంచేసి సాంప్రదాయ, సంగీత నా యిద్యాలతో ఆచారప్రకారం ప్ర తి ఏడాది జాతర జరుపు తు న్నారు.

### * జాతర కి ప్రచారం...

గోండ్స్ ఆదివాసులు తమ ఆచారం ప్రకారం ముందుగా 'చకడా' (ఎడ్ల బండి)తో నాగోబా పీఠాధిపతి ఇంటి నుంచి బయలుదేరి తమ బంధువులు గోండ్ వారి గ్రామాలకి వెళ్లి ప్రదారం చేస్తూ పూజకు కావల సిన కుండలను సిరికొండ గ్రామంలో గల గంగోళ్ళ వంశం వారికి తమ పూజకు కావలసినపట్టికుండలు తయారు చేయ మని చెప్పి కటోడ మరియు గాధే ప్రధాన్ తిరిగి పీఠాధిపతి ఇం టికి చేరుకుంటారు. దీనిని 'అని కూడా అంటా రు.అభిషేకజలం కోసం గోదావరి కి పాదయాత్రనాగోబా పీఠాధిపతి మేస్రం నెం కట్రావు పటేల్ఆవరణలో అం దరూ హాజరై గత ఏడాది పెద్ద మట్టికుండలో భద్రపరిచిన క ల శాన్ని బయటికి తీసి, తొమ్మిదిమీటరుల తెల్లని వస్త్రం లో కళశాన్ని అంచి మూటకట్టి గతసంవత్సరం వాడిన పాత వెదు ఈ కర్రలు తీసుకొనినాలుగు దిక్కులకు నమస్కరించి ముందు వరుసలో ప్రధాన్(పర్ధాన్ ) జాడీ లేదా మూరడి లేదా కలకం కటోడ(పూజారి) తీసుకొని నడు స్తుంటే వెనకాల ఇతర భక్తులుసాంప్రదాయ దుస్తులైన తెల్లని షర్టు తలకి తెల్లని పాగాధరిం చి చెప్పులు లేకుండా





పాద యాత్రలో వీరు పడగాం,సాలే వాడ, హస్నాపూర్, గౌరీ, కల పురుగు దగ్గరగోదావరి ఒడ్డుకు చేరుకుంటారు. గత ఏడాది వాడిన పాతవెదురు కర్రలు గా దావరిలో వదిలిపెట్టి గోదావరికినమస్కరించి ఈ కలశం లో కొత్త జలాన్ని సేకరించితిరుగు ప్ర యాణాన్ని ఉట్నూరు నుండి ఇంద్రవెల్లి చేరుకొని,ఇంద్రవెల్లి లో 'ఇంద్రాణి దేవికి పూజ చేసి అనంతరంకేస్లాపూర్ లో గల ఆలయం ఆవరణలోని మర్రి చెట్టుదగ్గర పాదయాత్రకు వెళ్లిన టువంటి వారు చేరుకుని నీటిపిడిని మర్రి చెట్టుపై కడతారు. మర్రిచెట్టు నీడలో మూడురో జులు సేద తీరుతారు. ఈ స మయంలో తమకుటుంబాల ను తమ ఇతర కుటుంబ స భ్యులు,బంధువులు ఎడ్ల బండ్ల ద్వారా నాగోబాకి చేరుకుం టారు.ఈ మర్రిచెట్టు దగ్గర మూడు రోజులు 'గాదె ప్రధాన్ల రాజ్ గోండుల యొక్క చరిత్ర, నాగోబా చరిత్ర, పురాణాలు,ఇతిహాసాలు, సంగీత వాయి ద్యాం, కిక్రీ వాయిస్తూ పారాయణం చేస్తారు.

### * తూమ్ కార్యక్రమం

మహా పూజకి రెండు రోజులు ముందు మేస్రంవంశీయులు స్వర్గస్తులైన మాతృ, పితృ దేవతల జ్ఞాపకార్ధంనిర్వహించే కార్యక్రమం. మొత్తం కార్యక్రవంశీయులను 22 కి లు అనగా గ్రూపులుగా చేసి వారికివివిధ పనులను విభ జించి 22 కీక్షల వారు పూజకుసంబంధించిన సామాగ్రి, పంట సామాగ్రి ఒకే చోటసేకరిస్తారు దీన్ని 'సేసా' అంటారు.

### * కుర్వీంగ్ సియావాల్:

మేస్రం వంశంలోని వివిధ కీత్త వారు పూజకిసంబంధించిన మట్టికుండలను పంపకాని పీ రాధిపతిపటేల్, కటోడా, గాడే ప్రధాన్, ప్రధాన్స్ సమక్షంలోముందుగా భూమాతకి పూజ చేసి, భూమికి తంబాకు లేదా..బీడీ ఆకు సమర్పించి సమస్క రించి నాలుగు దిక్కులకుసమ స్కరించి ఆనంతరం కిత్తాల వారీగా ఒక్కొక్కరికి పుట్టికుండ లను పంపిణీ చేస్తారు. ఈ మ ట్టి కుండలతో మట్టిచెట్టు దగ్గ ర గల కోనేరు నుండి జలం సేక రించిపూజా కార్యక్రమానికి నైవేద్యం తయారీకి ఈ జలన్నే ఉపయోగిస్తారు. ఈ కార్యక్రమం లో తమ అల్లుళ్ళకు భాగస్వా మ్యం కల్పిస్తారు.

### * పుట్ట తయారు చేయుట

ఆలయం ఆవరణలో గల గత సంవత్సరం తయారుచేసిన మట్టి పుట్టను నూతన వెదురు కర్రలతో అల్లుడు.పగలగొట్టి నీ దీని చల్లి మట్టి బంతులను తయారుచేసిఅంతులను 'సత్తిక్ దేవి' ఆలయం నాగోబా ఆలయంలోమట్టి బంతులకి పూజ చేసి అనంతరం పుట్టి త యారు.చేస్తారు. పుట్ట ఒకరోజు నగలకుండా ఉన్నట్లయితే త మఅన్నదమ్ములు, ఆడ పడుచులు, బందు గణం సుఖ సంతోషాలతో ఉంటారని నమ్ము తారు. ఈ క్రమం కార్యక్రమంజ రుగుతున్నంత సేపు శ్రమ సాం ప్రదాయ సంగీతవాయిద్యాల యిన కండం, బోలు, షెప్రే, కాలికోమ్పుప్పుళ్ళతో కార్యక్ర మం జరుపుతారు.

### * గోవాడ్

నాగోబా స్థల పురాణం ప్రకారం తమ పూర్వీకులకుసంబంధిం చినటువంటి పశువుల పాక ప్ర స్తుతముఇటుకలతో గోవాద్ నిర్మించారు. దీంట్లోనే తమదపడుచులు సేద తీరి శ్రమ పూజ సామాగ్రిని ఉంచి దీపారాధన చేస్తారు. పూజకు సం బంధించినటువంటి నైవేద్యంప్రసాదం అక్కడనే తయారు చేస్తారు.

### * మహా పూజ

ఈ కార్యక్రమంలో బెజ్జా కార్ కి త్త కానుకలుగా అన్నికొత్తలు వారు అందించిన డబ్బుతో పూజ సామాగ్రికొనుగోలు చేసి పుష్య అమావాస్య రోజున రాత్రిసమయంలో నాగోబాకి గో దావరి జలంతో అభిషేకంతోమహా పూజ కార్యక్రమాన్ని ర హస్యంగా కటోడ, పటేల్స్, ప్రధాన్ మాత్రమే చేస్తారు. పూజ అనంతరం తమ బంధువులేగాక భక్తులందరూ హాజరవు తారు. ఈ కార్యక్రమాలతోఆ శర మొదలవుతుంది. దేవుని సందర్శన కూడా మొదలవు శుంది. షహా పూజ జనంతరం అర్ధ రాత్రి సమయంలోఆదివాసి మేస్రం వంశంలోని కొత్త కోడ ళ్ళు అప్పటివరకునాగోబా







## నూతన జేసీగా పదవీ భాద్యతలు స్వీకరించిన డా.నిధి మీనా

వై ఎస్ ఆర్ కడప,జనవరి 17(భారత శక్తి) : వైఎస్ఆర్ కడప జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ గా డా. నిధి మీనా శనివారం ఉదయం పదవీ భాద్యతలు స్వీకరించారు.. జిల్లా సచివాలయం లోని జేసీ ఛాంబర్ నందు ముందుగా పురోహితుల ఆశీర్వచనాలు స్వీకరించిన అనంతరం ఉ.10.45 గంటలకు డా. నిధి మీనా జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా మాట్లాడుతూ... 2019 బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ క్యాడర్ కు చెందిన ఐఏఎస్ అధికారిణి అని, తన సొంత రాష్ట్రం రాజస్థాన్ అన్నారు. డిల్లీ యూనివర్శిటీలో ఎంబీబీఎస్ (వైద్య శాస్త్రం) పూర్తి చేయడం జరిగిందన్నారు. గతంలో తెనాలి సబ్ కలెక్టర్ గా, వయోజన విద్య డైరెక్టర్ గా, ఎన్టీఆర్ జిల్లా జేసీగా విధులు నిర్వహించానన్నారు.కొంతకాలం మాతృత్వపు సెలవులో వెళ్లి తిరిగి ప్రస్తుతం వైఎస్ఆర్ కడప జిల్లా జేసిగా బాధ్యతలు స్వీకరించడం జరిగిందన్నారు. శనివారం నుంచి ప్రభుత్వం తనకు అప్పజెప్పిన



విధులను, బాధ్యతలను 100% పూర్తి చేసేలా పనిచేస్తూ రెవెన్యూ సమస్యల నిలిపేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు. అలాగే జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి గారి ఆదేశానుసారం ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. క్షేత్రస్థాయి లో ఎలాంటి సమస్యలు వున్నా ప్రజా ప్రతినిధులు వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే.. జిల్లా కలెక్టర్, ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా లో ప్రాధాన్యమైన ప్రతి అవసరాన్ని తీర్చేందుకు తనవంతు విధిగా కృషి చేస్తామన్నారు.రెవెన్యూ, రీ సర్వే పనులు,భూ సమస్యలు, పౌర సరఫరాలు,భూ సేకరణ మొదలైన ప్రధాన అంశాలతో పాటు.. అన్ని శాఖలను పటిష్టం చేస్తూ వాటి ఫలాలను లబ్ధిదారులకు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో తాను చేపట్టిన విధులన్నింటినీ 100% సమర్థవంతంగా పూర్తి చేయగలిగానని.. తన మీద నమ్మకంతో తనను ఇక్కడ జేసిగా నియమించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ.. వైఎస్ఆర్ కడప జిల్లా లో 100% సమర్థవంతంగా పనిచేస్తానని, జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని ఆమె తెలిపారు. కాగా జేసీ నిధి మీనా గారు.. కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ సతీమణి కావడం విశేషం. అంతకుముందు నూతన జాయింట్ కలెక్టర్ కు డిఆర్వో విశ్వేశ్వర నాయుడు,కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయ్ కుమార్,అన్ని సెక్షన్ ల పర్యవేక్షకులు ఘన స్వాగతం పలికి ఛాంబర్ కు తీసుకెళ్లారు.

## పారా క్రీడాకారులకు క్రీడా పరికరాలు అందజేసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్, జనవరి 17 (భారత శక్తి): సరూర్ నగర్ వెంకటేశ్వర కాలనీ రోడ్ నెంబర్ 7లో ఉన్న ద్రోణాచార్య పారా స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్&కోచ్ వేణు వినుకోటి దగ్గర శిక్షణ పొందుతున్న జాతీయ, అంతర్జాతీయ పారా క్రీడాకారులకు శిక్షణ కొరకు అవసరమైన క్రీడాపరికరాలు, ప్రోటీన్ ను శనివారం బి.కనకారావు (భారతీయ వైమానిక దళం) విశ్రాంత ఉద్యోగి ఆర్థిక సహాయంతో ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ పరికరాలు అందించిన కనకారావుకి ధన్యవాదాలు తెలిపారు.రాబోయే రోజుల్లో వారు మరిన్ని పతకాలు సాధించాలని కోరారు.వారికి కావాల్సిన సహాయ,సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు.దానికి క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో ఆందోజు సత్యంచారి,తూర్పాటి చిరంజీవి, చంద్రశేఖర్ రెడ్డి,ముద్దగోని సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.